www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## నెత్తురోడిన ఔటర్!


ప్రమాదంలో నుజ్జయిన కారు

ఆదిభట్ల వద్ద ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం 13

ఐదుగురి దుర్మరణం.. కారులో మద్యం సీసాలు?

ముందువెళ్తున్న లారీని అతివేగంగా ఢీకొట్టిన కారు

దైవదర్శనానికని వెళ్లి.. మధ్యలోనే వెనుదిరిగి!

శనివారం | 19-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) : 111 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ.2.42 తదుపరి దశమి; నక్షత్రం: భరణి రా.12.37 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.11.11-12.40; దుర్ముహూర్తం: ఉ.5.54-7.37; అమృతఘడియలు: రా.8.08-9.37; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## సంపన్నులే లక్ష్యంగా కోట్లలో దోపిడీ



2

వ్యాపార రుణాలు, రియల్ ఎస్టేట్

పెట్టుబడుల పేరుతో భారీ మోసం

రూ.500 కోట్లు దోచుకున్న కేటుగాడు

రహస్య గదులతో మాయామహల్ నిర్మాణం

మంగళూరులో అరెస్టు చేసిన పోలీసులు

8 ఏళ్ల క్రితం కూలీ.. ఇప్పుడు కోటీశ్వరుడు



2

## సిద్దూ మరణించారట..

కర్ణాటక సీఎంను 'చంపేసిన' మెటా.. అనువాదంలో తప్పు

ముఖ్యమంత్రి ఆగ్రహం.. క్షమాపణలు చెప్పిన సంస్థ

## గుర్తింపు పొందని పార్టీల రాబడి 223% పెరుగుదల

టాప్ టెన్ పార్టీల ఆదాయమే రూ.1,581 కోట్లు

వీటిలో గుజరాత్‌లోని పార్టీల వాటా 1,158 కోట్లు

గుర్తింపు పొందని పార్టీలు దేశవ్యాప్తంగా 2,764

739 పార్టీల ఆడిట్ వివరాలే అందుబాటులో

ఈసీ వద్ద నమోదై గుర్తింపు పొందని పార్టీలు ఆంధ్రప్రదేశ్‌లో 129.. తెలంగాణలో 78

2022-23 ఆర్థిక సంవత్సరంపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొని, గుర్తింపు పొందని రాజకీయ పార్టీల ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 223 శాతం పెరిగింది. గుర్తింపు పొందని పార్టీల్లో 73శాతం పార్టీలు తమ ఆర్థిక లావాదేవీలను బహిర్గతపర్చడంలో విఫలమయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ప్రకటించింది. ఏడీఆర్

మిగతా 2వ పేజీలో...

## మంత్రుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారు

భట్టి, పొంగులేటి, ఉత్తమ్ తన సీటుకు ఎసరుపెడతారని సీఎం రేవంత్ భావిస్తున్నారు

మా ఫోన్లు సహా వేలాది ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి

దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్షలకు రావాలి

నేను లోకేశ్‌ను కలవలేదు.. కలిస్తే తప్పేంటి?: కేటీఆర్

హౌలే, నికృష్టుడు, పెంటపురుగు, ఏం పీకావ్, మగాడివైతే రా.. అంటూ సీఎంపై పరుష పదజాలం

తెలంగాణలో చిల్లర పోలీసింగ్ నడుస్తోంది!

ఒక్కొక్కడిని ఏం చేయాలో రాసిపెడ్తున్నం: కేటీఆర్



ఖమ్మం/హైదరాబాద్ సిటీ/మల్కాజ్‌గిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తన సీటుకు ఎవరు, ఎలా ఎసరుపెడతారోనని చెప్పి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌ల ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో తమ ఫోన్లు సహా వేలాది ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని.. దీనిపై లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా? మగాడివైతే రా అని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'హౌలే, నికృష్టుడు, పెంటపురుగు, ఏం పీకావ్, పిచ్చివాగుడు..' అంటూ పరుష

మిగతా 12వ పేజీలో...

### కాంగ్రెస్ హయాంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందేమో!: బండి 12


నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో జరిగిన సభలో మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు దామోదర, జూపల్లి, శ్రీహరి

# పదేళ్లూ నేనే..!

**పాలమూరు బిడ్డ సీఎంగా ఉండడం ఖాయం.. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావాలి**

**మా మంచి పనులు చెబుతుంటే కుమిలి కుమిలి ఏడవాలి.. ఆయనను అసెంబ్లీకి పిలుస్తున్నది అందుకే**

కేసీఆర్ బావిలో దూకినా, పెట్రోల్ పోసుకుని అంటించుకున్నా తెలంగాణలో అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదు

రాబోయే రెండున్నరేళ్లలో మరో 41 వేల కొలువుల భర్తీ

వర్గీకరణతో ఉపకులాల బిడ్డలకు మెడిసిన్, ఇంజనీరింగ్ సీట్లు

పాలమూరు ప్రాజెక్టులకు డిసెంబరు 9లోపు నిధుల మంజూరు

కొల్లాపూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

రాయలసీమ ఎత్తిపోతలను రద్దు చేయాలని బాబుకు వినతి

విజ్ఞప్తులు చేస్తామని, వినకుంటే పోరాటమేనని హెచ్చరిక

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు బిడ్డనైన తాను పదేండ్ల వరకు సీఎంగా ఉండడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. "కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. ప్రతిపక్షంలో కూర్చోవాలి. మేం చేసే మంచి పనుల గురించి చెబుతుంటే నువ్వు కుమిలి కుమిలి ఏడవాలి. అందుకే ఆయన్ను అసెంబ్లీకి పిలుస్తున్నాం" అని చెప్పారు. కేసీఆర్ కడుపులో మంట పెట్టుకొని కళ్లల్లో నీళ్లు కారుస్తున్నాడని, కడుపులో విషం ఉంటే ఆరోగ్య సమస్యలు వచ్చి ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుందని విమర్శించారు. కడుపులో విషం ఉంటే కోసి తీసివేస్తారని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలులో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం సీఎం శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,52,635 మంది మహిళలకు రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. అనంతరం జరిగిన 'ప్రజా పాలన - ప్రగతి బాట' బహిరంగ సభలో

మిగతా 13వ పేజీలో...

## ప్రభుత్వం.. ఎవరి ఫోన్లూ ట్యాప్ చేయట్లే

- మీ దగ్గర సమాచారం ఉంటే పంపించండి
- సీఎంను హౌలే, సన్నాసి అనడం ఏం సంస్కృతి?
- నీటి వాటాలు తేల్చకుండా నిద్రపోయింది మీరే
- కేటీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం
- ఫోన్ల ట్యాపింగ్ అలవాటు మాకు లేదు: ఉత్తమ్
- కేటీఆర్ ఆరోపణలు నిరాధారం: పొంగులేటి
- ఘోరంగా ఓడినా.. మీ మాట తీరు మార్చుకోలేదు
- ఆత్మవిమర్శ చేసుకోండి.. కేటీఆర్‌పై తుమ్మల ధ్వజం



హైదరాబాద్/ నాగార్జునసాగర్/ఖమ్మం/భద్రాచలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌పై మరో సారి దుమారం రేగింది. ముగ్గురు మంత్రుల ఫోన్లను సీఎం రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను భట్టి విక్రమార్క, ఉత్తమ్, పొంగులేటి ఖండించారు. అలాగే, రేవంత్‌ను అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో ఎవరి ఫోన్లను తమ ప్రభుత్వం ట్యాప్ చేయడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేటీఆర్ ఏ సమాచారంతో ఈ వ్యాఖ్యలు చేశారో తనకు తెలియదని, ఆయన వ్యాఖ్యలు అర్థరహితమని అన్నారు. ఆయన దగ్గర ఏదైనా సమాచారం ఉంటే పంపించాలని సూచించారు. "సీఎం స్థాయి వ్యక్తిని హౌలే, సన్నాసి అనడం ఏం భాష? ఏం సంస్కృతి? అధికారం పోయిందనే అక్కసుతో సమాజం సిగ్గుపడేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు" అని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన తప్పులను సీఎం రేవంత్, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సరిదిద్దుకుంటూ వస్తున్నారని

మిగతా 12వ పేజీలో...

# కుండపోత

**హైదరాబాద్‌లో భారీవర్షం.. నగరం అతలాకుతలం**

ప్రధాన రోడ్లను ముంచేసిన వరదలు

పికెట్‌లో అత్యధికంగా 11.4 సెం.మీ.

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

ట్రాఫిక్‌జామ్.. వాహనదారులకు నరకం

లోతట్టు ప్రాంతాల్లో సెల్లార్లు, ఇళ్లలోకి నీరు

సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ జలదిగ్బంధం

పడవల్లో సురక్షిత ప్రాంతానికి జనం

పలు జిల్లాల్లో వర్షాలు.. రైతుల్లో ఆనందం

'రంగారెడ్డి'లో గోడ కూలి మహిళ మృతి

4 రోజులు వర్షాలు: వాతావరణ కేంద్రం

అధికారులూ అప్రమత్తంగా ఉండండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన


హైదరాబాద్‌లోని కొత్తగూడ ఫ్లైఓవర్‌పై భారీగా నిలిచిన నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కొద్దిరోజులుగా వచ్చీ రానట్లు పలకరించి పోతున్న వరుణుడు.. శుక్రవారం ఒక్కసారిగా విజృంభించాడు. ప్రత్యేకించి రాజధాని హైదరాబాద్ నగరాన్ని కుండపోతతో వణికించాడు. మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 7గంటల వరకు నగరంలో వాన.. దంచికొట్టింది. మారేడ్‌పల్లి పికెట్‌లో అత్యధికంగా 11.4 సెంటీమీటర్లు, బోయిన్‌పల్లిలో 11.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కురిసిన అత్యధిక వర్షపాతం ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా వచ్చిన వరదలతో గ్రేటర్‌లో లోతట్టు ప్రాంతాలు

మిగతా 10వ పేజీలో...



# 4 వరసలుగా.. 15 జాతీయ రహదారులు

రాష్ట్రంలో 33 వేల కోట్లతో పనులు

1123 కిలోమీటర్ల మేర అభివృద్ధి

పనులకు కేంద్రం పచ్చజెండా!

అటవీ, ఇతర అనుమతులు, భూ సేకరణ బాధ్యత రాష్ట్రానిదే..

నిర్మాణ పనుల వ్యయం కేంద్రానిది

ట్రాఫిక్‌ను బట్టి రోడ్లపై టోల్‌ప్లాజాలు

2028 కల్లా పూర్తి చేయాలని లక్ష్యం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులను విస్తరించనున్నారు. 1123 కిలోమీటర్ల మేర ప్రస్తుతం 2 వరసలుగా ఉన్న 15 రహదారులను 4 వరసలుగా అభివృద్ధి చేయనున్నారు. రూ.33,690 కోట్ల వ్యయమయ్యే ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తెలంగాణ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న పలు జాతీయ రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలను అనుసంధానించడం, ఇప్పటికే ట్రాఫిక్ అధికంగా ఉన్నట్లు గుర్తించిన పలు జాతీయ రహదారుల విస్తరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. తమ పరిధిలో ఉన్న జాతీయ రోడ్లను విస్తరించాలని

మిగతా 14వ పేజీలో...

## హెచ్‌సీఏ కార్యాలయంలో సీఐడీ సోదాలు

జగన్‌మోహన్‌రావును ఉప్పల్ తీసుకెళ్లిన సీఐడీ అధికారులు

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఆయన హయాంలో చేసిన ఖర్చుపై ఆరా

టెండర్లు లేకుండానే పనులు అప్పగించడంపై ఈడీ దృష్టి

క్విడ్‌ప్రో కో కోణంలో విచారణ


జగన్‌మోహన్‌రావు (ఫైల్)

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం కేసులో సీఐడీ అధికారులు శుక్రవారం ఉప్పల్‌లోని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యాలయంలో సోదాలు జరిపారు. ఈ కేసులో అరెస్టై.. సీఐడీ కస్టడీలో ఉన్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును కూడా వెంట తీసుకువచ్చి, తనిఖీలను కొనసాగించారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో వీవీఐపీ బాక్స్‌కు తాళం వేసిన వైనానికి సంబంధించి జగన్‌మోహన్‌రావును అక్కడికి తీసుకువెళ్లి.. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఆ తర్వాత జగన్‌ను గౌలిపురలోని శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌కు తీసుకుని వెళ్లారు. ఫోర్జరీ పత్రాల తయారీ తదితర అంశాలపై జగన్, ఇతర నిందితులను సీఐడీ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. తాజాగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఇచ్చిన మరో ఫిర్యాదు ఆధారంగా ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టులను పరిశీలిస్తున్నారు. బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధి కోసం అందిన నిధులను జగన్ బృందం తమ వారికి కాంట్రాక్టులు అప్పజెప్పి, అందినకాడికి దోచుకుందంటూ రాతపూర్వకంగా ఫిర్యాదు వచ్చిన క్రమంలో.. ఆ విషయాన్ని రికార్డుల పరంగా విశ్లేషిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల కంపెనీకి ఇచ్చిన ఐపీఎల్ టికెట్ల కాంట్రాక్టులో నిబంధనలు పాటించారా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. అదే సమయంలో జగన్ హెచ్‌సీఏ అధ్యక్షుడు అయినప్పటి

మిగతా 14వ పేజీలో...

## బాలలకు రక్తపరీక్షలు

అంగన్‌వాడీ నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు

చిన్నారుల్లో ఎదుగుదల లేకపోవడం, బాలికల్లో రక్తహీనత పెరుగుతుండడంతో నిర్ణయం 14

పిల్లల ఆరోగ్యంపై ప్రతినెలా 'గ్రోత్ ప్రోగ్రెస్ రిపోర్టు'

'మిషన్-100 డేస్' పేరుతో ఆరోగ్యంపై ప్రచారం



## బీసీలకు రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై న్యాయసలహా! 13

అధికారులతో చర్చించిన తర్వాత కోరిన గవర్నర్


## నగదు దొరికితే దోషినా?

ఆ డబ్బు ఎవరు, ఎప్పుడు, ఎలా పెట్టారో తేల్చలేదు

2 అంతర్గత విచారణ మొత్తం లోపాలమయం

వాదన చెప్పుకునేందుకూ సమయం ఇవ్వలేదు

హైకోర్టు జడ్జిపై విచారణకు ఆదేశించే అధికారం సీజేఐకి లేదు: సుప్రీంలో జస్టిస్ వర్మ పిటిషన్



3

నాగారం ఐఏఎస్, ఐపీఎస్‌ల భూములపై

## విచారణ కమిషన్ వేస్తారా?

వివరణ ఇవ్వాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు

## అబూజ్‌మడ్‌లో ఆరుగురు నక్సల్స్ కాల్చివేత 3

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం!

ఏకే-47, ఎస్ఎల్ఆర్ తుపాకీ స్వాధీనం

వారోత్సవాల వేళ మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఏడాది కాలంలో 357 మంది మృతి

## మద్యం కుంభకోణంలో బఘేల్ కుమారుడి అరెస్టు




న్యూఢిల్లీ, జూలై 18: మద్యం కుంభకోణంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ శుక్రవారం అరెస్టు చేసింది. ఆయనను ఈడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయాధికారి అయిదు రోజుల రిమాండ్ విధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో ఉన్న నివాసంలో ఉండగా ఈడీ అధికారులు అరెస్టు చేశారు. 2019-2022 మధ్యకాలంలో భూపేష్ బఘేల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.2,160 కోట్ల మేర మద్యం కుంభకోణం జరిగిందంటూ ఈడీ కేసు నమోదు చేసింది. చైతన్య బఘేల్ ఆధ్వర్యంలో సమాంతర వ్యవస్థ నడిచిందని, అక్రమ మార్గాల్లో సొమ్ము ఆయనకు చేరిందని ఆరోపించింది. ఈ సందర్భంగా భూపేష్ బఘేల్ మీడియాతో మాట్లాడుతూ పుట్టిన రోజునాడు కుమారుడిని అరెస్టు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదానీకి కేటాయించిన బొగ్గు బ్లాకుల ప్రాంతంలో వేలాది చెట్లను నరికివేశారని, దీనిపై శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నిస్తామని తెలిసే మోదీ-అమిత్ షాలు కేంద్ర దర్యాప్తు సంస్థలను పంపించారని ఆరోపించారు.

### ఇండియా కూటమికి ఆప్ గుడ్ బై!

న్యూఢిల్లీ, జూలై 18: విపక్ష ఇండియా కూటమిలో కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) భాగం కాదని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ శుక్రవారం స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఇండియా కూటమి పార్టీల నేతలు శనివారం సాయంత్రం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ తరుణంలో సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. "ఇండియా కూటమితో మా పొత్తు 2024 లోక్‌సభ ఎన్నికల కోసమే. ఢిల్లీ, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగానే పోటీ చేశాం. బిహార్‌లోనూ ఒంటరిగానే పోటీ చేయబోతున్నాం. పంజాబ్, గుజరాత్‌లో ఉప ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేశాం. ఇండియా కూటమిలో ఆప్ భాగం కాదు" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపైనా సంజయ్ సింగ్ విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడంలో ఆ పార్టీ పాత్రను ఆయన ప్రశ్నించారు.

### మా బావను పదేళ్లుగా వేధిస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 18: గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తన బావను వేధిస్తోందని శుక్రవారం రాహుల్ గాంధీ ఆరోపించారు. హర్యానాలోని షికోహ్‌పూర్‌లో జరిగిన భూఒప్పందంలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్‌వాద్రాపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. "దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనే ధైర్యం రాబర్ట్ వాద్రా, ప్రియాంకల కుటుంబానికి ఉందని నాకు తెలుసు. నేనూ వారికి అండగా నిలుస్తాను. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. "ఇది కాంగ్రెస్ ఎమర్జెన్సీ మైండ్‌సెట్‌కు నిదర్శనం. న్యాయవ్యవస్థను గౌరవించని మాటలివి" అని బీజేపీ జాతీయ ప్రతినిధి తుహిన్ సిన్హా అన్నారు. రాహుల్‌కు తన బావ చేసిన చీకటి వ్యవహారాల గురించి తెలుసని, వాటిలో ఆయనకూ భాగస్వామ్యం ఉండేమోనని అన్నారు.

### ఢిల్లీ, బెంగళూరులో బడులకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, బెంగళూరు, జూలై 18: దేశ రాజధాని ఢిల్లీ, కర్ణాటక రాజధాని బెంగళూరులో పాఠశాలలకు శుక్రవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఢిల్లీలో ఈ వారంలో ఇప్పటికే నాలుగుసార్లు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ పోలీసులు బాంబు బెదిరింపులు వచ్చిన పాఠశాలల్లో అత్యవసర స్పందన బృందాలు, బాంబు నిర్వీర్య బృందాలు, జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ బాంబు బెదిరింపులు వచ్చిన వాటిలో మూడు కళాశాలలు కూడా ఉన్నాయి. తరగతి గదుల్లో నల్లటి బ్యాగుల్లో అనేక బాంబులు పెట్టినట్లు ఆయా పాఠశాలలకు ఈ మెయిళ్ల ద్వారా బెదిరింపులు వచ్చాయని ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదన్నారు. కాగా బెంగళూరులోని 50 బడులకు శుక్రవారం ఇదేవిధమైన బాంబు బెదిరింపులు వచ్చాయి. అవన్నీ ఉత్తుత్తివేనని తేలిందని పోలీసులు తెలిపారు.

### 500 కోట్లతో టాటా గ్రూపు చారిటబుల్ ట్రస్టు

» ఎయిరిండియా విమాన ప్రమాద బాధితుల కోసం ఏర్పాటు

న్యూఢిల్లీ, జూలై 18: ఎయిరిండియా విమాన ప్రమాద బాధితుల కోసం 500 కోట్ల రూపాయలతో ఓ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేస్తున్నట్లు టాటా గ్రూపు ప్రకటించింది. ముంబైలో నమోదైన ఆ ట్రస్టుకు టాటా సన్స్, టాటా ట్రస్టుల ద్వారా 250 కోట్ల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి, ప్రమాదంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమైన వారికి ట్రస్టు తక్షణ సహాయం చేస్తుందని టాటా సన్స్ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం, గాయపడిన వారికి వైద్య సహాయం అందించడంతో పాటు ప్రమాదంలో ధ్వంసమైన బీజే మెడికల్ కళాశాల హాస్టల్ భవనం పునర్నిర్మాణానికి సహాయం అందించనున్నట్లు పేర్కొంది.

### మహారాష్ట్రలో క్రైస్తవుల ఎస్సీ సర్టిఫికెట్లు రద్దు

» హిందు, బౌద్ధ, సిక్కు మతాల వారికే పరిమితం: ఫడణవీస్

ముంబై, జూలై 18: హిందు, బౌద్ధ, సిక్కు మతాలవారు కాకుండా ఇతరులు ఎస్సీ ధ్రువపత్రాలను పొంది ఉంటే వాటన్నింటినీ రద్దు చేస్తామని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ శుక్రవారం ప్రకటించారు. ఇతర మతాల వారు తప్పుడు మార్గాల్లో ఎస్సీ సర్టిఫికెట్లను సమర్పించి, ఉద్యోగాలు పొంది ఉంటే అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటివారు ఎలక్షన్లలో విజయం సాధించి ఉంటే ఆ ఎన్నికను రద్దు చేయిస్తామని చెప్పారు. శాసన మండలిలో బీజేపీ సభ్యుడు అమిత్ గోర్ఖే ప్రవేశపెట్టిన సావధాన తీర్మానంపై సమాధానం ఇస్తూ సీఎం ఈ విషయాలను వెల్లడించారు. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల వారికే ఎస్సీ సర్టిఫికెట్లు వర్తిస్తాయని చెప్పారు. తప్పుడు సర్టిఫికెట్‌తో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలను పొందితే ఆ సొమ్మును వసూలు చేస్తామని చెప్పారు.

### టీఆర్ఎఫ్ ప్రపంచ ఉగ్రవాద సంస్థ: అమెరికా

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూలై 18: పహల్గాంలో దారుణ మారణకాండకు పాల్పడి 26 మందిని బలిగొన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)'ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తాయిబా అనుబంధ సంస్థ అయిన టీఆర్ఎఫ్.. పహల్గాం ఘటనకు ముందు కూడా పలు ఉగ్రదాడులకు పాల్పడింది. ఈ క్రమంలోనే టీఆర్ఎఫ్‌ను 'విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీవో)', 'ప్రత్యేకంగా గుర్తించిన అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ (ఎస్‌డీజీటీ)'గా గుర్తిస్తున్నట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ప్రకటన విడుదల చేశారు. "పహల్గాం ఉగ్రదాడి విషయంలో న్యాయం జరగాలన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్ష మేరకు టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా గుర్తిస్తున్నాం" అని రూబియో పేర్కొన్నారు. అమెరికా నిర్ణయంపై విదేశాంగ మంత్రి జైశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది అమెరికా సరైన సమయంలో తీసుకున్న కీలక నిర్ణయమని.. భారత్-అమెరికా మధ్య ఉగ్రవాద వ్యతిరేక సహకారాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

### గిల్గిట్-బాల్టిస్థాన్‌లో మసూద్ అజార్!

న్యూఢిల్లీ, జూలై 18: భారత్‌కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైష్-ఎ-మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో తలదాచుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన చేపట్టిన సమయంలో మసూద్ బహావల్‌పూర్‌లో ఉండగా.. క్షిపణి దాడుల్లో అతని కుటుంబ సభ్యులు చనిపోయిన విషయం తెలిసిందే.! ఆ తర్వాత అతని జాడ తెలియలేదు. అయితే.. తాజాగా బహావల్‌పూర్ నుంచి సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉండే గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతంలో మసూద్ కనిపించినట్లు భారత నిఘావర్గాలు గుర్తించాయి. గిల్గిట్-బాల్టిస్థాన్‌లోని స్కార్డ్ నగరంలోని సద్‌పారా రోడ్డులో మసూద్ కనిపించినట్లు సమాచారం.

## నగదు దొరికినంత మాత్రాన దోషినా!?



**ఆ డబ్బు ఎవరు ఎప్పుడు ఎలా పెట్టారో తేల్చలేదు.. ఆ నగదుకు యజమాని ఎవరో గుర్తించలేదు**

» అగ్ని ప్రమాదానికి కారణాలనూ తేల్చలేదు
» అంతర్గత విచారణంతా లోపాలమయం
» హైకోర్టు జడ్జిపై విచారణకు ఆదేశించే అధికారం సీజేఐకి లేదు
» సుప్రీం కోర్టులో జస్టిస్ వర్మ పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 18: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున దొరికిన నగదుకు భారత ప్రధాన న్యాయమూర్తి నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ (పంజాబ్, హరియాణా చీఫ్ జస్టిస్ షీల్ నాగ్; హిమాచల్ ప్రదేశ్ చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్) తనను దోషిగా నిర్ధారించడానికి చేపట్టిన ప్రక్రియ చట్టబద్ధతను ఆయన ప్రశ్నించారు. ఎక్కడా మచ్చ లేకుండా 11 ఏళ్లు న్యాయమూర్తిగా పని చేశానని, విచారణ కమిటీ చేపట్టిన ప్రక్రియే లోపాలమయమని, తన వాదన వినిపించుకోవడానికి తనకు తగినంత సమయం ఇవ్వలేదని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్లో ఆయన పేర్కొన్నారు. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో మార్చి 14వ తేదీ రాత్రి అగ్ని ప్రమాదం జరగడం.. సగం కాలిన నోట్లు దొరకడం తెలిసిందే. దీనిపై ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా కేంద్ర హోం శాఖకు, ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలోనే, సుప్రీం కోర్టు అప్పటి చీఫ్ జస్టిస్ సంజయ్ ఖన్నా ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. నాలుగైదు గోనె సంచుల్లో సగం కాలిన రూ.500 నోట్లు దొరికాయని ఢిల్లీ పోలీసు కమిషనర్ నివేదించిన విషయాన్ని తన నివేదికలో కమిటీ ప్రస్తావించింది. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్ రూమ్‌లో నగదు దొరికిన విషయం నిజమేనని భౌతిక, ఎలక్ట్రానిక్ ఆధారాలు, నిపుణులు అందించిన సాక్ష్యాధారాలను బట్టి తేల్చినట్లు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు నివేదించింది. సరిగ్గా, ఈ అంశంపైనే జస్టిస్ వర్మ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "నా అధికారిక నివాసం స్టోర్ రూమ్‌లో నగదు దొరికినంత మాత్రాన నా దోషిత్వం నిరూపించినట్లు కాదు. ఆ నగదుకు యజమాని ఎవరనే విషయాన్ని కమిటీ గుర్తించలేదు. నిర్దిష్ట సాక్ష్యాధారాలతో కమిటీ ఆ ప్రాంగణంలోకి ప్రవేశించలేదు. ఏవో కొన్ని ఊహాగానాల ఆధారంగా వచ్చారు. నా దృష్టిలో అవి చెల్లవు. ముందే ఒక నిర్ణయానికి వచ్చేసి.. దాని ఆధారంగా కమిటీ విచారణ ప్రక్రియను హడావుడిగా చేసేసింది. నాకు తగినంత సమయం ఇవ్వలేదు. ఔట్‌హౌస్‌లో నగదు దొరికిందనే అంశంతో నాకు ఎటువంటి విభేదం లేదు. నగదు దొరికినంత మాత్రానే నేను తప్పు చేశానని చెప్పలేరు. ఆ నగదుకు యజమాని ఎవరు!? అది ఎవరి నియంత్రణలో ఉందనే అంశంపై నిర్దిష్ట ఆధారాల్లేకుండా నాకు సంబంధం అంటగట్టలేరు. నగదును ఔట్ హౌస్‌లో ఎవరు, ఎప్పుడు, ఎలా పెట్టారు!? ఎంత నగదు ఉంచారు? ఆ నగదు అసలుదా కాదా!? అగ్ని ప్రమాదానికి కారణం ఏమిటి? కాలిన నగదు అవశేషాల తొలగింపులో పిటిషనర్‌కు ఏమైనా సంబంధం ఉందా!? అనే అంశాలకు విచారణ కమిటీ జవాబు చెప్పాల్సి ఉంది" అని ఆయన తన పిటిషన్లో పేర్కొన్నారు. కమిటీ నివేదికలో ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పలేదని, అందువల్ల, తనను దోషిగా తేల్చలేరని అభ్యంతరం వ్యక్తం చేశారు. నగదు దొరికినంత మాత్రాన తుది నిర్ణయానికి రాలేరని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం ఉద్దేశపూర్వకమా లేక ప్రమాదవశాత్తు జరిగిందా!? అన్న అంశమూ కీలకమన్నారు. తాను కోరినా సీసీటీవీ ఫుటేజీ వంటి ఆధారాలను సేకరించడంలో కమిటీ విఫలమైందని, వ్యక్తిగత విచారణకు నిరాకరించిందని, తనపై నిర్దిష్టంగా ఎటువంటి కేసు పెట్టలేకపోయిందని, పైగా, తనకు తెలియకుండానే నిరూపించుకునే భారాన్ని తిరిగి తనపై మోపిందని ఆరోపించారు. అంతేనా, అంతర్గత విచారణకు ఎటువంటి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. విచారణ కమిటీని నియమించడం అధికార దుర్వినియోగమని ఆరోపించారు. హైకోర్టు న్యాయమూర్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారాన్ని రాజ్యాంగం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు ఇవ్వలేదని, అంతర్గత విచారణకు ఆయన ఆదేశించజాలరని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా తనను తొలగించాలంటూ సిఫారసు చేయజాలరని తెలిపారు. విచారణకు ముందే ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను బహిర్గతపరిచారని, తద్వారా తన గౌరవానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

### ప్రభుత్వానికి సంబంధం లేదు: కేంద్ర న్యాయ మంత్రి

జస్టిస్ వర్మపై పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనే అంశం పూర్తిగా ఎంపీలకు సంబంధించిన అంశమని, ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వ్యాఖ్యానించారు. అంతర్గత కమిటీ తన నివేదికను సమర్పించిందని, దానితో విభేదిస్తే జస్టిస్ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. లోక్‌సభలో వంద మంది; రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతు ఉంటే న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానాన్ని ఆమోదించవచ్చని తెలిపారు. కాగా, జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా పెట్టే అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, తీర్మానంపై కాంగ్రెస్ ఎంపీలు కూడా సంతకాలు చేస్తారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తెలిపారు. ఆయనను తొలగించాలంటూ రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా లేఖ రాయడం ద్వారా తమకు ఇష్టం లేకపోయినా తీర్మానాన్ని ఆమోదించక తప్పడం లేదని వ్యాఖ్యానించారు.

## లోకం తీరు



### లాలు కేసు విచారణపై 'స్టే'కు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 18: తనపై ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే ఇవ్వాలని కోరుతూ ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ చేసిన వినతిని శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయన కోర్టుకు హాజరుకాకుండా మినహాయింపు ఇచ్చింది. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు పట్నాలో విలువైన భూములు తీసుకొని అందుకు ప్రతిగా వాటి సొంతదార్లకు రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగాలు ఇచ్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుపై ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. మరోవైపు ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. కాగా, ఈ క్వాష్ పిటిషన్‌పై త్వరగా విచారణ జరపాలని ఢిల్లీ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

### వృద్ధ ఖైదీల విడుదలకు ఉమ్మడి విధానం ఉండాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 18: వృద్ధ ఖైదీల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఉమ్మడిగా నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం కారాగార నిబంధనలు రాష్ట్రాల వారీగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల 70 ఏళ్లు దాటినవారు, నయంకాని రోగాలతో బాధపడుతూ అంత్యదశలో ఉన్న ఖైదీలను విడుదల చేసేందుకు ఏకరూప విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వృద్ధ ఖైదీల విడుదల విషయమై జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా) దాఖలు చేసిన వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

### భర్తతో శృంగారానికి నిరాకరించడం క్రూరత్వమే..

» ఆ కారణంతో విడాకులివ్వొచ్చు: బాంబే హైకోర్టు

ముంబై, జూలై 18: భర్తతో శృంగారానికి నిరాకరించడం, వివాహేతర సంబంధాలున్నాయని అతడిని అనుమానించడం క్రూరత్వం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు వెల్లడించింది. ఈ కారణం కింద విడాకులు ఇవ్వొచ్చని స్పష్టం చేసింది. ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకులను సవాల్ చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. 2013లో సదరు జంటకు వివాహం కాగా.. మరుసటి ఏడాది నుంచే భర్తతో ఆమె విడిగా ఉంటోంది. దీంతో 2015లో ఆమె భర్త క్రూరత్వం కింద విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించగా.. అతడికి అనుకూలంగా తీర్పునిచ్చింది. తాజాగా హైకోర్టులో విచారణ సందర్భంగా.. తనతో శృంగారానికి నిరాకరించడంతో పాటు వివాహేతర సంబంధాలున్నాయని భార్య పదే పదే అనుమానించేదని సదరు భర్త పేర్కొన్నాడు. తనను విడిచి పుట్టింటికి వదిలి వెళ్లినప్పట్నుంచి అసలు పట్టించుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చాడు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ఆ జంట మధ్య వివాహ బంధం పూర్తిగా విచ్ఛిన్నమైందంటూ మహిళ పిటిషన్‌ను కొట్టివేసింది.

## సిద్దరామయ్య మరణించారట!

» అనువాదంలో మెటా పొరబాటు
» కర్ణాటక సీఎం ఆగ్రహం
» క్షమాపణలు చెప్పిన సంస్థ



బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మరణించారట. ఓ సంతాప సందేశాన్ని తప్పుగా అనువదించడం ద్వారా 'మెటా' సంస్థ సృష్టించిన కలకలమిది. సోషల్ మీడియా వేదికగా మెటా చేసిన తప్పును చూసి నెటిజన్లు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఆ సంస్థపై సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలేం జరిగిందంటే.. ఇటీవల సీనియర్ నటి బి.సరోజాదేవి కన్నుమూసిన సందర్భంగా సంతాపం తెలుపుతూ సీఎం కార్యాలయం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సందేశం పెట్టింది. అయితే కన్నడ భాషలో ఉన్న ఆ సందేశాన్ని మెటా ఆటోమేటిక్ ట్రాన్స్‌లేషన్ టూల్ ఇంగ్లిష్‌లోకి "చీఫ్ మినిస్టర్ సిద్దరామయ్య నిన్న కన్నుమూశారు. సరోజాదేవి పార్థివదేహానికి నివాళులు అర్పించారు" అంటూ తప్పుగా అనువదించింది. దీన్ని గమనించిన సిద్దరామయ్య అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై సిద్దరామయ్య స్పందిస్తూ.. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కచ్చితంగా అనువదించే వరకు కన్నడ ఆటో ట్రాన్స్‌లేషన్‌ను నిలిపివేయాలని మెటాపై మండిపడ్డారు. మెటా చేసిన పొరపాటుతో ప్రజలకు తప్పుడు సందేశం వెళ్లిందన్నారు. కన్నడ విశిష్టతకు భంగం కలిగేలా అనువదించడం సరికాదన్నారు. ఏదైనా అధికారిక సమాచారం విషయంలో ఇలాంటి అనువాదం చాలా ప్రమాదకమన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మెటా సంస్థకు అధికారికంగా తన మీడియా సలహాదారు లేఖ రాశారని ఎక్స్‌లో తెలిపారు. ఆ లేఖను కూడా పోస్టు చేశారు. కన్నడ భాషా నిపుణుల చేత తర్జుమా చేయించాలని ఆ లేఖలో సూచించారు. తరచుగా తప్పులు దొర్లే ఇలాంటి తర్జుమాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. తన తప్పు తెలుసుకున్న మెటా సంస్థ క్షమాపణలు కోరింది. పొరపాట్లను పునరావృతం కానివ్వబోమని హామీ ఇచ్చింది. ఆ సంస్థ అధికార ప్రతినిధి పీటీఐతో మాట్లాడుతూ, అనువాదంలో తప్పును సరిచేశామని, జరిగినదానికి క్షమాపణ చెబుతున్నామని అన్నారు.

## సంపన్నులే లక్ష్యంగా కోట్లలో దోపిడీ


సల్దానా నివాసంలో మద్యం సీసాలు

**వ్యాపార రుణాలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం**

» రూ.500 కోట్లు దోచుకున్న కేటుగాడు
» సంపన్న వ్యాపార వర్గాలే లక్ష్యంగా వల
» మంగళూరులో అరెస్టు చేసిన పోలీసులు
» 8 ఏళ్ల క్రితం కూలీ.. మోసాలతో కోట్లకు పడగలు

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సంపన్న వ్యాపార వర్గాలే లక్ష్యంగా రూ.కోట్లలో మోసాలకు పాల్పడుతున్న రొనాల్డ్ సల్దానా(45) అనే వ్యక్తిని మంగళూరు నగర పోలీసులు అరెస్టు చేశారు. వ్యాపారులకు రూ.600 కోట్ల వరకు అప్పులు ఇప్పించగల సత్తా ఉందని.. ప్రభుత్వంలోనూ మంచి పలుకుబడి ఉందని నమ్మించి ప్రాసెసింగ్ ఫీజులు, లీగల్ క్లియరెన్సుల పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.50 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు గుంజినట్టు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరిట కూడా మరికొందరిని మోసం చేసినట్టు తెలుసుకున్నారు. ఇలా.. రూ.500 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. మోసపూరితంగా పోగేసుకున్న సొమ్ముతో రొనాల్డ్ మాయామహల్ వంటి ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ మోసాలపై ఫిర్యాదులు అందుకున్న మంగళూరు పోలీస్ కమిషనర్ సుధీర్ కుమార్ రెడ్డి తన బృందంతో.. స్వయంగా రంగంలోకి దిగి గురువారం అర్ధరాత్రి మాయామహల్‌పై ఆకస్మికంగా దాడులు చేసి.. అతనిని అరెస్టు చేశారు. 2016 వరకు కూలి పనులు చేసుకుని పొట్ట పోసుకున్న సల్దానా.. ఆ తర్వాత ఎనిమిదేళ్ల కాలంలో అత్యంత సంపన్నుడిగా ఎదిగాడు. తనను తాను పారిశ్రామికవేత్తగా పరిచయం చేసుకుని, డబ్బున్నవారిపై వల విసిరేవాడు. వందలాది ఎకరాల భూములు, అదేస్థాయి రుణాలు కావాలంటే తనను సంప్రదించాలని చెప్పి నమ్మించేవాడు. తొలుత మంగళూరులోని జప్పినమగరు ప్రాంతంలోని తన ఇంటికి పిలిపించుకునేవాడు. అతడి నివాసం, విదేశీ బ్రాండ్ల మద్యం, విదేశీ యువతుల సేవలను చూసి బాగా పలుకుబడి ఉందని వచ్చినవారు నమ్మేవారు. ఇదే అదనుగా ఒక్కొక్కరికి రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల రుణం ఇప్పించేందుకు రూ.కోట్లలో ఫీజులు తీసుకున్నాడు. ఆ తర్వాత మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకోవడం, పని కాలేదని, త్వరలో అవుతుందని వాయిదాలు వేయడం చేసేవాడు. ఇతని వ్యవహారాలపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో పలుమార్లు దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను ఇంటి సమీపంలోని అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా పసిగట్టి, రహస్య గదిలోకి వెళ్లి దాక్కునేవాడు. ఇలా పలుమార్లు తప్పించుకున్నాడు.

**అంతా రహస్యమే!**

మోసాలకు పాల్పడగా వచ్చిన సొమ్ముతో విలాసవంతమైన సౌకర్యాలతో మాయామహల్‌ను నిర్మించుకున్నాడని, దీనిలో రహస్య గదులతో పాటు బాధితులు ఎవరైనా వచ్చి ఆందోళనకు దిగితే.. పారిపోయేందుకు రహస్య మార్గాలను కూడా ఏర్పాటు చేసుకున్నాడని పోలీసు కమిషనర్ వివరించారు. కేవలం మూడు నెలలకాలంలో రొనాల్డ్ బ్యాంకు ఖాతాలో రూ.40 కోట్లు వచ్చి చేరాయని తెలిపారు.

### గడువులోపే భారత అమ్ముల పొదిలోకి ఏకే-203 తుపాకులు

లఖ్‌నవూ, జూలై 18: భారత్-రష్యా భాగస్వామ్యంతో.. మేకిన్ ఇండియాలో భాగంగా 'షేర్' పేరుతో కలాష్నికోవ్ సిరీస్‌లో.. ఏకే-203 తుపాకుల తయారీ వేగం పుంజుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేఠీలో ఉన్న ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఆర్ఆర్‌పీఎల్) యూనిట్ ఈ తుపాకుల తయారీలో వేగాన్ని పెంచింది. ఏటా 1.5 లక్షల ఉత్పాదక సామర్థ్యంతో.. రూ.5,200 కోట్ల కాంట్రాక్టులో భాగంగా.. భారత సైన్యానికి 2032 అక్టోబరు నాటికి 6,01,427 ఏకే-203 తుపాకులు అందేలా ఐఆర్ఆర్‌పీఎల్‌తో ఒప్పందం ఉంది. అయితే.. ఇప్పటికే 48 వేల రైఫిళ్లను భారత సైన్యానికి అప్పగించామని ఐఆర్ఆర్‌పీఎల్ సీఈవో-ఎండీ మేజర్ జనరల్ ఎస్‌కే శర్మ వెల్లడించారు. 6 లక్షల తుపాకులను అందజేయాలనే ఒప్పందాన్ని నిర్ణీత గడువు కంటే.. 22 నెలల ముందే.. అంటే 2030 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ఆయన వివరించారు. ఏకే-203 తుపాకులు నిమిషానికి 700 తూటాలను పేల్చగలవు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏకే-47, ఏకే-57తో పోలిస్తే.. షేర్ తుపాకులు అత్యాధునికమైనవి. భారత సైన్యం మూడు దశాబ్దాలుగా ఇన్సాస్ రైఫిళ్లను వాడుతుండగా.. వాటి స్థానంలో ఏకే-203 తుపాకులను ప్రవేశపెట్టనున్నారు.

## గుర్తింపు పొందని పార్టీల రాబడి 223% పెరుగుదల



(మొదటి పేజీ తరువాయి)

నివేదిక ప్రకారం.. 22 రాష్ట్రాల్లోని 2,764 గుర్తింపు పొందని పార్టీల్లో 739(26.74%) పార్టీల వార్షిక ఆడిట్, కాంట్రిబ్యూషన్ రిపోర్టులను సంబంధిత రాష్ట్రాల సీఈవోల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 739 పార్టీల్లోంచి అత్యధికంగా గుజరాత్‌లో 30.53%, ఢిల్లీలో 21.67% పార్టీలున్నాయి. 739 పార్టీల్లో తొలి పది పార్టీల ఆదాయం రూ.1581.75 కోట్లు ఉండగా.. వీటిలో గుజరాత్‌కు చెందిన పార్టీల వాటే రూ.73.22శాతం! అంటే.. 1581.75 కోట్లలో గుజరాత్ పార్టీల వాటా 1158.15 కోట్లు!! వీటిలో భారతీయ నేషనల్ జనతాదళ్ పేరుతో ఉన్న పార్టీ రూ.576.45 కోట్ల ఆదాయాన్ని ప్రకటించిందని, ఆ రాష్ట్రానికే న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ రూ.407.45 కోట్ల మేర విరాళాలొచ్చాయని పేర్కొన్నట్లు నివేదిక పేర్కొంది. 2019-24 వరకు రూ.957.44 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు భారతీయ నేషనల్ జనతాదళ్ ప్రకటించినట్లు నివేదిక వెల్లడించింది. గుర్తింపు పొందని పార్టీల్లో దాదాపు అన్నీ విరాళాల మీదే ఆధారపడుతున్నట్లు తేలిందని వివరించింది. రూ.20వేల కంటే ఎక్కువ విరాళాలు ఇచ్చిన దాతల నుంచి జాతీయ పార్టీలకు 33% నిధులే సమకూరాయని.. గుర్తింపు పొందని పార్టీల్లో ఓ పది పార్టీలకు 93శాతం మేర విరాళాలొచ్చాయని ఏడీఆర్ వెల్లడించడం విశేషం. గుర్తింపు పొందని పార్టీల్లో అత్యధికంగా యూపీలో 744 ఉన్నాయని నివేదిక పేర్కొంది. తెలంగాణలో కూడా 78 గుర్తింపు పొందని నమోదైన పార్టీలు ఉన్నాయని వాటిలో 46 పార్టీల ఆదాయ వివరాలు సీఈవోల వద్ద లేవని తెలిపింది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 13ఏ కింద పన్ను మినహాయింపులను ఉపయోగించుకునే ఏకైక లక్ష్యంతోనే గుర్తింపు పొందని పార్టీల్లో చాలావరకు అవతరించాయని, ఇవేవీ కూడా ఎన్నికల కార్యకలాపాలు జరిపిన దాఖలాలు లేవని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. రాజకీయ పార్టీలను ఆదాయపన్ను చట్టం నుంచి మినహాయించిన ఎన్నికల సంఘం రు. 20వేలకు మించి విరాళాలు సేకరిస్తే తమ ఆడిట్ నివేదికలను సమర్పించాలనే నిబంధనలు విధించిందని, అయితే చాలా పార్టీలు తమ విరాళాల వివరాలు వెల్లడించలేదని నివేదిక స్పష్టం చేసింది. కాగా ఐదేళ్లకుపైగా నిష్క్రియాత్మకంగా ఉన్న పార్టీలను ఎన్నికల సంఘం నుంచి తొలగించాలని ఏడీఆర్ సిఫారసు చేసింది.

### విషం కలిపిన నీళ్లు తాగి నలుగురు రష్యా సైనికుల మృతి

» మరికొందరి పరిస్థితి విషమం
» ఘటన వెనుక ఉక్రెయిన్ హస్తం

న్యూఢిల్లీ, జూలై 18: తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత డోనెట్స్క్ ప్రాంతంలోని పాంటేలిమోనివ్కాలో విషం కలిపిన బాటిళ్లలోని నీళ్లు తాగి.. ఆ దేశంతో యుద్ధంలో ఉన్న రష్యాకు చెందిన సైనికుల్లో కనీసం నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రష్యా టెలిగ్రాం మిలటరీ చానళ్లలో ప్రసారమవుతున్న దృశ్యాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. సైనికుల్లో కొందరు మూర్ఛపోయినట్లు, ఇంకొందరు ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఆ దృశ్యాల్లో కనిపించింది. 'మా నీరు' (అవర్ వాటర్) అనే లేబుల్‌తో ఉన్న ఈ నీళ్ల బాటిళ్లను రష్యా అధీనంలోని క్రిమియా నుంచి మానవతా దృక్పథంతో సరఫరా చేసే ఆహారపదార్థాల్లో భాగంగా అక్కడ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నీళ్లు తాగినవారిలో కొందరు సైనికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ఘటన వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందని రష్యా సైన్యం ఆరోపించింది. అయితే ఈ విషయంలో ఎలాంటి ఆధారాలను సైన్యం బయటపెట్టలేదు.

### నాగారం ఐఏఎస్, ఐపీఎస్‌ల భూములపై

## విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ఉందా?

- వివరణ ఇవ్వాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాగారంలో భూదాన్ భూములుగా పేర్కొంటున్న స్థలాలను ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారన్న ఆరోపణలపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ఉందా? లేదా? చెప్పాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని శుక్రవారం సీఎస్‌కు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే 181, 182, 194, 195 నెంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని, రికార్డుల సవరణ చేయకూడదని, లావాదేవీలు నిర్వహించకూడదని ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అయినా సర్వే నెంబర్ 194, 195 లలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్‌ఏ హోదాలో పనిచేసిన ఐఏఎస్ నవీన్‌మిట్టల్ సహా ఇతర ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, దీనిపై దర్యాప్తునకు విచారణ కమిషన్‌ను నియమించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నాగారం గ్రామం పడమటి తండాకు చెందిన వడిత్య రాములు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. వారిలో డీ అమోయ్‌కుమార్, ఎస్ హరీశ్, అనురాగ్ శర్మ, టీకే రాహుల్ హెగ్డే, లెంకల సుబ్బారాయుడు, అజయ్ జైన్, ఎం. దివ్యశ్రీ, పేర్ల వరుణ్, రేణు గోయల్ (జితేందర్ కుమార్ గోయల్), తరుణ్ జోషి, రాజర్షి షా, రవి గుప్తా, రేఖా షరాఫ్ (ఉమేశ్ షరాఫ్), స్వాతీ లక్రా, సౌమ్యా మిశ్రా, టీ శ్రీనివాసరావు, ముదిరెడ్డి నితేష్ రెడ్డి (ముదిరెడ్డి మహేందర్‌రెడ్డి), మహేశ్ మురళీధర్ భగవత్, దండ రాధిక (వీబీ కమలాసన్‌రెడ్డి), రీటా సుల్తానియా (సందీప్‌కుమార్ సుల్తానియా), అజిత్‌కుమార్ మహంతి, వసుంధరా సిన్హా (అంజనీకుమార్), ఐశ్వర్య రాజ్ (వికాస్ రాజ్), తాటిపర్తి పావనీరావు (టీ ప్రభాకర్‌రావు), డాక్టర్ జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్), నవీన్‌మిట్టల్ తదితరులు ఉన్నారు. వీరితోపాటు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్‌ఏ, రంగారెడ్డి కలెక్టర్, ఆర్డీవో, మహేశ్వరం తహసీల్దార్, ఈడీ తదితరులను అధికారిక ప్రతివాదులుగా చేర్చారు. సర్వే నెంబర్ 194, 195లో ఎస్టీ వర్గానికి చెందిన తనకు వారసత్వంగా వస్తున్న 10.17 ఎకరాల భూమి ఉందని, తన తండ్రి జమాలా ఆ భూములను కొనుగోలు చేశారని పిటిషనర్ రాములు పేర్కొన్నారు. 2020లో తన తండ్రి మరణానంతరం ఆ భూములు తన పేరుపై మ్యుటేషన్ కావడంతోపాటు ఈ-పట్టాదార్ పాస్‌పుస్తకాలు సైతం జారీఅయ్యాయని తెలిపారు. అయితే పలుకుబడి కలిగిన కొంత మంది వ్యక్తులు రికార్డుల్లో మార్పులు చేయించారని ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణంపై విచారణ కమిషన్ వేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్యకార్యదర్శికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ కే లక్ష్మణ్ ఎదుట విచారణకు వచ్చింది. సీఎస్‌కు ఆదేశాలు జారీచేసిన ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

# గోదావరిపై మీ కార్యాచరణ ఏంటి?

**మీ తర్వాత సీఎం అయిన చంద్రబాబు బనకచర్లను ప్రతిపాదించారు.. రెండేళ్లుగా మీరేం చేస్తున్నారు**

- ఎప్పుడూ కేంద్రాన్ని విమర్శించడమేనా
- రేవంత్ రెడ్డికి కిషన్‌రెడ్డి ప్రశ్న
- తాను కోరిన తర్వాతే కేంద్రం ఇద్దరు సీఎంల భేటీ ఏర్పాటు చేసిందని వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి మిగులు జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ఏమిటో చెప్పాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. "మీ కంటే ఆరు నెలల తర్వాత చంద్రబాబు ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదించారు. గడచిన రెండేళ్లలో మీరేం చేశారు" అని నిలదీశారు. "ఎంతసేపూ కిషన్‌రెడ్డి ఏం చేశారు. ప్రధాని మోదీ తెలంగాణకు ఏమిచ్చారు.. అంటూ పడికట్టు పదాలతో అబద్ధాలు వల్లె వేయడం తప్పితే రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నిర్మాణాత్మక చర్య కూడా చేపట్టలేదు" అని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "బనకచర్లపై నేను ప్రధాని మోదీని కలుసుకున్నా. మూడుసార్లు జలశక్తి శాఖ మంత్రితో భేటీ అయ్యా. బనకచర్ల సమస్యకు పరిష్కారం చూపించాలని కోరాను. ఆ తర్వాతే, ఇద్దరు సీఎంల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమస్యలపై ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి చర్చించుకుంటామంటే బీఆర్‌ఎస్‌కు ఎందుకు అభ్యంతరం" అని ఆయన మండిపడ్డారు. ఈ ప్రక్రియలో కేంద్రం ఒక సంధానకర్తగా మాత్రమే వ్యవహరించింది తప్ప తీర్పు ఇవ్వడానికి సమావేశం ఏర్పాటు చేయలేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏ ఒక్క రాష్ట్రానికో అన్యాయం చేసేలా కేంద్రం వ్యవహరించబోదని ఆయన చెప్పారు. జలవివాదాలను పరిష్కరించుకునేందుకు ఇద్దరు సీఎంలు చర్చలు జరపడం సంతోషకరమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా బీజేపీ ఇష్టారాజ్యంగా విధానాలు మార్చుకోదని కిషన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. "రెండు తెలుగు రాష్ట్రాల మధ్య భేషజాలు లేవు. బేసిన్‌ల గొడవలు లేవు" అంటూ గతంలో అప్పటి ఏపీ సీఎం జగన్‌తో కలిసి ప్రగతిభవన్‌లో నిర్వహించిన సమావేశం సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రకటనను కిషన్ రెడ్డి చదివి వినిపించారు.



### పార్లమెంటులో చట్టం చేస్తేనే వేరే రాష్ట్రంలో గ్రామాల విలీనం

వచ్చే ఏడాది కాజీపేటలో రైలు ఇంజన్ల ఉత్పత్తిని ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం వరంగల్‌లో పర్యటిస్తారని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనులను సమీక్షిస్తారని ఆ తర్వాత కాచిగూడ నుంచి రాజస్థాన్(జోధ్‌పూర్)కు రైలు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తారని వెల్లడించారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగిస్తున్నామని, కొమురవెల్లి మల్లన్న దేవస్థానం రైల్వేస్టేషన్‌ను జనవరిలో ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా, తెలంగాణ సరిహద్దులోని 12 గ్రామాలు తమవే అంటూ మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యపై కిషన్‌రెడ్డి స్పందించారు. ఒక రాష్ట్రానికి చెందిన గ్రామాన్ని మరో రాష్ట్రంలో విలీనం చేయాలంటే పార్లమెంటులో చట్టం తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. మంత్రి చంద్రశేఖర్ వ్యాఖ్యలు చిన్నపిల్లాడిలా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో ఏపీలో కలిపిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న డిమాండ్‌పైనా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ, ఏపీ సీఎంలు ఒప్పుకొంటే వివాదాస్పద ఐదు గ్రామాలపై కూడా పార్లమెంటులో చట్టం తెస్తామని చెప్పారు. పార్లమెంటులో చట్టం అయిన తర్వాతే ఈ గ్రామాలను ఏపీలో విలీనం చేశారని ఆయన గుర్తుచేశారు. కాగా, రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వమే సక్రమంగా పంపిణీ చేయడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

## కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడి మృతి

చిన్నశంకరంపేట/శివ్వంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర సంఘటన శుక్రవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం రూప్లతాండలో జరిగింది. కుక్కల దాడిలో ఆ బాలుడి తల చీలడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ఆ తండాకు చెందిన జేరుపుల హోబ్యా, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రెండో కుమారుడు నిథున్ (3) కిరాణా షాపునకు వెళ్లి తినుబండారాలు కొనుక్కొని వస్తుండగా దారిలో అయిదారు కుక్కలు దాడి చేసి, తలపై తీవ్రంగా కరిచాయి. దాంతో తల చీలింది. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే కారులో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, చిన్నశంకరంపేట మండలం మడూర్‌లో వీధి కుక్కల దాడిలో పెండల పెంటమ్మ తీవ్రంగా గాయపడింది. మండలంలో ఇరవై రోజుల క్రితం జరిగిన కుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.



నిథున్ (ఫైల్)

## అబూజ్‌మడ్‌లో.. ఆరుగురు నక్సల్స్ కాల్చివేత

- మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్!
- వారోత్సవాల సమయంలో మావోయిస్టులకు ఎదురు దెబ్బ
- ఏడాదిలో 357 మంది మృతి.. వారిలో 126 మంది మహిళలు

చర్ల, చింతూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బతగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో.. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయని వివరించారు. ఈ క్రమంలో మావోయిస్టులు, బలగాల మధ్య కాల్పులు జరిపాయని పేర్కొన్నారు. నక్సల్స్ వైపు కాల్పులు నిలిచిపోయాక.. పరిశీలించగా.. ఆరు మృతదేహాలు లభ్యమైనట్లు వెల్లడించారు. ఒక ఏకే-47, మరో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కూంబింగ్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. సరిగ్గా నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు గుర్తుచేస్తున్నారు. ఆ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతిచెందారు. శుక్రవారం అదే ప్రాంతంలో కాల్పులు జరిగాయి. శుక్రవారం మృతిచెందిన వారిలో పీఎల్‌జీఏ ఏడో బెటాలియన్ సభ్యులై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏడాది జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సారి కూడా బస్తర్ అడవుల్లో వారోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఎన్‌కౌంటర్ జరగడం మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బగా బలగాలు భావిస్తున్నాయి. కాగా.. ఆపరేషన్ కగార్‌లో భాగంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడాది కాలంలో 357 మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో 126 మంది మహిళలు, నలుగురు కేంద్ర కమిటీ, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులున్నారు.

## రష్యాపై మరోసారి యూకే, ఈయూ ఆంక్షల కొరడా

- రష్యా కంపెనీ భాగస్వామ్యం ఉన్న ఒక భారతీయ రిఫైనరీపైనా కొరడా

బ్రసెల్స్, జూలై 18: ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగిన రష్యాపై ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన యూకే, యూరోపియన్ యూనియన్.. తాజాగా మరోసారి ఆంక్షల కొరడా ఝుళిపించాయి. మాస్కో చమురు, ఇంధన రంగాలు.. వాటితోపాటు, దొడ్డిదోవన తన ఇంధనాన్ని అమ్ముకోవడానికి రష్యా ఉపయోగిస్తున్న ముసుగు నౌకలు (షాడో ఫ్లీట్- ఇవి రష్యా జెండాతో కాకుండా వేరే దేశాల జెండాతో, తప్పుడు పత్రాలతో వివిధ దేశాలకు సరఫరా అవుతాయి. ఆ చమురును అమ్మడం ద్వారా వచ్చే డబ్బు మాత్రం రష్యాకు అందుతుంది), రష్యన్ నిఘావర్గాలే లక్ష్యంగా ఈయూ, యూకే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ఇలా రష్యాకు చెందిన షాడో ఫ్లీట్ ద్వారా చమురును అందుకుంటున్న భారతీయ రిఫైనరీ పైన కూడా ఈయూ ఆంక్షలు విధించడం గమనార్హం (ఈయూ ఆ రిఫైనరీ పేరును ప్రత్యేకంగా వెల్లడించలేదుగానీ.. అది మన దేశానికి చెందిన నయారా ఎనర్జీ లిమిటెడ్ అని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తా సంస్థ ఒక కథనంలో పేర్కొంది. ఆ సంస్థలో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు 49.13% యాజమాన్యవాటా ఉన్నట్టు వెల్లడించింది). అంతర్జాతీయ విపణిలో చమురు ధరలతో సంబంధం లేకుండా.. 60 డాలర్లకు రష్యా నుంచి చమురును కొనుగోలు చేయాలని ఈయూ గతంలో ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడా పరిమితిని 45 డాలర్లు చేయాలని యూరోపియన్ కమిషన్ తాజా ఆంక్షల్లో భాగంగా ప్రతిపాదించింది. అయితే సభ్యదేశాలు 48 డాలర్ల పరిమితికి అంగీకరించాయి. జీ7 దేశాల వంటివి కూడా ఈ పరిమితిని అంగీకరించాలని ఈయూ కోరుతోంది. ఈ పరిమితి కూడా ఆరు నెలలకు మాత్రమే పరిమితం. ఆ తర్వాత నుంచి.. గడిచిన ఆరు నెలల చమురు సగటు మార్కెట్ ధర కన్నా 15 శాతం తక్కువ ధరను పరిమితిగా విధించేలా కొత్త ఆంక్ష విధించారు. ఉక్రెయిన్‌కు అండగా నిలిచే విషయంలో యూరప్ వెనక్కి తగ్గదనే సందేశాన్ని గట్టిగా ఇచ్చేందుకే ఈ తాజా ఆంక్షలను విధించినట్టు ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కాజా కల్లాస్ తెలిపారు. ఈ ఆంక్షలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వాగతించారు. వీటికి తోడుగా తాము కూడా త్వరలోనే మరికొన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## పాతికేళ్లుగా నిలిచిన బాసర ఆలయ అభివృద్ధి

- పుణ్యక్షేత్రంపై కొరవడుతున్న ప్రభుత్వాల పట్టింపు
- ప్రసాద్ స్కీమ్‌లో చేర్చాలని భక్తుల విన్నపం

నిర్మల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వేల ఏళ్ల చరిత్ర కలిగిన నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధి మరుగున పడింది. భారీ వర్షం కురిస్తే ఆలయం పైకప్పు నుంచి వర్షపు నీరు లోనికి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాసర రైల్వే స్టేషన్ నుంచి అమ్మవారి ఆలయం దాకా రహదారి విస్తరణ పనులు అసలే జరగడం లేదు. ఆలయం నుంచి గోదావరి నది వద్దకు ఉన్న రోడ్డు కూడా ఇరుకుగానే ఉంది. దేశంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'ప్రసాద్' పథకం పరిధిలోకి బాసర అమ్మవారి ఆలయాన్ని తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ప్రతీ పుణ్యక్షేత్రానికి రూ. 50కోట్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా భద్రాచలం, రామప్ప, జోగులాంబ ఆలయాలను కేంద్రం ప్రసాద్ స్కీమ్‌లో చేర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఏడేళ్ల క్రితం ఆలయ పండితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి బాసర అమ్మవారి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని వినతి పత్రం అందజేశారు. అయితే కేంద్రం నుంచి ఇంకా స్పందన రాలేదు.

### రాష్ట్ర నిధులు వెనక్కి

బాసర అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం గతంలో 50 కోట్లు కేటాయించింది. ఈ నిధులను ఖర్చు చేసే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. రూ.8 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కొన్ని వసతి గృహాల రిపేర్లు, ఆలయానికి వెళ్లే దారిలో షెడ్లు వేయడం లాంటి చిన్న చిన్న పనులు మినహా ఇతర అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయలేదు. దీంతో సుమారు 42 కోట్లు తిరిగి వెళ్లిపోయాయి. దీనిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే గోదావరి నది పుష్కరాలు 2027లో రానున్నాయి. ఈ తరుణంలో విమర్శలు పక్కనపెట్టి ఆలయ అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

## గోడ కూలి మీద పడి ఇద్దరు కూలీల మృతి

కోటపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రానికి చెందిన శేగం తిరుపతి(50), రెడ్డి మధునయ్య(52) శుక్రవారం కూలీ పనులకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు ఇంటి గోడ కూలి మీద పడటంతో వారిద్దరూ దుర్మరణం చెందారు. కోటపల్లికి 3 కి.మీ. దూరంలో ఉన్న బ్రాహ్మణపల్లిలో వెల్మ శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు ఇదివరకు నివాసం ఉంటున్న పాత ఇంటిని కూల్చివేసేందుకు తిరుపతి, మధునయ్యతోపాటు మరో నలుగురిని పనులకు పిలిచాడు. ఇంటి పాత గోడలు కూల్చివేస్తున్న సమయంలో ఒక్కసారిగా గోడ తిరుపతి, మధునయ్యపై పడింది. వెంటనే వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మధునయ్య మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తిరుపతి కూడా చనిపోయాడు.



మధునయ్య, తిరుపతి (ఫైల్)

# బనకచర్ల రేపటి తెలంగాణకు నష్టం

**గోదావరిలో అదనపు నీళ్లుంటే.. తెలంగాణ వాటా తేల్చాలి**

- విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో పునఃపరిశీలన జరగాలి
- తెలంగాణలో ప్రాజెక్టులకు అడ్డుపడుతున్న ఆంధ్రా పాలకులు
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి)/ చిన్నకోడూరు: బనకచర్ల ప్రాజెక్టు రేపటి తెలంగాణకు నష్టమని, రాష్ట్ర హక్కులను తాము కాపాడుకుంటామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గోదావరి నీళ్లను బనకచర్ల వద్దకు తీసుకెళ్లి రాయలసీమ ప్రాంతానికి లిఫ్టు, టన్నెల్ ద్వారా అందించే ప్రాజెక్టే జీబీ లింక్ అని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు 968 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కేటాయిస్తూ బచావత్ ట్రిబ్యునల్ 1980లో గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. తెలంగాణకు 968 టీఎంసీలు కేటాయించడం తప్పు అని, అక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుమతులు రద్దు చేయాలని సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కేంద్రానికి ఉత్తరాలు రాశారని గుర్తుచేశారు. సముద్రంలో కలిసిపోతున్న నీరు తీసుకుంటామంటున్న మీరు, తెలంగాణ ప్రాజెక్టులకు ఎందుకు అడ్డు చెప్తున్నారని ప్రశ్నించారు. ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత, రెండు రాష్ట్రాల్లో విభజన చట్టం ప్రకారం పునః పరిశీలన జరగాలే తప్ప, బనకచర్లకు 200 టీఎంసీలు తీసుకుపోతామంటే ఎలా? అంటూ ప్రశ్నించారు. గోదావరిలో అదనంగా నీళ్లుంటే తెలంగాణకు రావాల్సిన వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు.



### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిధులు కేటాయించడం లేదు

గతంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సంవత్సరానికి రూ. 5 కోట్ల నిధుల కేటాయింపు ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని ఆపేసిందని, అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ఒక్క తరగతి గదిని కూడా నిర్మించలేదన్నారు.

### రాహుల్ మౌనమేల?

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఏమి చేయలేక.. మీ బావమరిదిని ప్రభుత్వం వెంటాడి.. అక్రమ కేసులు బనాయించి వేధిస్తోందని ఆరోపిస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో జరుగుతున్న అన్యాయంపై స్పందించాలని మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో కేసీఆర్ కుటుంబంపై ప్రతీకార రాజకీయాలు చేస్తుంటే రాహుల్ ఎందుకు మౌనంగాఉన్నారని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలపై తెలంగాణ సీఎం కొనసాగిస్తున్న వంచన రాజకీయాలు పరాకాష్ఠకు చేరుకున్నాయని.. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సింగరేణికి పెను సవాల్!

- సంస్థ బొగ్గుకు తగ్గిన డిమాండ్
- పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం
- పడిపోతున్న అమ్మకాలు

గోదావరిఖని, జూలై 18(ఆంధ్రజ్యోతి): దేశ బొగ్గు మార్కెట్‌ను శాసించిన సింగరేణి భవిష్యత్‌పై ఆందోళనలు నెలకొన్నాయి. తాను ఉత్పత్తి చేసిన బొగ్గును విక్రయించేందుకే ఆ సంస్థ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. 2030నాటికి 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్న ఆ సంస్థ.. ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న 75మిలియన్ టన్నులను విక్రయించేందుకు ఇబ్బంది పడుతోంది. ఈ పరిణామం సంస్థ భవిష్యత్‌పై ఆందోళన కలిగిస్తోంది. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గులో 80శాతం థర్మల్ విద్యుత్ సంస్థలకే వెళుతోంది. అయితే, ప్రత్యామ్నాయ విద్యుత్ రంగాలు అభివృద్ధి చెందడం, విద్యుత్ ఉత్పత్తిలో సాంకేతికత పెరుగుతుండడం, కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు సిద్ధంగా లేకపోవడం, సింగరేణిలో ఉత్పత్తి వ్యయం పెరగడం, బొగ్గు నాణ్యత తగ్గడం వంటివి సింగరేణికి ఇబ్బందిగా మారాయి. సింగరేణి విషయంలో ఏడాదిగా 10-15 శాతం బొగ్గు డిమాండ్ క్రమంగా తగ్గుతోంది. సుమారు 10 మిలియన్ టన్నుల బొగ్గును మార్కెట్ చేసుకోవడం సింగరేణికి సమస్యగా మారింది.

### వ్యయం ఎక్కువ ఉత్పత్తి తక్కువ

సింగరేణిలో గనులు పాతవి కావడంతో బొగ్గు నిల్వలు కూడా క్రమంగా లోతుకు వెళుతున్నాయి. దీంతో ఉత్పత్తి వ్యయం నానాటికి పెరిగిపోతోంది. కార్మికుల జీతభత్యాలు కూడా ఉత్పత్తి వ్యయంపై ప్రభావం చూపుతున్నాయి. సింగరేణి ఓపెన్‌కాస్టుల్లో 13బకెట్ల ఓబీ(ఓవర్ బర్డెన్)ని తీస్తే ఒక బకెట్ బొగ్గు లభిస్తోంది. అదే మహానది కోల్‌ఫీల్డ్స్‌లో రెండు బకెట్ల మట్టి తొలగిస్తే ఒక బకెట్ బొగ్గు ఉత్పత్తి అవుతోంది అలాగే, కోల్‌బెంచ్‌లు కూడా సింగరేణిలో 6మీటర్ల నుంచి 13మీటర్ల వరకే ఉంటున్నాయి. కానీ ఇతర సంస్థల్లో 20 నుంచి 25మీటర్ల మందంతో బొగ్గు లభ్యమవుతోంది. సింగరేణి అండర్ గ్రౌండ్‌లో ప్రతి టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.6వేలు ఖర్చు అవుతుంది. కానీ, మార్కెట్‌లో టన్ను బొగ్గు ధర రూ.3వేలు మాత్రమే ఉంది. ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి వ్యయం రూ.2వేలుగా ఉంది. ఇతర సంస్థలు రూ.2వేల నుంచి రూ.2500కే ఉత్పత్తి చేసి మంచి గ్రేడ్ బొగ్గును మార్కెట్‌లోకి తెస్తున్నాయి. ఫలితంగా నాణ్యత, ధర విషయంలో సింగరేణికి పోటీ ఎదురవుతోంది. దీనికి తోడు దేశంలోని అన్ని విద్యుత్ సంస్థల వద్ద నెల రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి. చివరికి సింగరేణి నిర్వహణలో ఉన్న జైపూర్ పవర్‌ప్లాంట్‌లో కూడా బొగ్గు నిల్వలు పేరుకుపోయాయి. సింగరేణిలోని వివిధ బొగ్గు గనులు, ఓపెన్ కాస్ట్‌లో సుమారు 2 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఈ పరిణామాలు ఇలానే కొనసాగితే రెండేళ్లలో సింగరేణి బొగ్గు మార్కెట్ పడిపోయి బొగ్గును అమ్మలేని పరిస్థితికి చేరుకునే ముప్పు ఉంది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

## శాసన వివేకం

పొరుగు దేశం పాకిస్థాన్‌లో పవిత్ర గ్రంథాలు, పవిత్ర ప్రదేశాలు, పుణ్య పురుషులను అగౌరవపరిచినట్టు ఆరోపణలు ఎదుర్కొనే వారికి విధించే అసాధారణ శిక్షలను గమనిస్తే మత భావోద్రేకాల కాఠిన్యత విస్మయపరుస్తుంది. ఇటువంటి ధర్మోల్లంఘన చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేందుకు మన పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ వారం శాసనసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. 'పంజాబ్ ప్రివెన్షన్ ఆఫ్ అఫెన్సెస్ ఎగెనిస్ట్ హోలీ స్క్రిప్చర్స్ బిల్–2025'ను ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్వయంగా శాసనసభలో ప్రవేశపెట్టారు. శ్రీగురు గ్రంథ్ సాహిబ్, శ్రీమద్ భగవద్గీత, హోలీ బైబిల్, ఖురాన్ షరీఫ్‌తో సహా ఏ మత పవిత్ర గ్రంథాలనైనా అపవిత్రం చేస్తే పది సంవత్సరాల నుంచి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఐదు నుంచి పది లక్షల రూపాయల జరిమానా విధించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఏ పవిత్ర గ్రంథాన్ని అయినా చింపివేయడం, కాల్చివేయడం, ధ్వంసం చేయడం, వికృతం చేయడం, వివర్ణం చేయడం, మౌఖికంగా లేదా భౌతికంగా అగౌరవపరచడాన్ని నేరంగా పరిగణించాలని ఆ బిల్లు పేర్కొంది. మత సామరస్యాన్ని సంరక్షించేందుకు, పంజాబ్‌లో నివసిస్తున్న భిన్న మతాల అనుయాయుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు. భారత్‌లో ఇటువంటి బిల్లును ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని ముఖ్యమంత్రి మాన్ సగర్వంగా ప్రకటించారు.

ఒక మత వ్యవస్థలో పవిత్రమైనవిగా భావించే వాటిని అగౌరవ పరచడం సహజంగానే సంబంధిత మతస్థుల మనసులను గాయపరుస్తుంది. అక్టోబర్ 12, 2015న ఫరీద్‌కోట్ జిల్లాలోని బర్గారీ గ్రామంలో, సిక్కు మత పవిత్ర గ్రంథం శ్రీగురుగ్రంథ్ సాహిబ్ నుంచి చింపిన పేజీలను కనుగొన్నారు. ఇది పంజాబ్ అంతటా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ సందర్భంగా పోలీసు కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. తదాది పంజాబ్‌లో ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి ధర్మోల్లంఘన సంఘటనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల పరంపర పంజాబ్ రాజకీయాలను నిర్దయాత్మకంగా ప్రభావితం చేశాయి. పర్యవసానంగా 2017 ఎన్నికలలో అకాలీదళ్–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పరాజయం పాలయింది. గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించి విఫలమయింది. కొత్తగా రాష్ట్ర రాజకీయాలలోకి ప్రవేశించిన ఆమ్ ఆద్మీ పార్టీ యాదృచ్ఛికంగా లబ్ధి పొంది 2022లో అధికారానికి వచ్చింది. అకాలీ–బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఈ ధర్మోల్లంఘన సంఘటనలను అరికట్టేందుకు కఠినమైన బిల్లులను తీసుకువచ్చాయి. అయితే భిన్న కారణాలతో అవి రాష్ట్రపతి ఆమోదం పొందలేకపోవడంతో చట్టాలు కాలేదు. ఇప్పుడు భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తాజాగా ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. శాసన సభలో చర్చ అనంతరం మరింత విస్తృత చర్చలకు గాను ఆ బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించారు.

ఆప్ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకురావడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయిన ఆప్ 2027లో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లును ప్రవేశపెట్టిందని తప్పుపడుతున్నారు. 'ఇదొక రాజకీయ జూదమని ఒక విజ్ఞుడు వ్యాఖ్యానించారు. ధర్మోల్లంఘన ఘటనలకు పాల్పడినవారిని శిక్షించేందుకు కొత్త చట్టం అవసరం లేదని, ప్రస్తుతమున్న చట్టాలు సరిపోతాయని పంజాబ్ పౌర సమాజ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక, ఆర్థిక, భద్రతాపరమైన సవాళ్ల నెదుర్కొంటున్న సరిహద్దు రాష్ట్రంలో ఒక భావోద్వేగ అంశాన్ని రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

పౌర వివేకాన్ని పెంపొందించకుండా శాసనాలతో మతపరమైన భావోద్రేకాలను ఉపశమింపచేయడం సాధ్యమవుతుందా? ఇతరేతర ప్రయోజనాలను ఆశించి ఒక సమస్యను సాకుగా చూపి తీసుకువచ్చే చట్టాలు సార్థకమవుతాయా? నిగూఢ రాజకీయ ప్రయోజనాలు లేని శాసన నిర్మాణమే ఫలప్రదమవుతుంది. సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉన్న బిల్లుపై విస్తృతస్థాయిలో చర్చలు, సంప్రదింపుల ద్వారా పౌర వివేకాన్ని పెంపొందించాలి. పవిత్ర గ్రంథాలను అగౌరవపరిచిన వారిని శాసనాలు శిక్షించగలవేగానీ ఆ దివ్య గ్రంథాలు ప్రబోధించే మానవ జీవిత ధర్మాలను అర్థం చేసుకుని అనుష్ఠానించేలా ప్రజలను పురిగొల్పగలుగుతాయా? శాసన వివేకానికి విధిగా పరిమితులు ఉంటాయి. ఆ పరిమితులు నిగూఢ రాజకీయ ఆరాటాలతో సంబంధమున్నవి అయితే ప్రమాదకర పర్యవసానాలకు కారణమవుతాయి. ఈ విపత్కర పరిస్థితి శాసన మూఢత్వం (లెజిస్లేటివ్ స్టుపిడిటీ–లక్ష్య శుద్ధి లేని శాసనాల నిర్మాణం)కు తార్కాణం. దీన్ని ప్రోత్సహించకూడదు. త్యజిస్తేనే పౌర విజ్ఞతను పెంపొందించే శాసన వివేకం వర్ధిల్లుతుంది. మరి అటువంటి శాసనాలను నిర్మించే పరిణతి మన రాజకీయాలకు ఎప్పుడు వస్తుంది?

# ఈ 'సర్'తో ఏ ప్రజాస్వామ్య వెల్గులకు?

ఆర్థిక సంస్కరణల ప్రథమ దశ అంటే 1991–96 సంవత్సరాల మధ్య మన రాజ్యాంగ వ్యవస్థలలో అత్యుత్తమ, అత్యంత ప్రభావశీల సంస్థ ఏది? అనే విషయమై దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించి ఉంటే ప్రజలు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వైపే మొగ్గు చూపి ఉండేవారు. రాజ్యాంగ న్యాయస్థానాల కంటే ఈసీఐకే అత్యధికులు ప్రథమ గణ్యత నిచ్చేవారనడంలో సందేహం లేదు. ఈసీఐకు అటువంటి గౌరవం దక్కడానికి ప్రధాన కారకుడు ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) టి.ఎన్. శేషన్. ఆయన హయాంలో ఈసీఐ స్వతంత్రత, న్యాయవర్తన, నిష్పాక్షికతతో తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించిందని ప్రతి ఒక్కరూ గుర్తించారు, గౌరవించారు. శేషన్ అనంతరం సీఈసీలుగా బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్ఎస్ గిల్, జేఎమ్ లింగ్డో, టిఎస్ కృష్ణమూర్తి, నవీన్ చావ్లా, ఎస్‌వై ఖురేషీలు ఈసీఐ స్వతంత్రత, న్యాయవర్తన, నిష్పాక్షికతను దృఢంగా కాపాడారు. ఇతర సీఈసీలు నిర్వాచన్ సదన్ (భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం)కు ఎలా వచ్చారో అలా వెళ్లిపోయారు. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి కొన్ని సార్లు లొంగిపోయేవారు, మరికొన్నిసార్లు లొంగిపోలేదన్న విధంగా కనిపించేవారు. గత పన్నెండు సంవత్సరాలుగా సీఈసీలుగా నియమితులైన వారి విధి నిర్వహణ తీరుతెన్నులను రాజ్యాంగ దర్పణంలో చూస్తే వారు భారత ప్రజాస్వామ్యానికి ఉపద్రవాలే అని నిర్మొహమాటంగా చెప్పక తప్పదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈసీఐ స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థ. స్వతంత్ర భారత తొలి సంవత్సరాలలో ఎన్నికల నిర్వహణను ఒక గొప్ప సవాల్‌గా పరిగణించలేదు. స్థానిక పెత్తందారులు ఓటు ఎవరికి వేయాలో నిర్దేశిస్తే అత్యధికులు వారికే ఓటు వేసేవారు. కొన్ని సామాజికవర్గాల వారిని ఓటు వేయకుండా అడ్డుకునేవారు. ఓటుహక్కును వినియోగించుకోలేనివారు పేదలు, ఎటువంటి పలుకుబడి లేనివారు. ఫిర్యాదు ఎలా చేయాలో కూడా తెలియనివారు. ఈ కారణంగా కాంగ్రెస్‌కు ఎలాంటి రాజకీయ సవాళ్లు ఎదురయ్యేవి కావు. 1967 తరువాత ఎన్నికలు కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలకు సవాల్‌గా పరిణమించాయి. 1965–2014 సంవత్సరాల మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఈసీఐ విధుల నిర్వహణలో జోక్యం చేసుకునేవి కావు. ప్రభుత్వం తమ బాధ్యతల నిర్వహణలో జోక్యం చేసుకుంటోందని ఏ ఈసీఐ అయినా ఆరోపించినట్టు నాకు జ్ఞాపకం లేదు. కొన్ని రాష్ట్రాల ఎన్నికలలో అధికార పార్టీకి అనుకూలంగా రిగ్గింగ్ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ ఆరోపణలు కేంద్రంలోని పాలక పక్షానికి వ్యతిరేకంగా కాకుండా ఈసీఐ అసమర్థతకు వ్యతిరేకంగా చేసినవే అన్నది గమనార్హం.

2014 లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరిగాయి. ఆ తరువాత లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అసమర్థంగా ఉందని, రిగ్గింగ్ విస్తృతంగా జరిగిందని మొదలైన ఆరోపణలు తీవ్రంగా వచ్చాయి. 2014 నుంచి ఈసీఐ పలు సవాళ్లను, ఒత్తిళ్లను ఎదుర్కోవలసివచ్చింది. ఈ రాజ్యాంగ సంస్థకు సుదీర్ఘకాలంగా ఉన్న పేరు ప్రతిష్ఠలు బాగా క్షీణించాయని చెప్పక తప్పదు.

నవంబర్ 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఓటర్ల జాబితాలు వివాదాస్పదమయ్యాయి. ఈసీఐపై ఇవీ ఆరోపణలు: (1) ఓటర్ల జాబితాలో అసాధారణంగా చాలా పెద్ద సంఖ్యలో కొత్త, బహుశా బూటకపు ఓటర్ల పేర్లను అదనంగా చేర్చారు; (2) పోలింగ్ గడువు ముగిసిన తరువాత కూడా ఓటు వేసేందుకు వేలాది ఓటర్లను అనుమతించారు; ఈ రెండు ఆరోపణలను తిరస్కరిస్తూ తన నిర్ణయాలను ఈసీఐ సమర్థించుకున్నది. ఏది సత్యం, ఏదసత్యమనేది ఇంకా తేలవలసివున్నది.

బిహార్‌లో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది మరికొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. బిహార్ ఎన్నికలు నాలుగు నెలల్లో జరగవలసివుండగా ఈసీఐ ఆ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను చేపట్టింది. ఇది అసాధారణం, ఇంతకు ముందెన్నడూ జరగనిది. సాధారణంగా ఏటా జనవరి 1న ఓటర్ల జాబితాలను సవరించడం జరుగుతుంది. ఎన్నికల సందర్భంగా వాటిని నవీకరిస్తారు. నవీకరించిన జాబితాలలో కొత్త ఓటర్ల పేర్లను చేర్చుతారు. చనిపోయినవారి ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలసపోయిన ఓటర్ల పేర్లను ఆ జాబితాల నుంచి తొలగిస్తారు. కొత్త ఓటర్ల పేర్ల చేర్పు, చనిపోయిన, వలసపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు రాజకీయ పార్టీలకు కూడా పూర్తిగా తెలిపి వాటికీ ప్రమేయం కల్పిస్తారు. కొత్తగా చేర్చే పేర్లకు సంబంధించి సంబంధిత ఓటరు వివరాలను చాలా జాగ్రత్తగా పరీక్షిస్తారు. అలాగే తొలగించే పేర్లకు సంబంధించి కూడా సంబంధిత ఓటరును సంప్రదించిన తరువాతనే తొలగిస్తారు.

ప్రత్యేక సమగ్ర సవరణ భిన్నమైనది. అది ప్రస్తుత ఓటర్ల జాబితాను పూర్తిగా రద్దు చేస్తుంది. సర్‌కు 2003 నాటి ఓటర్ల జాబితా ఆధారంగా ఉన్నదని చెబుతున్నప్పటికీ ఇది పూర్తిగా కొత్తది. మొదటి నుంచీ తిరిగి రూపొందిస్తున్న జాబితా ఇది. ప్రతి నియోజకవర్గానికి ఓటర్ల జాబితాను సరికొత్తగా రూపొందిస్తున్నారు.

ప్రస్తుత ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవల్సిన బాధ్యతను పూర్తిగా ఓటర్‌పైనే మోపారు. ఓటు హక్కు ఉన్నవారే (వీరిలో అత్యధికులు ఇంతకు




> అర్హులైన పౌరులు ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకుని ఓటు వేసేందుకు 'సర్' తోడ్పడదు గాక తోడ్పడదు. లక్షలాది పేద ప్రజలు, వనరులు, అవకాశాలులేని అణగారిన వ్యక్తులు, వలసజీవుల ఓటుహక్కు రద్దు లక్ష్యంగా ఉన్న రహస్య పథకమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ.

ముందు జరిగిన ఎన్నికలలో ఓటు వేసినవారే) అయినప్పటికీ సర్‌లో తమ పేరు ఉండేలా చూసుకోవల్సిన బాధ్యత పూర్తిగా వారిదేనని ఈసీఐ స్పష్టం చేసింది. తమ పౌరసత్వాన్ని నిరూపించే డాక్యుమెంట్లతో సహా ఓటర్ల జాబితాలో నమోదయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలి.

ఓటర్‌గా నమోదయ్యేందుకు వెసులుబాటు కల్పించడం కాకుండా... నమోదయ్యేందుకు, ఓటు వేసేందుకు అధిగమించలేని అవరోధాలు కల్పించడమే సర్ లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు రుజువులుగా 11 డాక్యుమెంట్లను ఈసీఐ నిర్దేశించింది. వాటిలో నాలుగు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ఇచ్చేవి కావు. మరో రెండిటిని బిహార్‌లో ఏ వ్యక్తికీ జారీ చేయనేలేదు. పోతే రుజువులుగా చూపించగలిగేవి (రెవెన్యూ అధికారులు జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రంతో సహా) ఐదు మాత్రమే. పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్, ప్రభుత్వ ఉద్యోగి ఐడి వంటివి బిహార్ జనాభాలో కేవలం 2.4 నుంచి 5 శాతం మందికి మాత్రమే ఉన్నాయి. ఈసీఐ నిర్దేశించిన డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లేనే లేవు. ఈ డాక్యుమెంట్లను ఎందుకు మినహాయించారని సుప్రీంకోర్టు ప్రశ్నించినప్పుడు ఈసీఐ సమాధానం చెప్పలేకపోయింది. చిత్రమేమిటంటే నివాసం, కులానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆధార్ కార్డు ప్రాతిపదికనే రెవెన్యూ అధికారులు జారీ చేస్తారు. సర్‌కు నివాస, కుల ధ్రువీకరణపత్రాలు అంగీకారయోగ్యమైనవి కాగా, ఆధార్ ఆమోదయోగ్యం కాలేదు!

సర్‌లో ఏకైక హేతుబద్ధ అంశం చనిపోయిన వ్యక్తుల పేర్లను, రెండుసార్లు నమోదు చేసిన పేర్లను విధిగా తొలగించివేయడం. బిహార్ నుంచి 17.5 లక్షల మంది ఓటర్లు వలసపోయారని ఈసీఐ అంచనా వేసింది. అయితే వారు ఇంకెంత మాత్రం బిహార్ నివాసులు కాదని, ఓటు వేయడానికి స్వరాష్ట్రానికి రారని భావించనవసరం లేదు. బిహార్ వెలుపల ఉన్న బిహారీ ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జూలై 15న ఓటరుగా నమోదయ్యేందుకు వివరాలు నింపవలసిన దరఖాస్తు పత్రాన్ని అప్‌లోడ్ చేశారు. ఆ ఓటర్ల నమోదు ప్రక్రియను జూలై 26 లోగా పూర్తి చేసేందుకు ఆయన సంకల్పించారు! దీన్నెలా అర్థం చేసుకోవాలి? సర్ ప్రక్రియ అర్హులైన పౌరులు ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకుని ఓటు వేసేందుకు తోడ్పడదు గాక తోడ్పడదు అనే నిర్ధారణకు రావడాన్ని అనివార్యం చేస్తోంది. లక్షలాది పేద ప్రజలు, వనరులు, అవకాశాలు లేని అణగారిన వ్యక్తులు, వలసజీవుల ఓటుహక్కు రద్దు లక్ష్యంగా ఉన్న రహస్య పథకమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ. జూలై 28న దేశ సర్వోన్నత న్యాయస్థానం 'సర్'పై ఎటువంటి తీర్పు వెలువరించనున్నదో వేచిచూద్దాం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

## గ్రామ పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యంత కీలకమైన మన గ్రామ పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కర్ణుడి చావుకి అనేక కారణాలు అన్నట్లు దానికి అనేక కారణాలు ఉన్నాయి. 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్ (టీపీఆర్ఏ) రూపకల్పన చేసుకున్నాం. ఈ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 12,791 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలతో సహా, 634 మండల పరిషత్‌లు, 31 జిల్లా పరిషత్తులకు ఎన్నికలు జరుపుకున్నాం. ఇక స్థానిక సంస్థల అభివృద్ధి మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతుందని భావించాం.

కొత్తగా ఎన్నికైన సర్పంచులు కూడా పనులు చేయడంలో ఉత్సాహం చూపించారు. ఒక రకంగా మొదటి రెండు సంవత్సరాల కాలంలో అటు కేంద్రం విడుదల చేసే నిధులు, ఇటు రాష్ట్రం ఇవ్వాల్సిన గ్రాంట్లు సకాలంలో రావడంతో తెలంగాణలోని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను వినియోగంలోకి తెచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠ ధామం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డ్, పంచాయతీ భవనాలు, రైతు వేదికలు నిర్మాణం చేశారు. ప్రతి పంచాయతీ ఒక వాహనం కొనుగోలు చేయటంతో పాటు గ్రామ పారిశుధ్య నిర్వహణకు గాను స్వల్పవేతనాలపై సిబ్బందిని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శిని నియమించింది. పంచాయతీ స్థాయిని బట్టి వాహనాన్ని, పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఈ వ్యవహారం, హడావిడి చూసిన సర్పంచ్‌లు నిధులు సకాలంలో అందకపోయినా అప్పులు తెచ్చి ఉరుకులు పరుగులపై పనులు చేయించారు. మరికొందరైతే మరోసారి మనమే ఎన్నిక కాలేమా! అన్న ధీమాతో ముందస్తు ఖర్చు పెట్టారు. వరుసగా రెండేళ్ల కేంద్రం 80శాతం, రాష్ట్రం 20శాతం నిధులతో పంచాయతీ పాలన పైలాపచ్చీసులా నడిచింది. ఇక రెండేళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు చెడటంతో కేంద్రం నిధులు ఆలస్యంగా రావడం, రాష్ట్రం ఆ నిధులు దారి మళ్లించుకోవడం మూలంగా గ్రామ పంచాయతీ పరిపాలన క్రమంగా అస్తవ్యస్తం అయ్యింది. నిధుల కొరత శాపంగా మారింది.

పంచాయతీలకు రావాల్సిన 13వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులు (పీఎంజీఎస్‌వై), రూరల్ కమ్యూనిటీ ప్రోగ్రాం (ఆర్‌సీపీ) నిధులు అందకపోవడంతో పెద్ద పంచాయతీ అయితే రూ.30 లక్షలు, చిన్న పంచాయతీ అయితే రూ.10 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. పంచాయతీ నిధులు దారి మళ్లటం, కేంద్రం వాటా రాకపోవడంతో అప్పుల పాలైన కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చూశాం. మూడేళ్ల కాలంగా తాము ఖర్చు చేసిన నిధుల కోసం ఎదురు చూస్తున్న సర్పంచ్‌ల భవితవ్యం అగమ్య గోచరంగా ఉంది.




గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం 28 ఫిబ్రవరి 2024 నాటికి ముగిసింది. అంతకుముందు బీఆర్ఎస్ పరిపాలనలో రెండేళ్లు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిన్నరగా సర్పంచ్‌లు అధికారుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఒక్క పైసా బకాయిలు రాలలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాదిన్నర కాలంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదు. ఎన్నికలు వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి.

ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాభివృద్ధి పద్దు క్రింద రూ.31,426 కోట్లు కేటాయించింది. ఇటీవలే పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క 'పల్లెప్రగతి' పథకం కింద రూ. పదివేల కోట్లు గ్రామ పంచాయతీలకు విడుదల చేశారు. వీటిలో మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఏ మేరకు చెల్లిస్తారో లేదో తెలియదు. కానీ, మళ్లీ తెలంగాణ కేబినెట్ ప్రకటనతో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం వచ్చేసింది. అధికారులు బీసీలతో సహా రిజర్వేషన్ల తంతు పూర్తి చేస్తే, ఇక ఎన్నికల నిర్వహణ జరిగి, స్థానిక సంస్థలు బలపడతాయి.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 'పీసా' చట్టం అమలు పరచకుండా అభయారణ్యం పేరుతో, నేషనల్ పార్క్ పేరుతో జీఓ 49 ప్రకారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 349 గ్రామాలను వాటి పరిధిలోకి తెస్తూ ప్రకటన చేయటం పట్ల అక్కడి గిరిజనుల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. గత ప్రభుత్వ కాలంలోనే ఈ జీఓకు అంకురార్పణ జరిగినప్పటికీ, ఇప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో అమలు జరుపుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లో పర్యావరణ పరిరక్షణ, గ్రామ పారిశుధ్య కార్యక్రమం నిర్వర్తించడం కోసం 'కార్బన హక్కులు' పేరుతో 'ఏకోలాజికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే కేవలం లక్ష రూపాయల ఆర్థిక వనరు కలిగిన స్వచ్ఛంద సంస్థకు పంచాయతీ భూములను లీజు పేరుతో ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ ఆరోపణ నిజమే అయితే ఇది ఎంతమాత్రం అనుసరణీయం కాదు. గ్రామ పంచాయతీలలో స్వచ్ఛంద సంస్థల ప్రవేశం అంటే స్థానిక అధికార వికేంద్రీకరణలో ప్రభుత్వాలు వేలు పెట్టినట్టే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇట్లాంటి వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. అంతేగాక, గత పరిపాలనా కాలంలో సర్పంచ్‌లకు చెల్లించాల్సిన నిధుల విషయంలో ప్రస్తుత పాలకులు పెద్ద మనసుతో ఆలోచన చేయాలి. అయితే మూడేళ్లుగా అస్తవ్యస్తంగా మారిన గ్రామ పంచాయతీ వ్యవస్థను గానీ, మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను గానీ దారికి తేవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంది. వచ్చే ఎన్నికలతోనైనా పంచాయతీరాజ్ వ్యవస్థ కుదుటపడాలని కోరుకుందాం.

● ఎన్. తిర్మల్
సామాజిక కార్యకర్త

## గోశాలలపై విషపు రాతలు!

పాఠశాలల కన్నా గోశాలలపైనే మక్కువ! అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎగతాళి చేస్తూ ఈ నెల 8వ తేదీ మంగళవారం సంచికలో మామిడి నారాయణ ఒక వ్యాసం రాశారు. ఇలా పరస్పరం విరుద్ధమైన అంశాలను పోల్చదలిస్తే చాలా చెప్పుకోవచ్చు. విద్యాభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను ఏదో గోశాలలకు మళ్లించేస్తున్నట్లుగా, దీంతో విద్యావ్యవస్థ నిర్వీర్యమైపోతున్నట్లుగా ఆయన నిందలు వేయదల్చుకున్నారంతే. ఓ రైతుబిడ్డగా రేవంత్‌రెడ్డి గోరక్షణ కోసం ఓ ఆలోచన చేయగానే గోవులంటే గిట్టనివారి విమర్శలు ప్రారంభమయ్యాయి. నిర్మాణం పనులు మొదలు కాకుండానే విషపు రాతలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా వివాదాలు రేకెత్తించాలన్నది లక్ష్యం కాబోలు. విద్యకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఎవరూ కాదనరు. పాఠశాలలు నిర్మించాల్సిందే. కానీ, గోవును కాపాడుతామంటే గుండెలు బాదుకోవడం సమంజసం కాదు. గోశాలలు, పాఠశాలల మధ్య ఏమన్నా సంబంధం ఉందా? ఇటీవల వేములవాడ గోశాలలో కోడెదూడలు చనిపోయిన విషయం గుర్తుపెట్టుకోవాలి. దేవాలయాలకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రభుత్వం సైతం విచ్చలవిడిగా వాటిని ఇతర అవసరాలకు మళ్లిస్తోంది. చివరకు ఇతర మతస్థుల కోసం కూడా ఉపయోగిస్తున్నది. కానీ గోశాలలు నిర్మిస్తుంటే మాత్రం ఎందుకీ కడుపు మంట? ఎవరు ఎంత చదివినా భోజనం తప్పదు. గోవు లేనిదే పాడి లేదు, పంటలేదు, ప్రకృతి లేదు. గోరక్షణ చట్టాలు ఉన్నప్పటికీ అవి సరిగా అమలు కావడం లేదు. హిందువులు పూజించే గోవును కాపాడటం ప్రభుత్వం బాధ్యత. సమాజాన్ని తప్పుదోవ పట్టించే రాతలు మానుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోరక్షకుడిగా ముందుకు సాగాలి. అత్యాధునిక గోశాలల నిర్మాణం చేయాలి, అదేవిధంగా విద్యారంగానికీ అత్యంత ప్రాధాన్యం కల్పించాలి.

– **పగుడాకుల బాలస్వామి,** ప్రచార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్

## 'కారుణ్యం'పై కాఠిన్యం ఎందుకు?

ప్రభుత్వ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తూ అకస్మాత్తుగా చనిపోతే అతడిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబం ఒక్కసారిగా ఆసరా కోల్పోతుంది. వారి కుటుంబ పోషణకు ఆటంకం ఏర్పడుతుంది. చనిపోయిన ఉద్యోగి స్థానంలో వారి కుటుంబంలోని ఒకరికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. అర్హతను బట్టి అటెండర్‌గానో, జూనియర్ అసిస్టెంట్‌గానో నియమిస్తుంది. ఇక్కడ ఓ సమస్య ఉంది. కారుణ్య నియామకానికి అర్హత వయసును జనరల్ వారికి 34 ఏళ్లు, రిజర్వుడు కేటగిరి వారికి 39 ఏళ్లుగా ప్రభుత్వం నిబంధన తెచ్చింది. దీంతో అన్ని విద్యార్హతలు ఉన్నా వయోపరిమితి కారణంగా కారుణ్య నియామకాల్లో వారి కుటుంబ సభ్యులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్నారు. ప్రభుత్వం గతంలో ఉద్యోగ నియామకాలకు జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లు, ఇతరులకు 49 ఏళ్లకు వయోపరిమితిని పెంచింది. కానీ కారుణ్య నియామకాలకు మాత్రం దీనిని వర్తింపజేయడం లేదు. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలకు వయోపరిమితిని పెంచిన ప్రభుత్వం, నీటిపారుదల వంటి ఇతర శాఖల్లో మాత్రం ఆ నిబంధనను అలాగే ఉంచింది. అన్ని శాఖల్లోని కారుణ్య నియామకాలకూ ప్రభుత్వం వయోపరిమితిని పెంచి, ఆయా కుటుంబాలను ఆదుకోవాలి.

– **ఎల్. శివ**

# మతరాజ్య భావన ఒక మానసిక దౌర్బల్యం!

'భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన' శీర్షికతో జూలై 11న దోర్బల బాలశేఖరశర్మ రాసిన అంశాలు దేశంలో విద్వేష ప్రచారానికి జనాలు ఎంతగా లోనైందీ వెల్లడిస్తున్నాయి. గత చరిత్రను చూసినపుడు భారత ఉపఖండంలో వివిధ మతాలను అవలంబించిన రాజులు ఉన్నారు తప్ప మత రాజ్యాలు ఉన్నట్లు చరిత్ర లేదు. కొన్ని దేశాల్లో ఉన్న ఇస్లామిక్, క్రైస్తవ, బౌద్ధ మతాలను అధికారికంగా ప్రకటించటాన్ని చూసి భారత్‌లో హిందూ రాజ్య స్థాపన చేయాలని కొందరు విదేశీ భావజాలాన్ని కాపీకొట్టి (ఆర్ఎస్ఎస్ వారు వేసుకొన్న నిక్కర్లు, ఇప్పటి పాంట్లు కూడా విదేశీ కాపీ తప్ప మన వస్త్రధారణ కాదు), గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే 101వ సారి నిజంగా మారుతుందట. హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు ఎవరైనా తమ మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారంటే దురహంకారవాదపు ప్రతికూల ప్రభావంతో తలెత్తే ఒక మానసిక దౌర్బల్యానికి చిహ్నం తప్ప మరొకటి కాదు. అది మతానికే పరిమితం కాదు, చివరకు కులాల రాజ్యాలు ఏర్పాటు జరగాలన్న దిగజారుడుకూ దారితీస్తుంది.

సోషలిజం అన్నది భారతీయ ఆర్థిక ఆలోచన కాదని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ వాదించినట్లు రచయిత పేర్కొన్నారు. ఇదొక అర్థం లేని వాదన. ఒక్కో దేశానికి ఒక్కో ఆర్థిక ఆలోచన ఉండదు. ప్రపంచమంతా ఒక కుగ్రామం అని చెబుతున్న రోజుల్లో ఇలాంటి కబుర్లు చెప్పటం జనాలను మభ్యపెట్టే అతి తెలివి తప్ప మరొకటి కాదు. పొలంలో పని చేసేవాడు ఎక్కడైనా వ్యవసాయ కార్మికుడే, అలాగే అమెరికాలో అయినా అనకాపల్లిలో అయినా ఫ్యాక్టరీ పనివాడు పారిశ్రామిక కార్మికుడే. పెట్టుబడి, లాభాలు తప్ప మరొక గీటురాయి ఉండదు. సోషలిజం కూడా అలాంటిదే. భారతదేశం ఎల్లపుడూ సర్వోదయ, అంత్యోదయ సూత్రాలను అవలంబించిందని కూడా అస్సాం సీఎం చెప్పారట. సర్వేజనా సుఖినో భవంతు అని సోషలిస్టు భావన కంటే ముందే చెప్పారు. అయినా దానిలో అందరికీ మంచి జరిగితే అంత్యోదయ, అత్యల్ప వర్గాలు ఎందుకున్నట్లు! బ్రిటిష్ వారి హయాంలో కూడా లేని ఆర్థిక అంతరాలు ఎందుకు పెరుగుతున్నట్లు!

లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారితప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి? అది కూడా పునరుద్ధరించాలనటం హిమాలయమంత అవాస్తవాన్ని మెదళ్లలోకి ఎక్కించే యత్నం తప్ప మరొకటి కాదు.

"భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతిదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది" అని వ్యాసకర్త అనటానికి ఆధారాలు ఏమిటన్నది ప్రశ్న. రాష్ట్రాల వారీగా దేవాదాయ, ధర్మాదాయ సంస్థలకు ఎన్ని భూములు ఉన్నాయో, ఎన్ని ఆస్తులు ఉన్నాయో ఎవరైనా చెబుతున్నారా? వక్ఫ్‌బోర్డుకు భారత్‌లో దానం చేసిన ఆస్తుల నిర్వహణ బాధ్యత ఇచ్చారు తప్ప అదనంగా ఇచ్చిందేమీ లేదు. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం దేశంలో 8.7లక్షల ఆస్తులు 9.4లక్షల ఎకరాల



> లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారి తప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి?

భూములు ఉన్నాయి, వాటి విలువ రూ.1.2లక్షల కోట్లు. దాన్ని ఒక సంస్థగా చూసి భారతీయ రైల్వేలు, మిలిటరీ తరువాత పెద్దది అని చెబుతున్నారు. దేశంలో దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల మొత్తం విలువ ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం క్రోడీకరించి చెప్పిందా? దాని దగ్గర ఉండవచ్చు గానీ ఎక్కడా బయటికి వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ఓ సేకరించిన సమాచారం ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.3.02లక్షల కోట్లు. మన దేశం నుంచి వెళ్లిపోయినవారి ఇక్కడి ఆస్తులను పాకిస్థాన్ వెళ్లినవారికి ఇవ్వలేదు కదా! ఉదాహరణకు హైదరాబాద్ నుంచి పాక్ వెళ్లిన వారి ఇండ్లు, పొలాలను అనేక మంది తరువాత ఆక్రమించి అన్యాక్రాంతం చేసుకున్నారు. వారిలో ముస్లింలు, హిందువులు అందరూ ఉన్నారు. ఇప్పటికీ ఆ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి.

ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదట. ఇది ఒక మానసిక దాడి, గాలి పోగేయటం తప్ప మరొకటి కాదు. పాకిస్థాన్‌లో ముస్లింలు ఎలా బాగుపడ్డారో రచయిత చెప్పి ఉంటే అర్థం ఉండేది. ఒకవైపు "మతరాజ్యంగా మారిన పాకిస్థాన్ దుస్థితి ఎలా ఉందో చూడండి, మన దేశం ఎలా ముందుకు పోయిందో చూడండి" అంటూ కాషాయదళాలు ప్రచారం చేయటం చూస్తున్నాం. మనదేశాన్ని కూడా మతరాజ్యంగా మార్చటం అంటే మరో పాకిస్థాన్‌గా మార్చాలనేనా?

అసలు హిందూరాజ్యం అంటే ఏమిటో, దాని రూపురేఖలు ఎలా ఉంటాయో ఎవరైనా చెప్పగలరా? సామాన్యులకు పట్టింపు లేదు గానీ అసలు సిసలు నిలువుబొట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనేవారు అడ్డబొట్ల ఆలయాల గడప తొక్కరన్న పచ్చి నిజం ఎంత మందికి తెలుసు? అలాంటప్పుడు ఎవరి భావనలకు అనుగుణంగా మతరాజ్యాన్ని ఏర్పాటు చేస్తారు? దాన్ని రెండవవారు అంగీకరిస్తారా? అలాంటి రాజ్యంలో ఇతర మతాలవారి పరిస్థితి ఎలా ఉంటుంది.

హిందువులు మెజారిటీగా ఉన్నప్పటికీ దురవస్థలో ఉన్నారని పదే పదే చెప్పటం గోబెల్స్ ప్రచారం, అందరూ అదే స్థితిలో ఉన్నారు. అన్ని మానవాభివృద్ధి సూచికల్లోను మనం ప్రపంచంలో ఎంత దిగువ స్థానాల్లో ఉన్నామో తెలిసిందే. దేశంలో హిందూ ద్వేష భావం ఉందని చెప్పటం ఒక మైండ్ గేమ్. జనాన్ని తప్పు దారి పట్టించే ఎత్తుగడ. మెజారిటీ వాదం చాలా ప్రమాదకరమైనదని ప్రపంచ అనుభవం చెబుతున్నది. అందువలన మార్చాల్సింది ఈ వాదాన్ని. దీన్ని ఇలాగే కొనసాగనిస్తే దేశ యువత పురోగమనంవైపు గాకుండా తిరోగమనంవైపు తిరిగితే దేశం మరింత అధోగతిలోకి దిగజారుతుంది.

సామాన్య భారతీయులకు మతం ఉంది గానీ విద్వేషం లేదు. ఉంటే 2024 ఎన్నికల్లో హిందూత్వకు ప్రమాదం ముంచుకువచ్చిందని చెప్పినా 34శాతం మంది అసలు ఓటింగ్‌కే రాలేదు. బీజేపీకి గత ఎన్నికల కంటే 0.8శాతం తగ్గి వచ్చిన ఓట్లు 36.56శాతం; ఇవి కూడా తెలుగుదేశం, జనసేన పార్టీలు వేయించిన ఓట్లు కూడా కలిస్తే. చివరిగా ఒక్క మాట రచయిత హిందూ ద్వేష భావజాలాన్ని నిర్మూలించాలన్నారు. దీనిలో కూడా సంకుచితమేనా! సర్వేజనా సుఖినో భవంతు అనే వారికి మత ద్వేషం అనటానికి నోరు రాలేదు. ఒక భావజాలం అది మతవిద్వేషమైనా, మరొకటైనా నిర్మూలించటానికి అదేమైనా వస్తువు, ప్రాణి కాదే! చరిత్రలో చార్వాకులను చంపేశారు, వారి గ్రంథాలను తగులబెట్టారు తప్ప వారి భావజాలాన్ని నిర్మూలించగలిగారా! జనం ఆదరించకపోతే ఏదైనా వెనక్కుపోతుంది, ఆదరిస్తే మనదేశంలో కవలపిల్లల మాదిరి మెజారిటీ, మైనారిటీ మతవిద్వేషం రెచ్చిపోతుంది!

■ ఎం. కోటేశ్వరరావు

## ఎంజీఎం ఎ.డి. సరెండర్

వరంగల్ మెడికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలిసింది. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో 'పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' గత ఫిబ్రవరి 6వ తేదీన ప్రత్యేక కథనం ప్రచురించింది. దీని ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖతోపాటు వైద్య విద్యా సంచాలకుడు విచారణ కమిటీని నియమించారు. వారు ప్రభుత్వానికి నివేదికను సమర్పించిన క్రమంలో ప్రభుత్వ సూచనల మేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.డి. ఇస్మాయిల్‌ను సరెండర్ చేసినట్లు తెలిసింది.

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ శనివారం కాజీపేటకు వస్తున్నారు. అయోధ్యాపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను ఆయన స్వయంగా పరిశీలించనున్నారు. పనుల పురోగతి, ప్రారంభోత్సవం ఎప్పుడు జరపవచ్చు.. అనే అంశాలపై ఆయన అధికారులతో చర్చించనున్నారు. రైల్వేశాఖను నిర్వహిస్తున్న మంత్రి సుదీర్ఘకాలం తర్వాత ఓరుగల్లుకు వస్తున్నారు. దీంతో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రైల్వేపరంగా స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆయన దృష్టి సారిస్తారని, పరిష్కారానికి కార్యాచరణ ప్రకటిస్తారని అన్ని వర్గాల వారు ఆశిస్తున్నారు. నిజానికి కాజీపేట.. జంక్షన్ మాత్రమే కాదు. ఉత్తర-దక్షిణ భారతదేశానికి కీలక వారధి. అయినా ఇక్కడ అనేక సమస్యలు కూతపెడుతున్నాయి. సౌత్‌సెంట్రల్ రైల్వేలో అత్యధికంగా ఆదాయం వస్తున్నప్పటికీ కాజీపేట... డివిజన్ హోదాకు నోచుకోవటం లేదు. సికింద్రాబాద్-కాజీపేట మధ్య ట్రాఫిక్ పెరుగుతున్నప్పటికీ మూడోలైన్‌కు మోక్షం లేకుండాపోయింది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న కోల్‌రైల్ కూత వినిపించటం లేదు. ఇక కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్ కలగానే మారుతోంది. కొత్తగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన డోర్నకల్-గద్వాల్, డోర్నకల్-మిర్యాలగూడ రైల్ లైన్లకు నిధుల కేటాయింపుల్లో జాప్యం జరుగుతోంది. ఒకటా..రెండా.. ఇలా అనేక సమస్యలకు కాజీపేట జంక్షన్ కేరాఫ్‌గా నిలుస్తోంది. వీటితోపాటు కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగావకాశాలపై గందరగోళం నెలకొంది. వీటిపై రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించాలని ఓరుగల్లు ప్రజానీకం కోరుకుంటోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



# ఎన్నాళ్లీ రెడ్ సిగ్నల్!?

పట్టాలెక్కని కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి

- తెలంగాణలో అతిపెద్ద రెండో రైల్వే జంక్షన్‌గా గుర్తింపు
- కోచ్ ఫ్యాక్టరీ సరే, డివిజన్ హోదా ఇచ్చేదెప్పుడో..
- కోల్ రైళ్ల కూత వినిపించేదెప్పుడో..
- సికింద్రాబాద్-కాజీపేట మధ్య మూడో లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఏదీ..
- కాజీపేట-హసన్‌పర్తి మీదుగా కరీంనగర్ లైన్‌కు నిధులేవీ..
- మేడారం మీదుగా రామగుండం నుంచి మణుగూరుకు రైల్ పట్టాలెక్కేనా..
- డోర్నకల్-గద్వాల్, డోర్నకల్-మిర్యాలగూడకు కొత్త రైల్ లైన్లకు మోక్షమేదీ..
- నేడు కాజీపేటకు రానున్న రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్
- పెండింగ్ డిమాండ్లు, పనులపై హామీలు ఇస్తారని ఆశలు

వివరాలు : 7 లో..

### నేడు కేంద్ర రైల్వే మంత్రి రాక

కాజీపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే జంక్షన్‌కు వస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో ఆయనతో పాటు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మధ్యాహ్నం 1. 30 గంటలకు కాజీపేట చేరుకుంటారు. కాజీపేట నుంచి 1.45 నిమిషాలకు ప్రత్యేక వాహనాల్లో అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సందర్శిస్తారు. సాయంత్రం 3.30కు కాజీపేట చేరుకుని తిరిగి సికింద్రాబాద్‌కు వెళ్తారని రైల్వే అధికారులు తెలిపారు.

### మానుకోటలోనూ అదే తీరు..

- మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో పరుగులు పెట్టని అభివృద్ధి పనులు
- నత్తనడకన 'అమృత్‌భారత్' పథకం అమలు
- నాలుగో ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఇబ్బందులు
- మట్టి దిబ్బల మధ్య నుంచి రైలు ఎక్కలేకపోతున్న ప్రయాణికులు
- రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ చొరవ తీసుకోవాలని వినతి

7

## మహిళలు లేకుండా సమాజం లేదు...

- ప్రతీ ఒక్కరు ఉక్కు మహిళగా తయారుకావాలి
- ఇందిర మహిళా శక్తి సంబరాల్లో మంత్రి సీతక్క
- లంచాలు అడిగితే చెప్పుతో కొట్టండి: ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ

చిట్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు లేకుండా సమాజం, సృష్టి లేదు అలాంటి మహిళలు ఉక్కు మహిళ ఇందిరమ్మలా మార్పు చెందాలని పంచాయితీ రాజ్, మహిళా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జయశంకర్ భూపాలపల్లిజిల్లా చిట్యాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ మైదానంలో శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి ఇందిర మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారుచేసేందుకు సీఎం రేవంతన్న, రాష్ట్ర ప్రభుత్వం కంకనం కట్టుకుని ఆదిశగా సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఇంట్లో ఒక మహిళ సంతోషంగా ఉంటే ఆకుటుంబం మొత్తం అనందంగా ఉంటుందని, మహిళ పేరిటే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు, మృతి చెందిన సభ్యురాళ్ల కుటుంబ సభ్యులకు బీమా చెక్కులు, ఆర్టీసి అద్దె బస్సుల ద్వారా వచ్చిన చెక్కులను సభ్యులకు అందజేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో ఎవరైనా అంచాలు అడిగితే చెప్పుతో కొట్టాలని సూచించారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు సిగ్గులేని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ సంబరాల్లో కుర్చీల కోసం మహిళలు గలాటకు దిగారు. అంచనాలకు మించి సుమారు 10వేలకు పైగా మహిళలు సభా ప్రాంగణానికి చేరుకోవడంతో సరిపడా కుర్చీలు, నీడ లేకపోవడంతో నిరాశకు లోనయ్యారు. అరకొర ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.





ఎన్‌క్లోజర్‌లోకి వస్తున్న తెల్లపులి

## అదిగో తెల్ల పులి!

- జూపార్క్‌లో ఎన్‌క్లోజర్‌లోకి వదిలిన మంత్రి సురేఖ
- జూపార్కును అభివృద్ధి చేస్తామని వెల్లడి

హనుమకొండ కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో గల కాకతీయ జువాలజికల్(జూపార్క్‌కు)పార్క్‌లో 13 సంవత్సరాల వయసున్న శరణ్ అనే మగ తెల్ల పులి సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. మంత్రి కొండా సురేఖ శుక్రవారం జెండా ఊపి దానిని ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేశారు. ఈ పులిని అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్ నుంచి ఇటీవల ఇక్కడికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ జూలోని జంతువుల సమాచారం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్స్, వనమహోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జూపార్కు అభివృద్ధికి రూ.4కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ డి.భీమానాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్‌తో పాటు జూపార్క్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధే మంత్రంగా 'స్థానిక' ఎన్నికలకు...

- ప్రజలకు వాస్తవాలను వివరిస్తాం
- కేంద్రం ఏం చేసిందో బీఆర్ఎస్, కాంగ్రెస్ చర్చకు వస్తే చెబుతాం
- డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చేయాలి
- కాంగ్రెస్ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వనాశనం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



7

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే దేశం అభివృద్ధి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



ప్రజలకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి సురేఖ, కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి

వరంగల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100రోజుల కార్యక్రమాల్లో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేఖ... కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ వారి పేరు మీద అన్ని పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 100 మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.2.41 కోట్ల వడ్డీలేని రుణాలు, 98 మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.12.46 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులు, 2,690 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన వివిధ రకాల చేనేత ఉత్పత్తులు, తినుబండారాలు తదితర స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంకా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డీసీఎస్‌వో కిష్టయ్య, అదనపు కమిషనర్ జోనా, ఆర్‌డీవో సత్యపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మహ్మద్ ఫుర్ఖాన్, కావటి కవిత, పల్లం పద్మ, గుండు చందన, మరుపల్ల రవి, చింతాకుల అనిల్, బోగి సువర్ణ, పోశాల పద్మ, మండల ప్రత్యేకాధికారి రమేష్, సంబంధిత శాఖల అధికారులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- ప్రజాపాలనను ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ ప్రభుత్వం గల్లా పెట్టెను ఖాళీ చేసి పోయింది
- మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కోసం రూ. 7వేల కోట్లు చెల్లించాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ముల్కనూర్‌లో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు వివిధ రకాల సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ. 4కోట్ల వ్యయంతో కొత్తకొండ-నారాయణగిరి వరకు డబుల్ తార్ రోడ్ నిర్మాణం, ఆరు జిమ్‌ల ప్రారంభోత్సవం, రూ. 1.10కోట్లతో ముల్కనూర్ నుంచి కొత్తపల్లి వరకు రోడ్ నిర్మాణం, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. వన మహోత్సవంలో భాగంగా ముల్కనూర్‌లో మొక్కలు నాటారు. తర్వాత ముల్కనూర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో కలిసి 66 కల్యాణలక్ష్మి చెక్కులు, 1284 కొత్త రేషన్‌కార్డులు, 2503 రేషన్‌కార్డుల్లో కొత్త పేరు నమోదు, 14 ఇందిరమ్మ ఇండ్లకు పట్టాలు, రూ. 30లక్షలు బ్యాంకు లింకేజీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా (మిగతా 8లో..)

## సమ్మక్క సాగర్ బ్యారేజీలో 15 గేట్లు మూసివేత



మూసిన బ్యారేజీ గేట్లు

కన్నాయిగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీలో గేట్లను మూసి వేశారు. గురువారం వరకు బ్యారేజీలోని మొత్తం అన్ని గేట్లు ఎత్తి బ్యారేజీ వద్ద గోదావరి వరదను ఫ్రీ ఫ్లోగా ఉంచిన అధికారులు ఎగువనుంచి ఇన్ ఫ్లో తగ్గడంతో ఒక్కొక్కటిగా గేట్లను మూసివేస్తున్నారు. శుక్రవారం ఉదయం వరకు 14 గేట్లను మూసివేసిన అధికారులు మధ్యాహ్నానికి మరో గేటును మూసివేశారు. ఎగువ నుంచి 83,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో బ్యారేజీలోని 44 గేట్లను ఓపెన్ చేసి ఉంచి 82,072 క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.964 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 73.40 మీటర్ల నీటి మట్టం నమోదయింది.

## మేడిగడ్డకు కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 82,330క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 1.90మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

## భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనుమానం నెపంతో భార్యను నిత్యం వేధిస్తూ హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి వీబీ నిర్మల గీతాంబ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. వరకట్న వేధింపు కేసులో రూ. 2500 జరిమానా విధించారు. చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలన్నారు. హత్య కేసులో రూ. 2500 జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా ఈ శిక్షలన్నింటినీ ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలిలా ఉన్నాయి. వరంగల్ శివనగర్‌కు చెందిన రమ్యను అదే ప్రాంతానికి చెందిన షైన నరేష్‌తో గత 20 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. కొంత కాలం తర్వాత భార్యపై అనుమానం పెంచుకొని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. విచక్షణారహితంగా కొట్టేవాడు. అనుమానంతో నిత్యం రమ్యను వేధిస్తూ నిన్ను ఏనాటికైనా చంపుతానని పలు మార్లు బెదిరించాడు. నిందితుడి బాధలు తట్టుకోలేక తల్లి వద్దకు వెళ్లింది. మళ్లీ అత్తగారింటికి వచ్చి రమ్యకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. డిసెంబరు 31న మధ్యాహ్నం 2.30 గంటలకు విపరీతంగా కొట్టి ఇంటిబయటకు కూర్చొని ఆమె గొంతు నులిమి చంపి పారిపోయాడు. తన కూతురు చనిపోయిందని పక్కింటి వారు ఫోన్ చేసి చెప్పడంతో తల్లి జయమ్మ , చెల్లె నాగమణి హుటాహుటిన వెళ్లగా రమ్య చనిపోయి ఉంది. దీంతో అనుమానంతో తన చెల్లె రమ్యను హత్యచేసిన నిందితుడు షైన నరేష్‌ను శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై హత్యానేరం, వరకట్నం వేధింపులు తదితర కేసులు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ. 5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ దౌడు ప్రతాప్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా కె. హరికృష్ణ దర్యాప్తు అధికారులుగా సీఐలు పి. దయాకర్, ఎం. శ్రీనివాస్ వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కేసు వాదించారు.

## నలుగురి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

మట్టెవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన శ్యామల కిషన్‌రావు, శివనగర్‌కు చెందిన పాశికంటి శ్రీనివాస్, శంభునిపేటకు చెందిన పిండి అనిల్, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురంకు చెందిన మామునూరి సుమన్‌ల డ్రైవింగ్ లైసెన్స్‌లను వరంగల్ జిల్లా రవాణాశాఖ అధికారి సస్పెండ్ చేశారు.



# నకిలీ గృహోపకరణాలు సీజ్

- ఆరుగురు అరెస్టు, రూ.32 లక్షల విలువ గల పరికరాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



స్వాధీనం చేసుకున్న నకిలీ పరికరాలు, పట్టుకున్న నిందితులను చూపిస్తున్న డీసీపీ

వరంగల్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల పేరుతో మార్కెట్‌లో నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు విక్రయిస్తున్న ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 32 లక్షల విలువ చేసే కరెంట్ వైర్లు, స్విచ్ బోర్డులు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా శుక్రవారం తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం వరంగల్ జేపియన్ రోడ్డులోని మహేంద్ర ఎంటర్ ప్రైజెస్, హనుమకొండ హనుమాన్‌నగర్ లోని శ్రీఆర్ బుదా ఎలక్ట్రికల్ అండ్ సానిటరీ, కేయూ పీఎస్ పరిధిలోని సాయి గణేశ్ ఎలక్ట్రికల్ షాపుల్లో ఏకకాలంలో దాడులు చేశారు. మూడు షాపుల నుంచి రూ.32 లక్షల విలువ గల నకిలీ పరికరాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమానులను అదుపులోకి తీసుకున్నారు. వారి ద్వారా నకిలీ పరికరాలు విక్రయిస్తున్న హైద్రాబాద్‌కు చెందిన పురోహిత్ శ్రవణ్‌కుమార్, పురోహిత్ భరత్ కుమార్, అమృత్‌జైన్‌లను అరెస్టు చేసి, షాపు నిర్వహకులైన పొనమారం చౌదరి, రాజ్‌పురోహిత్, కాంతిలాల్‌పై కేసు నమోదు చేశారు. కాగా, నిందితుల్లో ఒకడైన భరత్‌కుమార్‌పై గతంలో హైద్రాబాద్‌లో 3 కేసులు నమోదు కాగా షాపు నిర్వహకులైన పొనమారం చౌదరి, కాంతిలాల్‌పై హనుమకొండ, కేయూసీ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన వరంగల్ ఏఎస్పీ శుభం, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్స్, పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

# పామాయిల్ సాగుతో రైతులకు మేలు



చల్వాయిలో రైతులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సీతక్క

**రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

గోవిందరావుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పామాయిల్ పంట సాగుతో పెట్టుబడి తక్కువ ఉండడమే కాకుండా రైతులు ఎక్కువ లాభాలు వస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయిలో శుక్రవారం పామాయిల్ సాగుచేస్తున్న రైతులకు సబ్సిడి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రైతులనుద్దేశించి మాట్లాడుతూ పామాయిల్ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. జిల్లాలో పండించిన పామాయిల్ గింజలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా జంగాలపల్లి సమీపంలో పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గోవిందరావుపేట మండలంలో 70 ఎకరాల్లో పామాయిల్ సాగు చేయడం హర్షించదగ్గ విషయమని, నాలుగేళ్ల పంటను పెంచితే 30 ఏళ్ల వరకు స్థిరమైన ఆదాయం పామాయిల్ వల్ల రైతులకు వస్తుందన్నారు. ఆయిల్ గెలలను కేఎన్ బయోసైన్స్ కంపెనీ కొని టన్నుకు రూ. 17,463లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్ వద్ద హరిత వనమహోత్సవంలో భాగంగా మంత్రి మొక్కలను నాటారు. అనంతరం నిరుపేద కుటుంబాల లబ్ధిదారులకు రేషన్ కార్డులను మంత్రి అందచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ టి.ఎస్ దివాకర, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచంద్ర, అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి డి. సంజీవరావు, డీపీవో సురేష్‌కుమార్, తహసీల్దార్, సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

# ఓరుగల్లు సంగీత కిరీటం తిరుపతయ్య

- డాక్టర్ శరత్ చంద్ర ప్రశంసలు
- ఘనంగా గంధర్వ గళ గీతామృతం సంగీతోత్సవం



తిరుపతయ్యను సత్కరిస్తున్న డాక్టర్ శరత్ చంద్ర

హనుమకొండ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నుంచి సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతున్న ఓరుగల్లు పట్టణం సంగీత సౌరభాలను మరింత వెదజల్లనున్నదని హైదరాబాద్‌కు చెందిన అభినవ ఘంటసాల మాస్టర్ డాక్టర్ శరత్ చంద్ర అన్నారు. హనుమకొండలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ రోడ్డులోని శ్రీ సాయిమీరా కల్చరల్ సొసైటీలో శుక్రవారం గంధర్వ గళ గీతామృతం సంగీతోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శరత్‌చంద్ర మాట్లాడుతూ.. తాను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఘంటసాల పాటల కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నలుమూలల నుంచి గాయనీ గాయకులను సమీకరించానని, వీరికి శిక్షణ ఇచ్చి 96 ఎపిసోడ్లను చేయబోతున్నానని అన్నారు. అందులో భాగంగా తాను ఇప్పటికే వరంగల్‌కు పలుమార్లు వచ్చానని, ఇక్కడి గాయనీ గాయకులకు తర్ఫీదు ఇచ్చానని తెలిపారు. వరంగల్ కళాకారులను ప్రోత్సహించే క్రమంలో ఆచార్యులు తిరుపతయ్య అందించిన విశేష సంగీత సేవలను గుర్తించి వరంగల్‌లో ఆయన పేరిట విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించాలని కోరామన్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ రూపొందించిన లోగోను డాక్టర్ శరత్ చంద్ర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ వ్యవస్థాకుడు, చైర్మన్ పోతనాచారి, ఆచార్య తిరుపతయ్య, ప్రముఖ కవి సిరాజుద్దీన్, విప్పనపల్లి రవికుమార్, బిటవరం శ్రీమన్నారాయణ, లక్ష్మినారాయణ, అనంతుల రాధిక, నీరజ, రంగు రఘపతి, సనశ్రీ, రాధిక తదితరులు పాల్గొని పాటలతో అలరించారు.

## రెండు తులాల గొలుసు అపహరణ

**దొంగలను పట్టించిన సీసీ కెమెరా**





పోలీసులకు చెబుతున్న బాధితురాలు వెంకటమ్మ, సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

కేసముద్రం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం కల్వల శివారులో శుక్రవారం మధ్యాహ్నం వృద్ధురాలి మెడలోంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...బొడ్డు వెంకటమ్మ తన పొలం వద్ద పని చేసుకొని రోడ్డు వెంట కూర్చొని ఉండగా నీలిరంగు స్కూటీపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోంచి సుమారు రూ.2లక్షల విలువైన రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంకటమ్మ మనుమడు తమ పొలం వద్ద గతంలో రెండుసార్లు మోటార్లు చోరీకి గురికావడంతో చెట్టుపై సోలార్ సీసీ కెమెరాను ఏర్పాటు చేశాడు. ఈ సీసీ ఫుటేజీలో చోరీకి పాల్పడిన వ్యక్తులు కనిపించారు. వారి ఆనవాళ్లను బట్టి వెంటనే చుట్టుపక్కల అప్రమత్తం చేయడంతో వారు చిక్కినట్లు సమాచారం. మోటారు దొంగల కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా గొలుసుదొంగలను పట్టించిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంపై రూరల్ సీఐ సర్వయ్యను వివరణ కోరగా ఘటనస్థలాన్ని సందర్శించి, చోరీపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

# నకిరేకల్‌లో రెండు కార్లు ఢీ

- మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య దంపతులకు గాయాలు



గాయపడిన బండి పుల్లయ్య, నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

మహబూబాబాద్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరెకల్ సమీపంలోని తొమ్మిదవ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో మానుకోట మాజీ ఎమ్మెల్యే బండిపుల్లయ్య దంపతులకు గాయాలయ్యాయి. మానుకోటకు చెందిన బండి పుల్లయ్య, సతీమణి నర్మద దంపతులు హైదరాబాద్‌కు వెళ్తున్నారు. శనివారం ఉదయం అమెరికా నుంచి వారి కూతురు వస్తున్న సందర్భంగా శంషాబాద్ విమానశ్రయంకు వెళ్లి రిసివ్ చేసుకునేందుకు హైదరాబాద్‌కు కారులో బయలు దేరారు. నకిరెకల్ సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న బండి పుల్లయ్య, ఆయన భార్యకు గాయాలయ్యాయి. వారి వెనుకాల మరో కారులో హైదరాబాద్‌కు వెళ్తున్న మహబూబాబాద్ వాసి జకీర్ ప్రమాదఘటనను చూసి కారును ఆపారు. గాయపడ్డ పుల్లయ్య దంపతులను స్థానికుల సహాయంతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

# దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

**ఆగస్టు 13న పెన్షన్‌దారుల మహాగర్జనకు తరలిరావాలి**

**కేయూ ప్రొఫెసర్ పెద్దమళ శ్రీనివాసరావు**



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ ప్రొఫెసర్ పెద్దమళ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్ జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ. 6వేలకు పెంచాలని కేయూ ప్రొఫెసర్ పెద్దమళ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 13న దివ్యాంగుల పెన్షన్ పెంపుపై హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు మహాగర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కేయూ గెస్ట్ హౌజ్‌లో కేయూ దివ్యాంగుల సంఘం ఇన్‌చార్జి బొస్కె నాగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పెద్దమళ శ్రీనివాస్‌రావు, టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్యలు హాజరై మాట్లాడారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను 6వేలకు పెంచుతామని ప్రకటిందన్నారు. ఎన్నికల హామీని నెరవేర్చాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వృద్ధులు, ఒంటరి మహిళలు, నేత,గీత కార్మికులకు పెన్షన్ రూ. 4 వేలకు పెంచుతామని ప్రకటించారని అన్నారు. పెన్షన్‌లను పెంచకపోతే లక్షలాది మంది కాంగ్రెస్‌కు దివ్యాంగులు దూరం అవుతారని చెప్పారు. పెన్షన్‌ల పెంపు కోసం చేపడుతున్న నిరసనల్లో భాగంగా ఈనెల 29న హనుమకొండలో జిల్లా సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీమంద కృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, అడ్డూరి లక్ష్మణ్, తరుణ్, డాక్టర్ పుల్లా కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కోచ్ ఫ్యాక్టరీ భూ బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కాజీపేటలో పర్యటించిన నేపథ్యంలో దాస్యం వినయ్ భాస్కర్ పలు సూచనలను ప్రకటనలో తెలిపారు. జంక్షన్‌గా ఉన్న కాజీపేటను డివిజన్ స్థాయికి అప్ గ్రేడ్ చేస్తూ, కాజీపేట డివిజన్ చేసిన తర్వాత 80 శాతం ఉద్యోగాలు లోకల్ వారికే ఇవ్వాలని, వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేస్తూ బోడగుట్ట వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, అమృత్ భారత్ పథకంలో నత్తనడకన సాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని , విజయవాడకు తరలించిన క్రూలింక్‌లను తిరిగి కాజీపేటకు తరలించాలని రైల్వే కోచ్‌లకు, ఇంజన్లకు ఇతర రైల్వే అవసరాలకు సంబంధించిన విడి పరికరాలను తెలంగాణలో ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తిదారుల నుంచే కొనుగోలు చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని కొట్లాడి సాధించామని రాష్ట్ర పునర్విభజన హక్కుల సాధన కోసం కొట్లాడింది బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల కల, హక్కు అని దాని సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీదాకా , అసెంబ్లీ నుంచి పార్లమెంట్ దాక 40 ఏళ్ల పాటు కోచ్ ఫ్యాక్టరీ కోసం నిరంతరాయంగా కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఓరుగల్లు ప్రజలు ఎన్నో పోరాటాలు, ఐక్య ఉద్యమ కార్యాచరణలు చేపట్టారని ప్రకటనలో దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

**గూడూరు మండల వాసి మృతి**



జనార్ధన్ (ఫైల్)

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగరంలో ఆదిభట్ల ఔటర్ రింగురోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం మర్రిమిట్ట శివారు తోట దస్రు తండాకు చెందిన గుగులోతు జనార్దన్ (48) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. జనార్ధన్ కుమార్తె సునీత హైదరాబాద్ బీటెక్ తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. హాస్టల్లో కళాశాలకు వెళ్లి వస్తుండేది. సునీత హాస్టల్ భోజనం పడకపోవడంతో జనార్ధన్ కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడే నివాసముంటున్నాడు. ఓ ఫంక్షన్‌హాల్లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. యాదాద్రిగుట్ట నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు కారులో జనార్ధన్‌తో పాటు నలుగురు స్నేహితులు, బంధులు కలిసి వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారును ఓ లారీ వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు 108 ద్వారా ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ.. తీవ్రంగా గాయపడిన ఇరువురు మృతి చెందాడు. మృతుల్లో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తోటదస్రుతండాకు చెందిన గుగులోతు జనార్ధన్ కూడా ఉండడంతో తోట దస్రుతండాలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య షైబు, కుమార్తె సునీత ఉన్నారు. మృతి వార్త తెలుసుకున్న మానుకోట మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జనార్ధన్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అక్కడి పోలీసులు, వైద్యులతో మాట్లాడి త్వరితగతిన పోస్టుమార్టం జరిగేల కృషి చేశారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



ఆకుల ఓదెలు(ఫైల్ )

మల్హర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మల్హర్ మండల కేంద్రమైన తాడిచర్లలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. కొయ్యూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిచర్ల గ్రామానికి చెందిన ఆకుల ఓదెలు(76) తనకున్న వ్యవసాయ భూమిలో కూరగాయలు సాగు చేస్తున్నా డు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం తోటకు నీల్లు కట్టడానికి వెళ్లి ప్రమాద వశాత్తు తోటకు ఉన్న విద్యుత్ తీగకు తగిలి షాక్ మృతి చెందాడు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అడవుల రక్షణ అందరి బాధ్యత

వెంకటాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : అడవుల సంరక్షించడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని సీసీఎఫ్ ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆలుబాకలో శుక్రవారం గల అటవీ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలో వెంకటాపురం, వాజేడు మండలాల అటవీశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండా లని, వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ సంపదను కాపాడడంలో అధికారుల పాత్ర ప్రముఖమైనదన్నారు. అనంతరం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తదితరులు ఉన్నారు.

## మార్కెట్‌కు వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు వరుసగా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి తెలిపారు. శనివారం యార్డు బందు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం బోనాల పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

## గాడిద పాలు ఎంతో ప్రియం

**జండుబామ్ సీసా రూ.500**

మరిపెడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంగిగోవు పాలు గరిటెడైన చాలు.. కడివెడైన నేమి ఖరము పాలు.. అనేది పాత నానుడి.. ఇప్పుడు రోజులు మారాయి. గాడిద పాలకే డిమాండ్ ఎక్కువైంది. వాటితో జలుబు, ఉబ్బసం, దగ్గు, పక్షవాతం, ఆయాసం, మోకాళ్ల నొప్పులు తదితర రోగాలు మటుమాయమవుతాయన్న నమ్మకంతో జనం ఎక్కువగా తాగుతున్నారు. దీంతో జండుబామ్ సీసా పాలు రూ.500లకు అమ్ముతున్నారు. శుక్రవారం మరిపెడ మునిసిపాలిటీలో కనబడ్డది.

# ఎన్నాళ్లీ రెడ్ సిగ్నల్!?

**పట్టాలెక్కని కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి**

- నేడు కాజీపేటకు రానున్న రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్
- పెండింగ్ డిమాండ్లు, పనులపై హామీలు ఇస్తారని ఆశలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక అదాయం వచ్చే కాజీపేట.. రాష్ట్రంలో రెండో అతిపెద్ద జంక్షన్‌గా ఉంది. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతి రోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెంతో పాటు బల్లార్షా తదితర ప్రాంతాల నుంచి బొగ్గు రవాణా, సరుకుల రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్‌లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తోంది.

### కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు దక్కేనా..?

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగావకాశాలు ఉంటాయా.. ఉండవా అనే ఆందోళనలో నిరుద్యోగులు ఉన్నారు. రైల్వే అనుబంధ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), జపాన్‌కు చెందిన టైకిషా కంపెనీ సంయుక్తంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నాయి. ఇప్పటికే 75శాతం పైగా పనులు పూర్తయ్యాయి. పరోక్షంగా 10వేల మందికి పైగా కోచ్‌ఫ్యాక్టరీ ద్వారా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అయితే మల్టీపుల్ ఫ్యాక్టరీ కోసం సుమారు 3,500మంది వరకు ఉద్యోగులు రైల్వేకు అవసరంగా అధికారులు పేర్కొంటున్నారు. వీరిలో 500 నుంచి వెయ్యి లోపు వరకే రైల్వేశాఖ నుంచి రిక్రూట్ చేసుకుని, మిగతా ఉద్యోగులను తాత్కాలిక పద్ధతిన ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు



కాజీపేట దర్గ రైల్వే గేట్ దగ్గర గేటువేసిన కుడా నిర్లక్ష్యంగా తమ వాహనాలను అటువైపుగా తరలిస్తున్న దృశ్యం



అసంపూర్తిగా నిర్మనంలో ఉన్న కాజీపేట బ్రిడ్జి

ఏదైనా కంపెనీకి ఏజెన్సీ ఇవ్వాలని భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న స్థానికులకు అన్యాయం జరుగుతుందని రైల్వే జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంజాబ్‌లోని కపుర్తాల కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 50శాతం ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జీవో నెం.36/18-1988లో ఇచ్చిందని, అదే తరహాలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో భూములను త్యాగం చేయటంతో పాటు 55ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్న స్థానికులకు కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

### కోల్‌రైల్ కూత పెట్టేనా..?

ఉమ్మడి జిల్లాలో రైల్ కనెక్టివిటీ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు లేదు. అయితే 1999 నుంచి భూపాలపల్లి మీదుగా రైల్వే లైన్ నిర్మించాలనే ప్రతిపాదనలు బుట్టదాఖలవుతున్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలో మీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2024-25 బడ్జెట్‌లో రూ.1,400 కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఇప్పటికే మట్టి సేకరణ టెస్టింగులు పూర్తి చేసిన అధికారులు, రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ లైన్ నిర్మాణం పూర్తైతే బొగ్గు రవాణాతో పాటు మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు రైల్ కనెక్టివిటీ పెరగనుంది. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు సైతం వచ్చే పర్యాటకులకు రైల్ సౌకర్యం ఏర్పడనుంది. అయితే భూసేకరణతో పాటు ఇతర పనులకు రైల్వేశాఖ నుంచి నిధులు కేటాయింపులు లేకుండా పోయాయి. అలాగే కాజీపేట నుంచి భూపాలపల్లి వరకు 64కి.మీ. రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2023-24 బడ్జెట్‌లో ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రూ.1,152కోట్ల నిధులు కేటాయించింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్ నుంచి మర్రిపల్లి వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, అక్కడి నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లికి రైల్వేలేన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రెండు రైల్వేలైన్లు కూడా బొగ్గు సరఫరాకు పెద్దపీఠ వేసేలా ప్రతిపాదనలు చేశారు. అయితే ఇప్పటి వరకు ఈ కోల్ లైన్ల నిర్మాణంపై కేంద్రంలో కదిలికలేదు.

### డివిజన్ హోదాపై ఆశలు..

కాజీపేట జంక్షన్‌కు రైల్వే డివిజన్ హోదా కలగానే మిగులుతోంది. కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత 30ఏళ్లకు పైగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పని చేస్తోంది. ఈ జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ (మహరాష్ట్ర), ఏపీలోని గుంతకల్, విజయవాడ, గుంటూరు రైల్వే డివిజన్‌లు ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒత్తిడితో విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సికింద్రాబాద్ కేంద్రంగా సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌లు మాత్రమే మిగులుతున్నాయి. దీంతో కాజీపేటను డివిజన్ కేంద్రంగా మార్చాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే రైల్వేశాఖ అధికారులు కాజీపేట సబ్‌డివిజన్‌కు హైదరాబాద్ వైపు భువనగిరి- ఆలేరు, ఢిల్లీ వైపు బల్లార్షా, వరంగల్ నుంచి విజయవాడ వైపు కొండపల్లి, మణుగూరు- సత్తుపల్లి సెక్షన్‌ను హద్దులుగా ఖరారు చేశారు. ఈ హద్దులతోనే కాజీపేటకు డివిజన్ హోదా కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

### మరికొన్ని రైల్వే ప్రాజెక్టులపై...

- కాజీపేట - సికింద్రాబాద్ మధ్య రైళ్ల ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రెండు లైన్లే ఉండటంతో మూడో లైన్ నిర్మించాలని సర్వే పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.2,837కోట్లతో అంచనాలు రూపొందించారు. మూడో లైన్ నిర్మాణంతో రైళ్ల రాకపోకలు వేగంగా సాగనున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ లైన్‌కు సంబంధించి నిధులు కేటాయింపులు లేకపోవటంతో పనులు ముందుకు సాగటం లేదు.
- దక్షిణ, ఉత్తర భారతదేశాన్ని కలిపే కాజీపేట రైల్వే మార్గం అయినప్పటికి ఇక్కడ ట్రయాంగిల్ ఫ్లాట్‌ఫారాలు లేవు. దీంతో ఢిల్లీ నుంచి చెన్నై, ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే ఫ్లాట్ ఫారాలపై రైళ్లను నిలిపే అవకాశం లేకుండా పోతుంది. ట్రయాంగిల్ ఫ్లాట్ ఫారాలతో పాటు ఇక్కడి నుంచే కొత్తగా రైళ్లను నడిపించేలా రైల్వేశాఖ ప్రకటన చేస్తుందనే ఆశతో ఉన్నారు.
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105 కి.మీ. రైల్వే లైన్ ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేసింది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేసినప్పటికీ పనులు ముందుకు సాగటం లేదు.
- డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కి.మీ. రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేసేందుకు ఈ లైన్ ఏర్పాటు చేస్తున్నారు.

భారీ ఎత్తున నిధులు అవసరం ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రైల్వే వ్యాపారానికి పెద్దగా అవకాశాలు లేకపోవటంతో రైల్వేశాఖ ఆసక్తి చూపటం లేదనే ప్రచారం ఉంది.

- కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ. రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో హనుమకొండ- కరీంనగర్ మధ్య దూర భారం తగ్గటంతో పాటు గ్రానైట్ పరిశ్రమకు అనుకూలంగా మారనుంది. కానీ, నిధుల కేటాయింపులు లేకపోవటంతో పనులు సాగటం లేదు.



రైలు ఎక్కేందుకు పట్టాలుదాటుతూ.. వెళ్తున్న ప్రయాణికులు

- మహబూబాబాద్ రైల్వే స్టేషన్ అమృత్‌భారత్ తీరు
- నాలుగో ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఇబ్బందులు
- మట్టి దిబ్బల మధ్య నుంచి రైలు ఎక్కలేకపోతున్న ప్రయాణికులు
- రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ చొరవ తీసుకోవాలని వినతి

# పరుగులు పెట్టని అభివృద్ధి పనులు

మహబూబాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైల్వేస్టేషన్‌ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంతో దేశ వ్యాప్తంగా 1300రైల్వే స్టేషన్లు, తెలంగాణ వ్యాప్తంగా 70 స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అమృత్ భారత్‌కు ఎంపికైన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం రూ.36 కోట్లు కేటాయించగా ఎందువల్లో కానీ పనుల్లో వేగం తగ్గినత్తనడకన కొనసా..గుతున్నాయి. కాజీపేట, విజయవాడ సెక్టార్ నడుమ అత్యధిక ఆదాయాన్ని ఇస్తున్న స్టేషన్‌లలో మహబూబాబాద్‌కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ స్టేషన్‌ను అమృత్‌భారత్ పథకంలో చేర్చి భారీగా నిధులు కేటాయించడంతో అభివృద్ధి పట్టాలెక్కుతుందని అంతా సంతోషపడ్డారు. జిల్లాకేంద్రంతో పాటు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగాఉండడంతో ఈస్టేషన్‌నుంచి దేశ రాజధాని ఢిల్లీకి రాకపోకలు సాగించే పలు రైళ్లకు హాల్టింగ్ కూడ లభిస్తుందని ఆశపడ్డారు. అమృత్‌భారత్ కిందికి చేర్చిన ఈ స్టేషన్ అభివృద్ధి పనులు 14 నెలల కిందట ఆరంభం కాగా, ప్యాసింజర్ రైలులా నెమ్మదిగా సాగుతున్నాయి.

దీంతో సెకండ్ ఫ్లాట్‌ఫాం వెలుపల తవ్వి మూడోలైన్ పను లు ఆరంభించినప్పటికి 4వ నెంబర్ ఫ్లాట్‌ఫాం ఏర్పాటు చేయకపోవడంతో తవ్విన మట్టి దిబ్బల నడుమ నుంచి నడుచుకుం టూ వెళ్లి ప్లాట్‌ఫాం పైకి ఎక్కి 3వ ఫ్లాట్‌ఫాంపైకి వచ్చే రైళ్లలో ప్రయాణించడం ఇబ్బందిగా పరిణమించింది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి కడు దయనీయంగా మారింది.

### అభివృద్ధి పనులు నెమ్మదిగా..

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో పాత మొదటి, రెండవ ఫ్లాట్‌ఫాం రాకపోకలకు ఏర్పాటు చేసిన లిఫ్టు, నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి మాత్రమే పనిచేస్తున్నాయి. అమృత్‌భారత్ పనుల్లో చేపడుతున్న పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్స్‌టెన్షన్‌తో మొదలెట్టిన కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తాపీగా కొనసాగుతుంది. దీంతో పాటు ఎస్కలేటర్ పనులు కూడా ఆరంభమయ్యాయి. ఈ పనులు పూర్తి కాకపోవడం వల్ల దాదాపు ఏడాది కాలంగా మహబూబాబాద్ నుంచి దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు 3వ ప్లాట్‌ఫాం వైపు తవ్విన మట్టి దిబ్బల నుంచి నడిచి 3వ లైన్ మీదుగా ప్లాట్‌ఫాం ఎక్కుతూ.. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. రైల్వే స్టేషన్‌కు ముందుగా చేరుకున్న ప్రయాణికులు 3వ నెంబరు ప్లాట్‌ఫాం నుంచి రైలు ఎక్కుతున్నారు. అయితే రైలు వచ్చి పట్టాలపై ఉన్న సమయంలో 4వ నెంబరు ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఆ వైపు ఉన్న ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వచ్చి, వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో టికెట్, రిజర్వేషన్ కౌంటర్లు లేవు. దీంతో టికెట్ తీసుకునే సమయంలో ప్రయాణికులకుఇబ్బందులు తప్పడంలేదు. రైల్వే ఉన్నతాధికారులు చొరవ తీసుకొని టికెట్, రిజర్వేషన్ కౌంటర్లు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. అమృత్ భారత్ పనులు ఆరంభమై ఏడాదిన్నర కావొస్తున్న క్రమంలో ఇక్కడిప్రజల ఇబ్బందులు గుర్తించి పనులను వేగవంతం చేయడంలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. అమృత్ భారత్ పథకంలో కేవలం సుందరీకరణకే మొదట ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు ప్రయాణికుల సౌకర్యాలపై కూడ పూర్తిస్థాయి దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

### ఇటు నజర్ పెట్టండి...

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించేందుకు ఈ నెల 19న పర్యటించనున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఒకసారి మహబూబాబాద్ రైల్వేస్టేషన్ అమృత్‌భారత్ పనుల జాప్యంపై దృష్టి పెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్నపనుల వల్ల ప్రయాణికులే కాకుండ జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాప్రతినిధులు స్వయంగాపరిశీలించి చేసిన విజ్ఞప్తులు కూడ ఫలించకపోవడంతో ఇక కేంద్ర రైల్వే మంత్రి దృష్టి సారించాలని, ప్రజల ఇబ్బందులను గుర్తించిపనులను వేగవంతం చేయించాలని వేడుకుంటున్నారు.



మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న 3వ లైన్ పనులు



నెక్కొండలోని ఉపేందర్ నర్సింగ్ హోమ్‌లో విచారణ జరుపుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

# లింగ నిర్ధారణ పరీక్షలపై పోలీసుల విచారణ

నెక్కొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు జరిపితే ఆస్పత్రి యాజమాన్యంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నెక్కొండలోని ఉపేందర్ ఆస్పత్రిలో తనిఖీలను నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళ వరంగల్ జిల్లా నెక్కొండలోని ఉపేందర్ ఆస్పత్రిలో ఇటీవల లింగనిర్ధారణ పరీక్ష చేయించుకున్న విషయమై ఖమ్మం వైద్య ఆరోగ్య శాఖ ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో కేసు నెక్కొండ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడంతో విచారణ చేపట్టామన్నారు.

పూర్తి విచారణ జరిపిన అనంతరం ఆధారాలు లభించిన వెంటనే ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 17న వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఉపేందర్ ఆస్పత్రిని తనిఖీ నిర్వహించినట్లు తెలిసింది.

# అభివృద్ధే మంత్రంగా 'స్థానిక' ఎన్నికలకు..

- ప్రజలకు వాస్తవాలను వివరిస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

జనగామ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చేసిన అభివృద్ధే మంత్రంగా స్థానిక ఎన్నికలకు వెళ్తామని బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. 2014 నుంచి తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందనే వాస్తవాలను ప్రజలకు వివరిస్తామన్నారు. జనగామ జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన 'జిల్లా సంస్థాగత సంఘటన కార్యశాల'లో సంజయ్ పాల్గొన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేసేందుకు బీజేపీ కార్యకర్తలు, గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాలకు నిధులు ఎవరిస్తున్నారో స్పష్టమైన అవగాహన ప్రజలకు ఏర్పడిందన్నారు. అభివృద్ధి మంత్రం నినాదంగా తాము ఎన్నికలకు వెళ్తామని, కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం 'హాలే, బే, డ్రగ్స్ హీరోయిన్స్' వంటి నినాదాలతో పోటీ చేయాలని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. 10ఏళ్ల బీఆర్ఎస్, ఏడాదిన్నర పాలనలో కేంద్రం నుంచి ఎన్ని నిధులు ఇచ్చామో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బండి సవాల్ విసిరారు. ఈ సవాల్‌కు బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు రావాలని, ఏ గ్రామానికి రావాలో, ఎప్పుడు రావాలో టైమ్, డేట్, ప్లేస్ ఫిక్స్ చేయాలన్నారు. బీఆర్ఎస్‌తో మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇంకా దరిద్రంగా పాలన తయారైందన్నారు. 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ఏం మొఖం పెట్టుకొని పోటీ చేస్తుందని విమర్శించారు. సర్పంచులకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మోదీ నిధులు ఇవ్వకపోతే గ్రామాల పరిస్థితి ఏమై ఉండేదోనని మాజీ సర్పంచులే చెబుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు సైతం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారిందన్నారు.



జనగామలో విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

### ఇప్పుడూ ఫోన్ ట్యాపింగ్...

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందేమోనన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సిస్టమ్‌ను అంతా ధ్వంసం చేశారని చెబుతున్నారని, కానీ.. నిజంగానే ధ్వంసం చేశారా? లేదా ఆ సిస్టమ్‌ను అంతా కాంగ్రెస్ వాళ్లు ఎత్తుకొచ్చి పెట్టుకున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం నడుస్తోందని, అందువల్లే కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ స్కామ్, ఈ-ఫార్ములా కేసు, ఫామ్‌హౌజ్, విద్యుత్ కొనుగోళ్ల అంశం, చేపల స్కామ్ ఏమై పోయాయని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

### బీసీలకు ఇచ్చేది 32 శాతమే

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించట్లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చెబుతున్న 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42శాతంలో 10శాతం ముస్లింలకు ఇస్తున్నారని, దీంతో బీసీలకు ఇచ్చేది కేవలం 32శాతమే అవుతుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న 27శాతంతో పోలిస్తే కేవలం 5శాతం మాత్రమే ఎక్కువ ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇది బీసీలకు నష్టం చేసినట్లే అవుతుందన్నారు. బీసీలు కేసీఆర్ సర్వేలో 52 శాతం ఉండగా రేవంత్‌రెడ్డి సర్వేలో 47శాతమే ఉన్నారని, మిగతా 5 శాతం బీసీలు ఏమయ్యారని నిలదీశారు. బీసీలకు పూర్తిగా 42 శాతం రిజర్వేషన్ ఇస్తే అందరం కలిసి ప్రధానిని కలిసి ఒప్పిద్దామన్నారు.

# 23న కేయూలో రాష్ట్ర విద్యా కమిషనర్ పర్యటన

కేయూ క్యాంపస్ జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ అధికారుల బృందం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించనుంది.

కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కేయూ సెనెట్ హాల్ లో ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు వర్సిటీ ఉద్యోగ సంఘాలు, రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ప్రతినిధులు సమావేశం అవుతారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి, విభాగాధిపతులు, డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఇతర్ స్టేక్ హోల్డర్లు ఇందులో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం అందరూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య

- హనుమకొండలో ఉరి వేసుకున్న అక్షయ్
- మృతుడిది జనగామ జిల్లా అలీపురం
- ఒక్కగానొక్క కుమారుడి మృతితో కన్నీరుమున్నీరు

హనుమకొండ టౌన్/బచ్చన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని రెవెన్యూ కాలనీలో పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థి చింతల అక్షయ్ (20) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం. జనగామ జిల్లా బచన్నపేట మండలం అలీపురం గ్రామానికి చెందిన చింతల స్వరూప- నర్సయ్య దంపతులకు కూతురు, కుమారుడు అక్షయ్ ఉన్నాడు. నర్సయ్య చిరువ్యాపారాలు చేసుకుంటూ హన్మకొండలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. అక్షయ్ మంచిర్యాలలో మైనింగ్ డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం హనుమకొండ రెవెన్యూ కాలనీలో అద్దె ఇంట్లో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. శుక్రవారం మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల తెలియాల్సి ఉందని సీఐ ఎం.రంజిత్‌కుమార్ పేర్కొన్నారు.



అక్షయ్ (ఫైల్)

పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అలీపురంలో అక్షయ్ అంత్యక్రియలను పూర్తిచేశారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి దారుణ హత్య


- జనగామ జిల్లా బచ్చన్నపేటలో ఘటన
- మృతుడిది యాదాద్రి భువనగిరి జిల్లా శారాజిపేట

బచ్చన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజిపేటకు చెందిన బత్తుల రాజిరెడ్డి (50) బతుకు దెరువు కోసం 25ఏళ్ల క్రితం బచ్చన్నపేటకు వచ్చి పలు హోటళ్లలో పనిచేస్తుండేవాడు. గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగా లేక రోడ్ల వెంట తిరుగుతూ, రాత్రివేళ తనకు తోచిన ప్రదేశంలో నిద్రిస్తుండేవాడు. శుక్రవారం ఉదయం చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో తలపై బలమైన గాయాలై రక్తపు మడుగులో మృతిచెంది పడి ఉన్నాడు. కర్రలు, రాళ్లతో తలపై బాది చంపినట్లు చర్చించుకుంటున్నారు. రాజిరెడ్డి అవివాహితుడు కాగా, అతడికి సోదరుడు జోగిరెడ్డి, చెల్లెలు వరలక్ష్మీ ఆలీంపూర్‌లో ఉంటుంది.



రాజిరెడ్డి(ఫైల్)

మతిస్థిమితంలేని వ్యక్తిని చంపాల్సిన అవసరం ఎమొచ్చిందనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ అబ్బయ్య, ఎస్ఐ ఎస్‌కే హమీద్ సంఘటనా స్థలానికి చేరుకుని, జాగిలాలను రప్పించి పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## పార్క్ స్థలాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ అధికారులు

హసన్‌పర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఆర్‌టీసీ కాలనీలో పార్క్ స్థలంలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్‌తో కలిసి టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శివకుమార్ మాట్లాడుతూ ఆర్‌టీసీ కాలనీలో పార్కు స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి కమిషనర్, మేయర్, గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు కూడా ఇచ్చామన్నారు. కోట్ల విలువైన కార్పొరేషన్, కుడా పార్క్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్, కుడా ఉన్నతాధికారులు స్పందించి భూములను కాపాడాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్క్ స్థలాలకు ట్రెంచింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు.



ఆర్‌టీసీ కాలనీలో పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు



కొత్తూరుజెండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## 5వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వరంగల్ కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని 5వ డివిజన్ కొత్తూరుజెండాలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.74 లక్షల వ్యయంతో దాసరివాడ, కొత్తూరుజెండా ప్రాంతాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ శ్రీమన్నారాయణ, డీఈ రాజ్‌కుమార్, ఏఈ హరికుమార్‌లతో పాటు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి అభిషేకాలకు హాజరు కావాలి

### దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని అశోక కాలనీలో గల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 22న నిర్వహించే ఆంజనేయ స్వామి అభిషేక కార్యక్రమాలకు హాజరు కావాలని దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సర్వోత్తంరెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి అభిషేకాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రతినిధులు మనోహర స్వామి, సంజీవరెడ్డి, కొమురారెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మల్లేశం ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై18(ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవీ రాజు గౌడ్, అంతడుపుల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి ఈసంపెల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, అనిల్‌రెడ్డి, దామెర వెంకటేష్ ఉన్నారు.

## పల్లెపాడు దామోదర్‌కు సత్కారం

బాలసముద్రం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలోఇండియన్ అచీ వర్ అవార్డు అందుకున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను జిల్లాలోని వివిధ ప్ర జా సంఘాల నాయకులు శుక్రవారం రాంనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఘ నంగా సత్కరించారు. ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగిన 12వ సీఎస్ఆర్ సమ్మిట్ కార్యక్రమంలో మిషన్ వికసిత్ భారత్ కార్పొరేట్ సామాజిక బాధ్యత పాత్ర అనే అంశంపై జరిగిన జాతీయ సమావేశంలో దామోదర్ వివిధ దేశాల రాయబారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో సేవలందించిన వ్యక్తులకు ఇండియన్ అచీవర్స్ ఫోరం ప్రతిష్ఠాత్మక అవార్డులు, ప్రశంసాపత్రాలను అందిస్తోంది. దామోదర్‌ను సత్కరించిన వారిలో దళిత హక్కుల పోరాట సమితి, క్రైస్తవ సంక్షేమ సమితి, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూల దండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్‌గా మార్చాలి

### కూరపాటి వెంకట్ నారాయణ

కాజీపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లో అత్యధిక లాభాలు తెచ్చే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. కాజీపేట జంక్షన్ ఉత్తర, దక్షిణ ధృవాలను కలుపుతూ వారధిగా ఉంటుందన్నారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ప్రకటించిన రైల్వే శాఖ కాజీపేటను కూడా డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, టౌన్‌స్టేషన్‌లో ట్రయాంగిల్ ప్లాట్‌ఫారాలు నిర్మించాలని కోరారు.

## దాశరథి శతజయంతి పద్య పఠన పోటీలు

హనుమకొండ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కవి దాశరథి శతజయంతి వేడుకల్లో భాగంగా చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక, ఎస్‌ఎల్టీఏటీఎస్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 13 మండలాల నుంచి 340 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపిక చేసిన 50దాశరథి పద్యాలలో 30పద్యాల వరకు విద్యార్థులు చదవగలిగారు. మండల స్థాయి నుంచి 50 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఏఎంవో సుజన్ తేజ మాట్లాడుతూ.. పోటీలో పాల్గొంటున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర భాష ఉపాధ్యా సంస్థ (ఎస్‌ఎల్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు, రాధాకృష్ణ, సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అట్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండు రవి, విశాల, మడత భాస్కర్, వేములనరేశ్, చింతం కుమారస్వామి, ప్రభ, శ్రీదేవి, అశోక్, వెంకటేశ్వర్లు, నరసింహ, రాజు పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ మహిళ మృతి

కాజీపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ చికిత్సపొందుతూ మృతి చెందింది. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట డీజిల్ కాలనీకి చెందిన సుమలత (37)ను భర్త సునీల్ నిత్యం వేధిస్తుండేవారు. ఫిబ్రవరి 27న ఈసంపల్లి సునీల్‌తో పాటు ఆయన అన్నా వదినలు సురేశ్, స్వరూపతో కలిసి సుమలత ఒంటిపై టర్పెంటైల్ పోసి నిప్పంటించారు. తీవ్రగాలపాలైన సుమలతను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఈనెల 16న ఆసుపత్రిలో మృతిచెందింది. మృతురాలి అన్న ఇమ్మడి విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు సునీల్, స్వరూపలపై కేసుమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్‌తెలిపారు. మృతురాలికి నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు.

## గుండెపోటుతో బస్సులో రైతు మృతి



కొమురయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బస్సులోనే ఓ రైతు గుండెపోటుతో మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంకు చెందిన అన్నెపు మ్యాకల కొమురయ్య (72) భార్య ప్రమీలతో కలిసి ఉదయం మడికొండలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మడికొండలో పాలకుర్తి పల్లె వెలుగు బస్సును ఎక్కారు. కాజీపేట మండలంలోని రాంపూర్‌కు చేరుకోగానే కొమురయ్య కుప్పకూలిపోయాడు. భార్య అరుపులు వేయడంతో బస్సును ఆపి, 108కు సమాచారం ఇచ్చారు. వారువచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

# పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

- అర్హులైన ప్రతీ ఒక్కరికి దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- డబ్బులెవరికైనా ఇస్తే లబ్ధిదారుల ఇళ్లు రద్దు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారం అయిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజక వర్గంలోని వివిధ డివిజన్లకు సంబంధించిన 137 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ. 175 కోట్లతో 3,500 ఇళ్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. ఇందులో ఒక్కొక్క ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నాలుగు విడతలలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శకంగా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటి కోసం డబ్బులెవరికైనా ఇస్తే లబ్ధిదారుల ఇళ్లు రద్దు చేయడంతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేయర్



అంబేద్కర్ భవన్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

గుండు సుధారాణి మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను షిబారాణి, మాజీ జడ్పీటీసీ గంటా నరేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, కందుకూరి పూర్ణచందర్, కాంగ్రెస్ శ్రేణులు నర్మెట వెంకటరమణాగౌడ్, కొంకా హరిబాబు, పింగిళి వెంకట రాంనర్సింహరెడ్డి, గడ్డం శివ రాంప్రసాద్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, చింత రమేష్ గౌడ్, రుద్రోజు మణీంద్రనాథ్, సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బుద్దె పెద్దన్న, జన్ను సుధాకర్, కనపర్తి కిరణ్, రామంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

హసన్‌పర్తి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలు ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి శ్రీనివాసకాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షాకాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని, చిన్నపాటి వర్షానికే ఇండ్లలోకి వరద నీరు చేరుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలో నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, వీస సురేందర్‌రెడ్డి, ఎల్‌ఐసీ వెంకన్న, పాడి గణపతిరెడ్డి, ఇనుగాల రాంరెడ్డి, తోకల లక్ష్మారెడ్డి, మేడిపల్లి మదన్ గౌడ్, భరత్, సురేష్, ఓదేలు భాస్కర్, కాలనీ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

(5వ పేజీ తరువాయి)

పేద ప్రజలకు అందజేయలేదన్నారు. భీమదేవరపల్లి మండలంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గల్ల పెట్టె మొత్తం ఖాళీ చేసి వెళ్లారన్నారు. అయినా ప్రజా పాలన ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీవో మేన శ్రీను, ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ, ఏపీఎం దేవానంద్, ఏపీవో కుమారస్వామి, ఎంపీవో నాగరాజు, ఈవో జంగం పూర్ణచందర్, కొత్తకొండ దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, వరుణ్, శ్రావణ్, కొల్లూరి రాజు, ఆదరి రవీందర్, కేతిరి లక్ష్మారెడ్డి, ఊసకోయిల ప్రకాష్, మాజీ ఎంపీపీ సరోజన తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముల్కనూర్ మోడల్ స్కూల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను చూసి ప్రిన్సిపాల్ రహ్మాన్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో మరో ఎఫ్‌వోబీని నిర్మించాలి

### ఎంపీ కడియం కావ్యకు కార్పొరేటర్ వినతి

హసన్‌పర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నాలుగు ట్రాక్‌లు ఉండగా మూడింటికే ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ)లు ఉన్నాయని అదనంగా మరో ఎఫ్‌వోబీని నిర్మించేందుకు కృషి చేయాలని ఎంపీ కడియం కావ్యకు స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నాల్గవ ట్రాక్ పైనా ఎఫ్‌వోబీ నిర్మించబడితే పెరవెల్లి వెంచర్ ద్వారా బస్సులు, ఆటోలు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీంతో చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలకు మెరుగైన



ఎంపీ కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ శివకుమార్

రవాణా సదుపాయం కలుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, తాళ్ల శ్యాం, మండల అధ్యక్షుడు మారం తిరుపతి, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు కుంబార్‌కార్ సాయి తదితరులున్నారు.

# 23న విద్యా సంస్థల బంద్

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ ఈ నెల 23న నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్ పిలుపు నిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు సయ్యద్ ఫుర్కన్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## పింగిళి కళాశాలలో గోరింటాకు సంబరాలు



గోరింటాకుతో మహిళా అధ్యాపకులు

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమ్‌స్)లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గోరంటాకు సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ మాట్లాడుతూ గోరంటాకు పెట్టుకోవడం మన ఆచారాలను గౌరవించడమే కాకుండా ఆరోగ్యం, సౌందర్యం పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికాత విభాగం కన్వీనర్ డాక్టర్ పి. అరుణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని , అధ్యాపకులు డాక్టర్ ఎం. అరుణ, రత్నమాల, రాజేశ్వరితో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

# కులాలను పక్కనబెట్టి బీసీలంతా ఉద్యమించాలి

### మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు





మాట్లాడుతున్న వన్నాల శ్రీరాములు, సాంబారి సమ్మారావు, డాక్టర్ కూరపాటి రమేష్

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా కులాలను పక్కనబెట్టి బీసీలంతా ఉద్యమించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, ది వివర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు చైర్మన్‌వన్నాల శ్రీరాములు అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు వరంగల్ జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్‌లు మాట్లాడారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా రచించిన ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష సదస్సు ఈనెల 20న ఉదయం 10 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరుగుతుందని తెలిపారు. ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పుస్తక సమీక్ష నిర్వహించే ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు పలువురు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వీఏకే ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు తిరునహరి శేషు, నాగవెల్లి సురేష్, జి. సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

## పెండింగ్ పన్నులు వసూలు చేయాలి

### అధికారులకు మేయర్ గుండు సుధారాణి ఆదేశాలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నల్లా పన్నుల వసూలు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో ఆమె ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి నల్లాలకు చెందిన పన్నులు రూ. 48కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని వంద శాతం వసూలు చేయాలని అన్నారు. బిల్‌కలెక్టర్లు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని రెండు మాసాల్లో పూర్తిచేయాలని అన్నారు. కమర్షియల్ నల్లాలకు సంబంధించి నగర పరిధిలో 50 మంది వరకు పన్ను చెల్లించడం లేదని, అలాంటి వారికి నోటీసులు పంపాలని ఆదేశించారు. మొదటి విడతలో 70 వేల నల్లాలకు సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, డీసీ ప్రసన్నరాణి, ఏఈలు హరికుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### రేపు ఉచిత వైద్య శిబిరం

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌సీటీఏ) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 7 గంటలకు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీటీఏ జిల్లా అధ్యక్షుడు పులి సారంగపాణి, కార్యదర్శి డాక్టర్ బి. మల్లారెడ్డి తెలిపారు.

ఈ ఆరోగ్య శిబిరంలో బోన్ న్యూరో పరీక్ష, షుగర్ పరీక్ష (పరగడపున), బీపీ, బాడీ మాస్ ఇండెక్స్ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# బీజేపీ బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

- బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మార్తినేని ధర్మారావు
- కడిపికొండలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

మడికొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను పర్యవేక్షించడానికి శనివారం అయోధ్యాపురం వస్తున్న కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర బొ గ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి బీజేపీ శ్రేణులు భారీ వాహన శ్రేణితో స్వాగతం పలకాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. కడిపికొండలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకుడు జలగం రంజిత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి మడికొండ మీదుగా మంత్రులను స్వాగతిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోచ్ ఫ్యాక్టరీ వరకు తరలి వెళ్లాలని కోరారు.



బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నాయిని కుమార్, పుల్యాల రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, బాషబోయిన కుమార్, టాటాచారి, మారం రాముయాదవ్, వెంకట్‌రెడ్డి, అయినవోలు మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్, చిరంజీవి, అరవింద్, చట్ల అజయ్, దారంగుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

### ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని విస్మరించిందని, రాష్ట్రంలో గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు దుయ్యబట్టారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదని అది విద్యార్థుల హక్కు అని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో కొత్త నిబంధనల పేరుతో పాలిటెక్నిక్ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ప్రభుత్వం పన్నుతోందని విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీని వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

విద్యార్థుల సమస్యల పక్షాన ఉద్యమిస్తోంది ఏబీవీపీ మాత్రమేనని అన్నారు. ఈ సమావేశంలో హాస్టల్స్ కన్వీనర్ వెలుతుల రాజ్‌కుమార్, వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ హరిచరణ్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్, త్రినేష్, రాజ్‌కుమార్, సిద్ధార్థ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వంటిల్లు

బజారులో ఉసిరికాయలు కనిపిస్తే కొనకుండా ఉండలేం. ఇవి చిన్న, పెద్ద సైజుల్లో లభ్యమవుతూ ఉంటాయి. మరీ చిన్నగా ఉండే రాశి ఉసిరి కాయలనైతే అసలు వదిలిపెట్టం. వెంటనే కొనుక్కుని ఉప్పు చల్లుకుని తినేస్తూ ఉంటాం. ఇలాంటి ఉసిరికాయలతో తయారు చేసే కమ్మని రుచులు మీకోసం...

# ఉసిరికాయతో నోరూరేలా



## ఉసిరికాయ పచ్చడి



**కావాల్సిన పదార్థాలు:** ఉసిరికాయలు- 11, నూనె- ఎనిమిది చెంచాలు, మినపప్పు- ఒకటిన్నర చెంచా, పచ్చి శనగ పప్పు- ఒక చెంచా, పచ్చి మిర్చి- 12, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర- చిన్న కట్ట, ఉప్పు- అర చెంచా, చింతపండు- మూడు రెబ్బలు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, జీలకర్ర- అర చెంచా, ఆవాలు- అర చెంచా, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, పసుపు- పావు చెంచా

**తయారీ విధానం:** ఉసిరి కాయలను నీళ్లతో కడగాలి. తరవాత చాకుతో చిన్న ముక్కలుగా కోయాలి. కొత్తిమీరను తుంచి నీళ్లతో కడిగి ఉంచుకోవాలి. పచ్చిమిర్చిని ముక్కలుగా కోయాలి.

- స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఒక చెంచా మినపప్పు, పచ్చి శనగ పప్పు వేసి దోరగా వేపాలి. తరవాత పచ్చి మిర్చి ముక్కలు, కొద్దిగా కరివేపాకు, కొత్తిమీర వేసి చిన్న మంటమీద వేపాలి. వీటిని ఒక పళ్లెంలోకి తీయాలి. గిన్నెలో మరో మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఉసిరికాయ ముక్కలు, ఉప్పు వేసి కలపాలి. మూతపెట్టి చిన్న మంట మీద మగ్గించాలి. ఉసిరికాయ ముక్కలు మెత్తబడిన తరవాత చింతపండు రెమ్మలు వేసి కలపాలి. రెండు నిమిషాలు తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లారనివ్వాలి.
- మిక్సీలో పప్పులు-పచ్చి మిర్చి-కొత్తిమీర మిశ్రమం, ఉసిరికాయ ముక్కలు-చింతపండు మిశ్రమం, వెల్లుల్లి రెబ్బలు వేసి గ్రైండ్ చేయాలి. ఇందులో నీళ్లు పోయకూడదు. మధ్య మధ్యలో చెంచాతో కలుపుతూ బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. తరవాత ఈ పచ్చడిని గిన్నెలోకి తీయాలి.
- స్టవ్ మీద చిన్న మూకుడు పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా మినపప్పు, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. తరవాత గిన్నెలోని పచ్చడిని కూడా వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఉప్పు సరిచూడాలి. ఇలా తయారు చేసుకున్న ఉసిరికాయ పచ్చడిని వేడి అన్నంలో కలుపుకుని తింటే బాగుంటుంది.

**జాగ్రత్తలు**

- ఉసిరికాయలను పది నిమిషాలు ఆవిరి మీద ఉడికిస్తే ముక్కలు కోయడం సులువుగా ఉంటుంది.
- పచ్చిమిర్చికి బదులు ఎండు మిర్చి కూడా వేసుకోవచ్చు.
- ఇష్టమైతే నువ్వులు లేదా పచ్చి కొబ్బరి ముక్కలు వేసుకోవచ్చు.
- రోట్లో దంచి తయారుచేసుకుంటే ఈ పచ్చడి మరింత రుచిగా ఉంటుంది.

## ఉసిరి జ్యూస్

**కావాల్సిన పదార్థాలు:** ఉసిరికాయలు- నాలుగు, పుదీనా ఆకులు- ఎనిమిది, చిన్న అల్లం ముక్కలు- రెండు, ఉప్పు- చిటికెడు, తేనె- ఒక చెంచా, నిమ్మరసం- అర చెంచా, నీళ్లు- ఒక గ్లాసు


**తయారీ విధానం:** ఉసిరికాయలను నీళ్లతో కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. అల్లం ముక్కలు, పుదీనా ఆకులను కూడా కడగాలి.

- మిక్సీలో ఉసిరికాయ ముక్కలు, పుదీనా ఆకులు, అల్లం ముక్కలు, ఉప్పు, తేనె, నిమ్మరసం వేసి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గాజు గ్లాసులోకి వడబోయాలి. ఇందులో రెండు ఐస్ ముక్కలు వేసి సర్వ్ చేసుకోవడమే!

**జాగ్రత్తలు**

- ఇందులో కొద్దిగా బెల్లం, మిరియాల పొడి కూడా కలుపుకుని తాగవచ్చు.
- ఈ జ్యూస్‌లో చిటికెడు నల్ల ఉప్పు, జీలకర్ర పొడి వేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది. వగరుగా ఉందనిపిస్తే మరో పావు చెంచా నిమ్మ రసం కలుపుకోవచ్చు.

## ఉసిరికాయ పులిహోర



**కావాల్సిన పదార్థాలు:** ఉసిరికాయలు- ఆరు, బియ్యం- ఒక పెద్ద కప్పు, నూనె- మూడు చెంచాలు, వేరుశనగ గుండ్లు- రెండు చెంచాలు, పచ్చి శనగ పప్పు- ఒక చెంచా, మినపప్పు- అర చెంచా, ఆవాలు- అర చెంచా, పచ్చిమిర్చి- నాలుగు, ఎండు మిర్చి- మూడు, ఇంగువ- పావు చెంచా, పసుపు- అర చెంచా, కరివేపాకు- మూడు రెమ్మలు, ఉప్పు- ఒక చెంచా, నిమ్మకాయ- ఒకటి

**తయారీ విధానం:** ముందుగా బియ్యాన్ని కడిగి... పొడిపొడిగా ఉండేలా అన్నం వండాలి. ఈ అన్నాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో పావు చెంచా ఉప్పు, ఒక చెంచా నూనె, కొద్దిగా కరివేపాకు వేసి కలపాలి. ఉసిరికాయలను కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. వీటిని మిక్సీలో వేసి బరకగా గ్రైండ్ చేయాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఆవాలు, వేరుశనగ గుండ్లు, పచ్చి శనగపప్పు, మినపప్పు వేసి దోరగా వేపాలి. తరవాత ఇంగువ, పసుపు, ఎండు మిర్చి, పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు వేసి బాగా కలపాలి. ఇవి రెండు నిమిషాలు వేగాక గ్రైండ్ చేసుకున్న ఉసిరికాయల పేస్టు, ముప్పావు చెంచా ఉప్పు వేసి కలపాలి. మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి ముందుగా సిద్ధం చేసుకున్న అన్నం, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఒక నిమిషం తరవాత స్టవ్ మీద నుంచి దించి సర్వ్ చేసుకోవాలి. ఈ ఉసిరికాయ పులిహోరను వేడిగా తింటే బాగుంటుంది. చల్లారాక కూడా రుచిగానే అనిపిస్తుంది.

**జాగ్రత్తలు**

- ఉసిరికాయ ముక్కలను మరీ మెత్తగా కాకుండా కొబ్బరి తురుంలా గ్రైండ్ చేయాలి.
- కొద్దిగా పచ్చి కొబ్బరి తురుం కలిపితే పులిహోర కమ్మగా ఉంటుంది.

## రాశి ఉసిరికాయల పప్పు

**కావాల్సిన పదార్థాలు:** రాశి ఉసిరి కాయలు- ఒక కప్పు, కందిపప్పు- అర కప్పు, ఉల్లిపాయ- ఒకటి, టమాటాలు- రెండు, పచ్చిమిర్చి- ఎనిమిది, పసుపు- పావు చెంచా, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఎండు మిర్చి- రెండు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, ఇంగువ- పావు చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత

**తయారీ విధానం:** రాశి ఉసిరికాయలను కడిగి ముక్కలుగా కోయాలి. లోపలి గింజలు తీసివేయాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయ, టమాటాలను కూడా చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కందిపప్పును కడిగి నీళ్లు పోసి అర గంటసేపు నానబెట్టాలి.

- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన కందిపప్పు, ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు వేసి తగినన్ని నీళ్లు పోయాలి. కుక్కర్ మీద మూత పెట్టి మూడు విజిల్స్ రానివ్వాలి. తరవాత కుక్కర్‌ను స్టవ్ మీద నుంచి దించాలి. ఆవిరి మొత్తం పోయిన తరవాత మూత తీసి ఉసిరికాయ ముక్కలు వేసి కలపాలి. కుక్కర్‌ను మరల స్టవ్ మీద పెట్టి రెండు విజిల్స్ రానిచ్చి దించాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి ముక్కలు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఇంగువ, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత ముందుగా ఉడికించుకున్న పప్పు-ఉసిరికాయ ముక్కల మిశ్రమం, ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు చిన్న మంట మీద మగ్గనివ్వాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న రాశి ఉసిరికాయల పప్పు... వేడి అన్నం, చపాతీ, పూరీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.



**జాగ్రత్తలు**

- రాశి ఉసిరి కాయల్లో లేత పసుపు రంగులో ఉండేవి పుల్లగా ఉంటాయి. వీటిని మాత్రమే వేసి పప్పు వండాలి. ఆకుపచ్చగా ఉండేవి వగరుగా ఉంటాయి.
- పప్పును మెత్తగా ఉడికించుకోవాలి. అప్పుడే రుచి బాగుంటుంది.
- కందిపప్పుకు బదులు పెసరపప్పుతో కూడా ఈ వంటకం చేసుకోవచ్చు.

భోజన కుతూహలం

# మేలు చేసే మెంతి

మెంతి కూరని దీపనీ అంటారు. జఠరాగ్ని రాజిల్లజేస్తుంది కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. మెంతి కూర చేదుగా ఉంటుంది కానీ ఆరోగ్యానికి చాలా మంచిది. మేథస్సుని పెంపు చేస్తుంది కాబట్టి మెంతికూరను 'మేథీ' అని కూడా అంటారు. దీనిని కొన్ని ప్రాంతాల్లో జ్యోతి అని కూడా పిలుస్తారు. దీనివల్ల మనకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి.. అవేమిటో చూద్దాం..

- మెంతి కూర నాలుక మీద జిగురును తొలగిస్తుంది. నాలుకకు రుచి తెలిసేలా చేస్తుంది.
- వాత వ్యాధులతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం. ఇది వేడిని పెంచుతుంది. అదే సమయంలో ఇది ఎసిడిటి పెంచుతుంది. అందువల్ల దీనిని కొద్దిగా తింటేనే మంచిది.
- అన్నం సహించటం లేదని సరిగ్గా తిండి అరగని వారికి మెంతికూర నోటికి రుచిని కలిగిస్తుంది.
- మధుమేహ వ్యాధి ఉన్నవారికి ఇది దివ్య ఔషధం. ప్రతి రోజూ క్రమం తప్పకుండా మెంతి కూర తింటే మధుమేహం నియంత్రణలో ఉంటుంది.
- మన శరీరంలోని విష దోషాలను ఇది హరిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రుతుస్రావం రాని వారు ప్రతి రోజు మెంతి కూర తింటే మంచిది. గర్భశయ దోషాలు ఉన్నా అవి తొలగిపోతాయి.
- ఉబ్బస రోగులకు కూడా మెంతి కూర ఉపకరిస్తుంది. మెంతి కూర ఆకుల్ని సన్నగా తరిగి కందిపప్పుతో ఉడికించి.. తాలింపు పెడితే రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది.

- మెంతి ఆకులను ఎండబెట్టి మెత్తగా దంచి సీసాలో భద్రపరుచుకుంటారు. ఈ పొడిని కసూరి మెంతి అని పిలుస్తారు. అన్ని రకాల కూరలలోను దీనిని ఉపయోగించుకోవచ్చు.
- మెంతి ఆకుల గుజ్జును తలకు పట్టిస్తే జుట్టు మృదువుగా ఉంటుంది. ఈ గుజ్జును ముఖానికి రాసుకుంటే మొటిమలు తగ్గుతాయి.

- గంగరాజు అరుణాదేవి



## నూనె మరకలా..?

ఒక్కోసారి దుస్తుల మీద నూనె మరకలు ఎంత ప్రయత్నించినా వదలవు. ఈ చిట్కాలతో వాటిని వదిలించుకోవచ్చు.

- నూనె మరక మీద కొద్దిగా బేకింగ్ సోడా చల్లాలి. పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత పాత టూత్ బ్రష్‌తో రుద్దితే నూనె మరక మాయమవుతుంది. గంజి పొడి వేసి రుద్దినా ఫలితం కనిపిస్తుంది.
- చిన్న గిన్నెలో నాలుగు చుక్కల వెనిగర్ వేసి రెండు చుక్కల నీళ్లు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో తీసుకుని మరక మీద రుద్దాలి. అయిదు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడిగేస్తే నూనె మరక తొలగిపోతుంది.



- మరక పడిన దుస్తులను చల్లని నీళ్లలో ముంచి తీయాలి. తరవాత మరక మీద కలబంద గుజ్జు వేసి రుద్దితే ఫలితం ఉంటుంది.
- నూనె మరక మీద రెండు చుక్కల నిమ్మ రసం వేసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత దుస్తులను మామూలుగా ఉతికి ఆరేస్తే సరిపోతుంది.

మేకప్

# ముఖం కోలగా.. కోమలంగా...

గుండ్రటి ముఖాన్ని కోలగా కనిపించేలా చేయడం కోసం కొన్ని మేకప్ మెలకువలు పాటించాలి. వ్యూహాత్మకమైన కాంటూరింగ్, కళ్లను తీర్చిదిద్దుకునే విధానాలకు స్వల్ప మార్పులు చేసుకుంటే గుండ్రని ముఖం కోలగా కనిపిస్తుంది. ఆ మెలకువల గురించి లోతుగా తెలుసుకుందాం!



కాంటూర్ ఇలా: చర్మపు రంగుకు రెండింతలు ముదురు రంగులో ఉండే కాంటూరింగ్ షేడ్ ఎంచుకోవాలి. చెవుల దగ్గరి నుంచి మొదలుపెట్టి, చెక్కిళ్ల మధ్యలోకి బ్లెండ్ చేయాలి. ఈ టెక్నిక్‌తో చెక్కిళ్ల ఎముకలు స్పష్టంగా కనిపించడంతో పాటు ముఖం కోలగా మారిపోతుంది

- అలాగే నుదుటి దగ్గరి వెంట్రుకలతో పాటు, దవడ దగ్గర కూడా కాంటూర్ చేసుకుంటే ముఖ పరిమితులు స్పష్టంగా కనిపిస్తాయి.

**హైలైటింగ్:** ముఖంలో ఎత్తుగా కనిపించే ప్రదేశాల్లో హైలైటర్ అప్లై చేయాలి. చెక్కిళ్ల ఎముకలు, ముక్కు దూలం, కనుబొమల ఎముకలు, చుబుకం దగ్గర హైలైటర్ అద్దుకోవాలి. ఆయా ప్రదేశాల్లో వెలుగు ప్రతిఫలించి, ఉబ్బెత్తుగా కనిపిస్తాయి

- లైట్ హ్యాండ్ హైలైటర్‌ను ఎంచుకుంటే ఆయా ప్రదేశాలు అసహజమైన మెరుపును సంతరించుకోవు.

కనుబొమలు: కనుబొమలు పైకి లేచినట్టుగా తీర్చిదిద్దుకుంటే ముఖం కోలగా కనిపిస్తుంది

- అందుకోసం బ్రో పెన్సిల్ లేదా పౌడర్‌తో కనుబొమలను తీర్చిదిద్దుకోవాలి. అలాగే కనుబొమల ఎముకలను హైలైట్ చేసుకోవాలి

**కళ్లు:** ఐలైనర్‌తో కళ్ల చివర్లను వంపు తిప్పుకోవాలి. దీంతో ముఖం కోలగా మారిపోతుంది

- కళ్లు పెద్దవిగా కనిపించడం కోసం పైకనురెప్పలకు తప్పనిసరిగా మస్కారా అద్దుకోవాలి
- ముదురు రంగు ఐ షాడోను కనురెప్పల పైన అద్దుకుని, చివర్లలో తేలిక రంగు షాడోను అద్దుకోవాలి.

## చెత్త బుట్టను ఇలా ఉంచుకోవాలి...

చెత్త బుట్టలో ఆహార వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం వేస్తూ ఉంటాం. వీటివల్ల చెత్త తొలగించినా ఒక్కోసారి బుట్టలో ఈ దుర్వాసన వదలదు. చిన్న చిట్కాలతో దుర్వాసన రాకుండా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- చెత్తను తొలగించిన ప్రతిసారీ... బుట్టను నీళ్లతో శుభ్రంగా కడగాలి. వారానికి ఒకసారి ఖాళీ చెత్త బుట్టలో ఒక చెంచా బ్లీచింగ్ పౌడర్ లేదా కొద్దిగా వెనిగర్ వేసి పొడవాటి బ్రష్‌తో రుద్దాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగి ఎండలో ఆరబెట్టాలి.
- శుభ్రం చేసిన చెత్త బుట్టలో అడుగున కొద్దిగా బేకింగ్ సోడా చల్లాలి. దానిమీద మందపాటి పొడవైన కాగితాన్ని పరచాలి. ఈ కాగితం... బుట్ట పై భాగం వరకూ వచ్చేలా అమర్చాలి. దీనివల్ల వ్యర్థ పదార్థాల తేమను కాగితం పీల్చుకుంటుంది. బుట్ట పొడిగా శుభ్రంగా ఉంటుంది.



- బుట్టను వంటగదిలో పెట్ట కూడదు. బాల్కనీలో ఓ మూలగా పెట్టాలి. దీనివల్ల వ్యర్థ పదార్థాలు గాలికి ఆరుతూ కుళ్లిపోకుండా ఉంటాయి. బుట్ట నుంచి దుర్వాసన కూడా రాదు.
- వాడేసిన నిమ్మ, నారింజ తొక్కలను ఎండబెట్టి వాటిని చెత్త బుట్టలో అడుగున వేసినా మంచి ఫలితం ఉంటుంది.
- తడి, పొడి చెత్తలకు వేర్వేరు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

సెలబ్ ఫిట్

# ఆరోగ్యమే అందం..!

**వెండితెరపైనే కాదు... నిజ జీవితంలోనూ ఉత్సాహంగా... ఉత్తేజంగా కనిపిస్తుంది దీపికా పదుకోన్.**

**ప్రకాష్ పదుకోన్ వారసురాలిగా బ్యాడ్మింటన్ రాకెట్ పట్టినా... ఆ తరువాత సినిమాల మీద మక్కువతో మైదానం వదిలేసింది.**

**నాడు బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినా... నేడు ప్రభాస్ 'స్పిరిట్' నుంచి తప్పుకున్నా.. ఆమె ప్రతి అడుగూ ఒక సంచలనం. ఎనిమిది గంటల పని సమయాన్ని మరోసారి తెరపైకి తెచ్చి... చిత్రసీమలో ఆదాయంతో పాటు ఆరోగ్యకర జీవనానికి ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఇచ్చింది.**

'క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పింది వింటాను. ఆ తరువాతే నిర్ణయాలు తీసుకొంటాను. ఆ నిర్ణయాలకు కట్టుబడే క్రమంలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాను. జీవితంలో సమతులంగా ఉండాలంటే నిజాయితీ ముఖ్యం. అలా ఉండడానికే నేను ప్రాధాన్యత ఇస్తాను' అంటూ ఆ మధ్య ఓ ఫ్యాషన్ షో సందర్భంగా దీపికా పదుకోన్ చెప్పుకొచ్చింది. అంతేకాదు... రోజుకు ఎనిమిదికి మించిన పని గంటలు తగదంటూ మరో సందర్భంలో వ్యాఖ్యానించింది. కొంత కాలంగా అటు బాలీవుడ్‌లో... ఇటు సామాజిక మాధ్యమాల్లో దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. పని గంటలు ఎక్కువగా ఉన్న కారణంగానే దీపిక ఓ బడా ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నదనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

గత ఏడాది సెప్టెంబర్‌లో పాపకు జన్మనిచ్చిన దీపిక... తిరిగి షూటింగ్‌లో పాల్గొంటున్న సందర్భంగా... 'ప్రస్తుతం నేను మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై బిడ్డకు తల్లిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే షూటింగ్‌లో పాల్గొనాలి. ఇది ఎప్పుడూ సవాలే' అంటూ తన అనుభవాలు పంచుకుంది. ఈ కారణంగానే ఆమె పని గంటల విషయంలో రాజీపడడం లేదనేది బాలీవుడ్‌లో వినిపిస్తున్న మాట. కుటుంబంతో సమయాన్ని గడపకపోతే జీవితంలో ఎంత సాధించినా అది విజయం కాదని, నిజాయతీ గల దర్శకనిర్మాతలు పని గంటల విషయంలో వ్యతిరేకంగా ఉండరని హిందీ హీరోలు సైఫ్ అలీఖాన్, అజయ్ దేవ్‌గణ్ పరోక్షంగా దీపికకు మద్దతు తెలిపారు. వీటికి తోడు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనేది దీపికతోపాటు మరికొందరి వాదన. ఏదిఏమైనా... పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లయినా... బిడ్డకు తల్లి అయినా... నేటికీ దీపికలో అవే మెరుపులు. బిజీ షెడ్యూల్స్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా... గంటల తరబడి కెమెరా ముందు గడిపినా... ముఖంలో చిరునవ్వు చెదరదు. ఉత్సాహం ఇసుమంతైనా తగ్గదు. అందుకు ప్రధాన కారణం... క్రమం తప్పని వ్యాయామం, దృఢమైన ఆరోగ్యమే అంటుంది ఈ బ్యూటీ.

### ఆకలి వేసినప్పుడే...

ఇడ్లీ- సాంబార్, ఉప్మా, దాల్ రైస్ తదితర దక్షిణాది వంటకాలు దీపిక మెనూలో కచ్చితంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు ఇంటి నుంచే తెప్పించుకుంటుంది. అలాగే చైనీస్ ఫాస్ట్ ఫుడ్స్ కూడా. డార్క్ చాక్లెట్, సేవ్ పూరీ బాగా ఇష్టం. రెండు గంటలకు ఒకసారి... అలా రోజుకు ఆరుసార్లు ఆహారం తీసుకుంటుంది. దీపిక... నచ్చింది తినేస్తుంది. కాకపోతే మితంగా. అందులో పోషక విలువలు పుష్కలంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొంటుంది. 'కంటికి నచ్చిందని కాకుండా... ఆకలి వేసినప్పుడు కడుపుకు సరిపడానే తినాలి. అతిగా తినకూడదు' అంటుంది దీపిక.

- ఉదయం నిద్ర లేవగానే నిమ్మ రసం, తేనె కలిపిన గోరువెచ్చటి నీరు. లేదంటే రాత్రంతా నానబెట్టిన మెంతులతో ఒక కప్పు నీళ్లు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఎక్కువగా రెండు ఎగ్ వైట్, బ్రెడ్ టోస్ట్ లేదంటే ఇడ్లీ, రవ్వ దోశ. ఒక వేళ బెంగళూరు ఇంటికి వెళితే... కప్పు ఫిల్టర్ కాఫీ, ఇడ్లీ సాంబార్.
- మధ్యాహ్న భోజనానికి రెండు గంటల ముందు... ఒక బౌల్ కూరగాయలు, పండ్ల ముక్కలు. దీనివల్ల లంచ్‌లో అతిగా తినే అవసరం ఉండదనేది ఈ భామ ఆలోచన.
- మధ్యాహ్న భోజనంలో ఒక్కో రోజూ ఒకో వెరైటీ ఉంటుంది. అందులో పోషక విలువలు తప్పనిసరి. కొన్నిసార్లు సబ్జీ, దాల్, రోటీతో సరిపెడితే... మరికొన్నిసార్లు రెండు చపాతీలు, గ్రిల్డ్ ఫిష్, కాయగూరల ముక్కలతో లంచ్ ఆస్వాదిస్తుంది. లేదంటే చారు అన్నం ఆమె మెనూలో చేరుతుంది.
- సాయంత్రం స్నాక్స్‌లో బాదం, పిస్తా లాంటి డ్రైఫ్రూట్స్, కప్పు ఫిల్టర్ కాఫీ.
- రాత్రిపూట మితాహారం. రెండు చపాతీలు, వెజిటబుల్స్, గ్రీన్ సలాడ్, కొబ్బరి నీళ్లు. ఎప్పుడైనా తీపి తినాలనిపిస్తే ఒక చిన్న డార్క్ చాక్లెట్.

### వ్యాయామం ఇలా...

- రన్నింగ్, స్కిప్పింగ్, బ్రిస్క్ వాకింగ్‌లతో వార్మప్. 'వర్కవుట్‌కు ముందు వార్మప్ తప్పనిసరి. అప్పుడే తీవ్రంగా సాగే వర్కవుట్ సెషన్‌కు శరీరం సిద్ధమవుతుంది' అనేది దీపిక మాట.
- తరువాత బ్యాండ్ స్ట్రెచ్, నీ టూ చెస్ట్ స్ట్రెచ్, చైల్డ్స్ పోజ్, సైడ్ లంగెస్. వీటివల్ల శరీరం చువ్వలా ఎటు కావాలంటే అటు వంగుతుంది.
- అప్పుడప్పుడు కిక్ బాక్సింగ్, బ్యాడ్మింటన్, డ్యాన్స్ స్విమ్మింగ్ కూడా వచ్చి చేరుతుంటాయి.
- పిలెట్స్ వర్కవుట్ రోజూ ఉండాల్సిందే. దీనివల్ల కండరాలు దృఢంగా మారతాయి. బాడీ బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుంది. ఆరోగ్యమే అందం. అందుకు క్రమబద్ధమైన జీవనశైలి ఒక్కటే మార్గం అనేది సెలబ్రిటీ ట్రైనర్ల మాట.



# రిజర్వాయర్లు కళకళ.. చెరువులు వెలవెల!

- ఎగువన వర్షాలతో రాష్ట్రంలోని రిజర్వాయర్లలోకి భారీగా వరద
- కానీ, రాష్ట్రంలో వానల్లేక నిండని చెరువులు
- పుంజుకోని వానాకాలం పంటల సాగు
- ఇప్పటివరకు 24% లోటు వర్షపాతం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లలో ప్రస్తుతం 592టీఎంసీలకు పైగా నీళ్లున్నాయి. గతేడాది ఈ సమయానికి అన్ని జలాశయాల్లో కలిపి ఉన్న నీళ్లు 229 టీఎంసీలు మాత్రమే. అయితే, నిరుడు ఈ సమయానికి చెరువులన్నీ నీళ్లతో కళకళలాడాయి. ఈసారి ఎగువ నుంచి వచ్చే వరదతో రిజర్వాయర్లు నిండినప్పటికీ, రాష్ట్రంలో సరైన వర్షాలు లేక చెరువులు నిండలేదు. వర్షాల్లేక, చెరువుల్లో నీళ్లు లేక భూగర్భ జలాలు తగ్గి ఈ వర్షాకాలం పంటల సాగు ఇంకా పుంజుకోలేదు. నిర్ణీత సమయాని కంటే ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించి మురిపించిన నైరుతి రుతుపవనాలు తర్వాత పత్తా లేకుండా పోయాయి. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా రెండు రోజుల కిందటి వరకు ఎండాకాలం లాంటి వాతావరణం నెలకొంది. సాధారణంతో పోలిస్తే ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో 24% లోటు వర్షపాతం నమోదైంది. అయితే, గురు శుక్రవారాల్లో వర్షాలు పడినప్పటికీ అవి హైదరాబాద్‌కే పరిమితమయ్యాయి. జిల్లాల్లో చిరుజల్లులు మినహా పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు.

### 7.79లక్షల ఎకరాల్లోనే వరినాట్లు

మే చివరి వారంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించటంతో రైతులు మురిసి పోయారు. చాలా ప్రాంతాల్లో తొలకరి వర్షాలకే పత్తి విత్తనాలు వేశారు. వరి నారు పోశారు. అయితే, తర్వాత వర్షాలు మొహం చాటేయడంతో రైతులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో సాధారణంగా వరి సాగు విస్తీర్ణం 62 లక్షల నుంచి 65 లక్షల ఎకరాల కాగా, ఇప్పటివరకు కేవలం 7.79లక్షల ఎకరాల్లోనే వరినాట్లు వేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 50 లక్షల ఎకరాలు కాగా.. 38.57 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు.

## కృష్ణాకు పెరుగుతున్న వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పెరుగుతోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 1.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, జూరాలకు లక్ష క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. శ్రీశైలంలో రెండు వైపులా జలవిద్యుత్ ఉత్పాదన చేస్తూ 69 వేల క్యూసెక్కులను సాగర్‌కు వదులుతుండగా.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద పంపింగ్ చేస్తూ నీటిని తరలిస్తున్నారు. శ్రీశైలం నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 193 టీఎంసీల నిల్వ ఉంది. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 1800 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 238.24 టీఎంసీల నిల్వ ఉంది.



రాయదుర్గ్ మెట్రోస్టేషన్ వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్



సికింద్రాబాద్ వద్ద ప్రజలను బోట్లపై తరలిస్తున్న దృశ్యం

# కుండపోత

(మొదటిపేజీ తరువాయి)

అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులను వరదలు ముంచేయడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై ఎక్కడికక్కడ తీవ్ర ట్రాఫిక్ జాం అయింది. సాయంత్రం విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు 2-3 గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉప్పల్, మల్కాజిగిరి, బండ్లగూడ, ముషీరాబాద్, కుత్బుల్లాపూర్, బండ్లగూడ, అంబర్‌పేట, హిమాయత్‌నగర్, సైదాబాద్, రాజేంద్రనగర్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులు ఏకంగా చెరువులను తలపించాయి. ముసారాంబాగ్ బ్రిడ్జిపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంపేట మయూరి మార్గ్‌లోని, కుత్బుల్లాపూర్ వాజ్‌పేయినగర్‌లో పలు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. గచ్చిబౌలి పోలీస్ కమిషనరేట్ ఎదురుగా ప్రిస్టన్ మాల్ ఎదురుగా రోడ్డుపై నడుము లోతు వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఐటీ కారిడార్‌లో విధులు ముగించుకొని వెళ్లాల్సిన ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. 30-45 నిమిషాల పట్టే మార్గంలో గంటన్నర నుంచి రెండు గంటల సమయం పట్టింది. ఐటీ కారిడార్ నుంచి కోర్ సిటీ వెళ్లే మార్గాలైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, బేగంపేట, సికింద్రాబాద్, చాదర్‌ఘాట్- మలక్‌పేట, ఆరాంఘర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. నాలాలు నిండుకుండల్లా ప్రవహిస్తుండటంతో వాటి సమీప ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ ప్యాట్నీ



ముసారంబాగ్ బ్రిడ్జి వద్ద వాహనదారుల ఇబ్బందులు

నాలా పరిధిలోని ప్రాంతాలు నీట మునిగాయి. షోరూంలు, ఇళ్లలోకి నాలుగు అడుగుల మేర నీళ్లు చేరాయి. వరద నీటిలో చిక్కుకున్న వారిని హైడ్రా విపత్తు స్పందన బృందాలు (డీఆర్ఎఫ్) బోట్లలో బయటకు తీసుకువచ్చాయి. ముంపు ముప్పుపై ఫిర్యాదుల నేపథ్యంలో ప్యాట్నీ నాలాపై ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించింది. ఓ ఇంటి యజమాని అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని హైడ్రా వర్గాలు చెబుతున్నాయి. ఇదే ముంపునకు కారణమని పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్యాట్నీ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. బోటులో తిరిగి సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా, భారీ వర్షంతో రోడ్లపై ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాం కావడంతో జనం మెట్రో రైళ్లలో ఎక్కేందుకు ఎగబడ్డారు. దీంతో రైళ్లన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనూ పలు ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారు జాము నుంచే కుండపోతగా వర్షాలు కురిశాయి. 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి వెల్జాలలో అత్యధికంగా 150మి.మీ వర్షపాతం నమోదైంది.

### 270 ఫీడర్లలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం

భారీ వర్షం కారణంగా గ్రేటర్‌లోని 270 ఫీడర్ల పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే 200 ఫీడర్ల పరిధిలో 30 నిమిషాల్లో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్లు టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దక్షిణ డిస్కం టోల్‌ఫ్రీ నెంబర్ 1912తో పాటు సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షం కారణంగా వాతావరణం అనుకూలించకపోవడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన పలు విమాన సర్వీసులను దారి మళ్లించారు. రాంచి నుంచి రావాల్సిన ఐఎక్స్ 2674 విమానం, గోవా నుంచి రావాల్సిన ఇండిగో 6ఈ117 విమానాలను సైతం వైజాగ్‌కు మళ్లించారు. ఢిల్లీ నుంచి రావాల్సిన ఎయిరిండియా 2519 విమానాన్ని బెంగుళూరుకు మళ్లించారు.

### గోడకూలి మహిళ మృతి..

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో భారీ వర్షానికి గోడ కూలి ఓ మహిళ మృతి చెందారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం కొత్తూరు తండాకు చెందిన రమావత్ లక్ష్మి కుటుంబం.. నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వెనుక ఉన్న ఎల్ఆర్ ఎన్‌క్లేవ్ వెంచర్ ప్రహరీని ఆనుకొని గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లక్ష్మి గుడిసెలో నిద్రిస్తుండగా గోడకూలి ఆమెపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు.

### అప్రమత్తంగా ఉండండి: సీఎం

హైదరాబాద్‌లో భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్తు, పోలీసు శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇక ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### 4 రోజులపాటు భారీ వర్షాలు

రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 22 వరకు పలు జిల్లాలకు భారీ వర్షసూచన ఉన్నట్లు పేర్కొంది. వచ్చే మంగళవారం వరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వెల్లడించింది. ఇక ఆదివారం రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రానున్న 48 గంటల్లో హైదరాబాద్ ప్రాంతంలో సాయంత్రం, రాత్రి వేళల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడే అవకాశంఉందని తెలిపింది. ఇక గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలోని 442 మండలాల్లో వర్షం పడినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇందులో 15 మండలాల్లో అతిభారీ వర్షం కురిసినట్లు తెలిపింది.



నాగర్‌కర్నూలు జిల్లా సిర్సవాడలో కురిసిన వర్షానికి పత్తి చేనులో చేరిన నీరు



### భువనగిరి ఆస్పత్రిలో వార్డులోకి నీరు..

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో శుక్రవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. స్థానిక సింహద్వారం నుంచి యోగానంద నిలయం, బస్టాండ్‌లో వరద ప్రవహించి జలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని జనరల్ వార్డు గోడకు లీకేజీ ఉండటంతో.. నీరు లోపలికి చేరి ఇన్‌పేషెంట్లు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంతోపాటుగా పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి, శుక్రవారం ఉదయం వర్షం కురిసింది. జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చిరు జల్లులు కురిశాయి.

## చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

### 'నువ్వుంటే చాలే..' అంటున్న రామ్



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్ బాబు.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం రామ్ రాసిన పాటను చిత్రబృందం శుక్రవారం ఆవిష్కరించింది. 'నువ్వుంటే చాలే..' అంటూ సాగే ఈ గీతానికి సంగీత ద్వయం వివేక్- మెర్విన్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఈ పాటలోని ప్రతి లైన్ మనసుని తాకుతుంది. ప్రేమకు నిజమైన నిర్వచనాన్ని కనుగొనడానికి హీరో చేసే ప్రయత్నంలా అనిపిస్తుంది. 'ప్రేమని నిర్వచించలేం, కేవలం అనుభవించగలం. ఈ పాట ఒక చిన్న కథలా అనిపిస్తుంది. భావోద్వేగాలతో ప్రయాణించే అనుభూతిని కలిగిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. కాగా, ఈ సినిమాలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహల్ రామకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

### ఓ కళాకారిణి కథ..



ఆనంది ప్రధాన పాత్రలో గౌరీ నాయుడు జమ్ము తెరకెక్కిస్తోన్న సినిమా 'గరివిడి లక్ష్మి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఆనందిని 'గరివిడి లక్ష్మి' పాత్రలో పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. లంగా, ఓణీ ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది.. ఒడిలో హార్మోనియంతో ఆకట్టుకున్నారు. గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. ఉత్తరాంధ్ర జానపద సంప్రదాయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వ్యక్తిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఈ సినిమాలో చరణ్ అర్జున్ సంగీతం ఉత్తరాంధ్ర సంస్కృతిని ఆవిష్కరిస్తూ హృదయాన్ని తాకేలా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.




### సత్యలోకం చూపించబోతున్నాం

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' కథ గురించి దర్శకుడు వశిష్ఠ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలుంటాయి. యమలోకం, పాతాళం, స్వర్గం.. ఇలా ఇప్పటివరకూ పలు చిత్రాల్లో ఈ లోకాలను ఎవరికి వారు తమకు తోచినట్లు చూపించారు. 'విశ్వంభర'లో మేం వీటిని దాటి ఇంకా పైకి వెళ్లాం. ఈ 14 లోకాలకు మూలమైన సత్యలోకాన్ని ఇందులో చూపించబోతున్నాం. కథానాయకుడు ఆ లోకానికి ఎలా వెళ్తాడు, కథానాయికను భూమిపైకి ఎలా తీసుకొస్తాడు అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథ ఇది' అని చెప్పారు. ఈ సినిమా కోసం భారీ ఖర్చుతో అద్భుతమైన సెట్స్ వేసి అందులో చిత్రీకరణ జరుపుతున్నారు. చిరంజీవికి జోడీగా త్రిష, ఆషికా రంగనాథ్ నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

### టాంజానియాలో చిత్రీకరణకు సిద్ధం

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం ('ఎస్ఎస్ఎంబీ 29'- వర్కింగ్ టైటిల్) కొత్త షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. వచ్చే వారంలో టాంజానియాలోని సెరెంగెటి నేషనల్ పార్క్‌లో చిత్రీకరణ కోసం యూనిట్ సన్నద్ధమవుతోంది. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌పై ఈ షెడ్యూల్ లో కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికాలో కొంత భాగం చిత్రీకరణ జరపనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలోని యాక్షన్ ఘట్టాలను తొలుత కెన్యాలో చిత్రీకరించాలనుకున్నా అక్కడున్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో చిత్రబృందం టాంజానియా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు.



### సీతగా సాయిపల్లవి.. అందుకే!

'రామాయణ'.. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రకంపనలు సృష్టిస్తున్న చిత్రం. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఆ సినిమా గురించే అంతా చర్చించుకుంటున్నారు. 'నాలుగు వేల కోట్ల రూపాయల బడ్జెట్ అట.. 'అవతార్' సినిమా బడ్జెట్ కంటే ఇది ఎక్కువట.. వర్కవుట్ అవుతుందా?'

అనేది వారి చర్చ. సినిమా బాగా ఆడాలని, భారతీయ సినిమా గొప్పతనాన్ని 'రామాయణ' మరోసారి చాటి చెప్పాలని చాలామంది కోరుకుంటున్నారు. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్ సినిమా మీద అంచనాలను భారీగా పెంచాయి. అయితే ఎందరో హీరో హీరోయిన్లు ఉండగా రాముడిగా రణ్‌బీర్ కపూర్‌ను, సీతగా సాయిపల్లవిని తీసుకోవడం ఏమిటనే విమర్శలు వినిపించకపోలేదు. దీనిపై సినిమా క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చబ్రా స్పష్టత ఇచ్చారు. 'రాముడిగా రణ్‌బీర్‌ను తీసుకోవడానికి కారణం.. ప్రశాంతమైన ఆయన వ్యక్తిత్వం, గొప్పగా నటించగల నైపుణ్యం. అలాగే సీత పాత్రకు సాయిపల్లవిని ఎన్నుకోవడానికి కూడా ప్రత్యేక కారణం ఉంది. మొదటి నుంచీ ఆమె గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటున్నారు. అందం కోసం సర్జరీలు చేయించుకోలేదు. కృత్రిమం కంటే సహజ అందమే మేలు అనే భావన ఆమెది. తెరపై సీతారాముల్ని చూడగానే ఓ పవిత్రమైన భావన కలగాలని ఆ పాత్రలకు వీరిద్దరినీ ఎంపిక చేశాం' అని వివరించారు. 'రామాయణ'లో రావణుడిగా కన్నడ హీరో యశ్ నటిస్తున్నారు. ఆయన ఈ చిత్ర నిర్మాణ భాగస్వామి కూడా. ఆయన సరసన మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్నారు.

#### హాన్స్ జిమ్మర్‌తో రెహమాన్

'రామాయణ' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించడం కోసం జర్మనీ మ్యూజిక్ డైరెక్టర్ హాన్స్ జిమ్మర్‌తో చేతులు కలిపారు ఏఆర్ రెహమాన్. ఇప్పటివరకూ జిమ్మర్‌తో కలసి లండన్, లాస్‌ఏంజెల్స్, దుబాయ్‌లో సంగీత చర్చలు జరిపాననీ, భారతీయ కళావైభవాన్ని చాటే గొప్ప చిత్రం 'రామాయణ'కు పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు రెహమాన్ వెల్లడించారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా, యశ్ కలసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



### భిక్షాటన చేసిన నటి నళిని



సీనియర్ నటి నళిని శుక్రవారం భిక్షాటన చేశారు. చెన్నై తిరువేర్కాడులోని కరుమారి అమ్మవారు కలలో కనిపించి కోరడంతో ఈ భిక్షాటన చేసినట్లు ఆమె వెల్లడించారు. తమిళ చిత్రాలు, టీవీ సీరియల్స్‌లో నటిస్తూ బిజీగా ఉన్న నళిని తిరువేర్కాడు కరుమారి అమ్మన్ ఆలయంలో కొంగుపట్టుకుని భక్తుల దగ్గర భిక్షాటన చేశారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'నన్ను ఆశీర్వదిస్తూ ఎల్లవేళలా రక్షిస్తున్న నా ఇష్టదైవమైన తిరువేర్కాడు కరుమారి అమ్మ కలలో కనిపించి నాకోసం ఏం చేయబోతున్నావని అడిగింది. దీంతో ఏం చేయాలో తోచక.. కొంగుపట్టి భక్తుల వద్ద భిక్షాటన చేశాను. తద్వారా వచ్చిన కానుకలను అమ్మవారికి కానుకగా సమర్పించాను' అని వివరించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



## హాస్య నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత


తెలుగు చిత్ర పరిశ్రమ మరో నటుణ్ణి కోల్పోయింది. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న హాస్యనటుడు ఫిష్ వెంకట్ (53) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో చందానగర్ పీఆర్ కె హాస్పిటల్‌లో కన్నుమూశారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆయన నాలుగేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. పూర్తిగా పాడైపోవడంతో ఆయనకు కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. అనారోగ్యంతో వెంకట్ సినిమాలకు దూరమవడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చికిత్స కోసం రూ. 50 లక్షలు ఖర్చు అవుతుందనీ, తమకు భరించే స్తోమత లేదనీ, సినిమా ఇండస్ట్రీలోని పెద్దలు, ప్రభుత్వం ఆదుకోవాలని వెంకట్ కూతురు స్రవంతి ఇటీవల కోరారు. పవన్‌కల్యాణ్, విష్వక్‌సేన్, 'జెట్టి' హీరో కృష్ణ మానినేని కొంత మేర ఆర్థిక సాయం అందించారు. అలాగే వెంకట్ చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల కోసం రూ. లక్షను కుటుంబసభ్యులకు అందజేశారు. చికిత్స కోసం ఏర్పాట్లు జరుగుతుండగానే ఆయన తుది శ్వాస విడిచారు. వెంకట్‌కు భార్య సువర్ణ, కూతురు స్రవంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఫిష్ వెంకట్ అసలు పేరు మంగిలంపల్లి వెంకటేశ్. హైదరాబాద్‌లో పుట్టి పెరిగారు. ముషీరాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో ఆయన చేపలు అమ్ముకునేవారు. దాంతో ఆయన పేరు ఫిష్ వెంకట్‌గా స్థిరపడింది. తన మిత్రుడు, నటుడు శ్రీహరి ప్రోత్సాహంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'ఆది'లో 'తొడ కొట్టు చిన్నా' అనే డైలాగ్‌తో ఆయన అందరి దృష్టినీ ఆకర్షించారు. అగ్రహీరోలందరి చిత్రాల్లో విలన్‌గా, కమెడియన్‌గా నటించారు. కామెడీ విలన్ పాత్రల్లో తెలంగాణ మాండలికంలో చెప్పే సంభాషణలతో ఆయన ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పటివరకూ వందకుపైగా సినిమాల్లో నటించారు. దిల్, బన్నీ, అదుర్స్, గబ్బర్‌సింగ్ తదితర చిత్రాల్లో ఆయన నటనకు మంచి పేరొచ్చింది.

# బిజినెస్



## ఎస్‌బీఐకి వరల్డ్ బెస్ట్ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డు



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2025 సంవత్సరానికి గాను గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డును గెలుచుకుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్, బ్యాంకర్స్, విశ్లేషకుల నుంచి సేకరించిన వివరాలను మదింపు చేయటంతో పాటు సమగ్ర పరిశోధన, విశ్లేషణ ఆధారంగా ఎస్‌బీఐని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు గ్లోబల్ ఫైనాన్స్ వెల్లడించింది. కాగా బ్యాంక్ అభివృద్ధి వ్యూహానికి ఖాతాదారుల అనుభూతి మూలస్తంభమని ఎస్‌బీఐ చైర్మన్ సీ. శ్రీనివాసులు శెట్టి ఈ సందర్భంగా అన్నారు. ఖాతాదారులకు మరింత చేరువయ్యేందుకు ఎప్పటికప్పుడు కొత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ అవార్డు ఖాతాదారుల సేవలకు తమను మరింత కట్టుబడి ఉండేలా చేస్తుందన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల సందర్భంగా ఈ ఏడాది అక్టోబరు 18న అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగే కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి ఈ అవార్డును అందుకోనున్నారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 19వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 510 | విజయవాడ | 520 |
| వరంగల్ | 512 | గోదావరి | 500 |
| చిత్తూరు | 563 | విశాఖపట్నం | 540 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99 | విజయవాడ | 102 |
| వరంగల్ | 99 | గుంటూరు | 107 |
| కరీంనగర్ | 99 | ఒంగోలు | 110 |
| మహబూబ్‌నగర్ | 99 | చిత్తూరు | 103 |
| కర్నూలు | 99 | నెల్లూరు | 108 |
| విశాఖపట్నం | 87 | అనంతపురం | 108 |
| గోదావరి | 102 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99,380 ▲ | 91,100 ▲ | 1,23,900 ▼ |
| విజయవాడ | 1,00,500 ▲ | 94,500 ▲ | 1,11,600 ▼ |
| విశాఖపట్నం | 1,01,390 ▲ | 91,000 ▼ | 1,23,900 ▼ |
| రాజమండ్రి | 99,820 ▲ | 91,500 ▲ | 1,15,000 ▲ |
| ప్రొద్దుటూరు | 97,900 ▲ | 90,007 ▲ | 1,14,700 ▲ |
| ముంబై | 98,243 ▲ | 89,991 ▲ | 1,12,700 ▲ |

# రిలయన్స్ రికార్డు లాభం

## క్యూ1లో 78 శాతం వృద్ధితో రూ.26,994 కోట్లకు చేరిక




- ఆదాయం రూ.2.48 లక్షల కోట్లు
- రిటైల్, జియో వ్యాపారాలు జిగేల్
- లాభాల్లో భారీ వృద్ధికి కలిసివచ్చిన ఏషియన్ పెయింట్స్ వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 78.3 శాతం వృద్ధితో రూ.26,994 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.19.95) పెరిగింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక త్రైమాసిక లాభం. రిటైల్, జియో వ్యాపారాలు మెరుగైన పనితీరు కనబరచడంతో పాటు ఏషియన్ పెయింట్స్‌లో వాటా విక్రయం ద్వారా సమకూరిన ఏకకాల ఆర్జన (వన్ టైమ్ గెయిన్) లాభాల్లో భారీ వృద్ధికి దోహదపడింది. వన్ టైమ్ గెయిన్స్‌ను మినహాయిస్తే, సంస్థ లాభం వార్షిక ప్రాతిపదికన 25 శాతం వృద్ధిని కనబరిచింది. కాగా, క్యూ1లో కంపెనీకి కార్యకలాపాల ద్వారా ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.3 శాతం పెరిగి రూ.2,48,660 కోట్లకు చేరుకుంది. స్థూల రాబడి 6 శాతం వృద్ధితో రూ.2,73,252 కోట్లుగా, ఎబిటా 35.7 శాతం వృద్ధితో రూ.58,024 కోట్లుగా నమోదైంది. వ్యాపార విభాగాల వారీగా పనితీరు..

### ఓ2సీ

రిలయన్స్ కీలక వ్యాపార విభాగమైన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) ఆదాయం ఈ క్యూ1లో 1.5 శాతం తగ్గి రూ.1,54,804 కోట్లకు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగిరావడంతో పాటు ముందస్తు ప్రణాళిక ప్రకారంగా ప్లాంట్‌ను కొన్ని రోజులు మూసివేసిన కారణంగా రిఫైనింగ్ తగ్గడం ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది. అయితే, కంపెనీకి చెందిన జియో-బీపీ బంకులకు ఇంధన సరఫరా పెంచడం ఆదాయానికి మద్దతుగా నిలిచాయి. ఎబిటా మాత్రం 10.8 శాతం వృద్ధితో రూ.14,511 కోట్లుగా నమోదైంది.

### రిలయన్స్ రిటైల్

ఆర్ఐఎల్ రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం జూన్ త్రైమాసికంలో 28.3 శాతం పెరిగి రూ.3,271 కోట్లకు చేరింది. స్థూల ఆదాయం 11.3 శాతం వృద్ధితో రూ.84,171 కోట్లకు పెరిగింది. అన్ని రిటైల్ వ్యాపార విభాగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడిందని కంపెనీ పేర్కొంది. గడిచిన మూడు నెలల్లో 388 కొత్త స్టోర్లను ప్రారంభించటంతో మొత్తం స్టోర్ల సంఖ్య 19,592కు చేరుకుందని తెలిపింది.

### జియో ప్లాట్‌ఫామ్స్

టెలికాం సంస్థ రిలయన్స్ జియోతో పాటు డిజిటల్ సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్ నికర లాభం ఈ క్యూ1లో 25 శాతం పెరిగి రూ.7,110 కోట్లకు ఎగబాకింది. స్థూల ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.41,054 కోట్లకు పెరిగింది. ఈ జూన్ చివరి నాటికి రిలయన్స్ జియో మొత్తం వినియోగదారులు 49.81 కోట్లకు పెరిగారు. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) రూ.208.8కి చేరింది. కంపెనీ 5జీ కస్టమర్లు తొలిసారిగా 20 కోట్ల స్థాయికి చేరారని, హోమ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు 2 కోట్లు దాటినట్లు తెలిపింది. జియో ఎయిర్ ఫైబర్ 74 లక్షల మంది ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) సర్వీస్‌గా అవరించిందని కంపెనీ వెల్లడించింది.

### ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి వ్యాపార విభాగ ఆదాయం జూన్ త్రైమాసిక కాలంలో 1.2 శాతం తగ్గి రూ.6,103 కోట్లకు, ఎబిటా 4.1 శాతం తగ్గుదలతో రూ.4,996 కోట్లకు పరిమితమైంది. కేజీ బేసిన్‌లోని డీ6 బ్లాక్ నుంచి ఉత్పత్తితో పాటు విక్రయాలు తగ్గడం ఇందుకు కారణమైందని కంపెనీ తెలిపింది. సీబీఎం గ్యాస్ ధరతో పాటు ముడిచమురుపై మార్జిన్లు తగ్గడమూ ఆదాయంపై ప్రభావం చూపిందని సంస్థ పేర్కొంది.

### జియోస్టార్

ఈ జూన్ క్వార్టర్‌లో రిలయన్స్‌కు చెందిన జియో హాట్‌స్టార్ వ్యాపార విభాగ ఆదాయం రూ.11,222 కోట్లకు పెరిగింది. లాభం రూ.581 కోట్లకు ఎగబాకింది. ఆండ్రాయిడ్ ఓఎస్‌పై జియోహాట్‌స్టార్ యాప్ డౌన్‌లోడ్లు 104 కోట్లకు చేరాయని కంపెనీ తెలిపింది.

## మళ్లీ 25,000 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ 501 పాయింట్లు పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 501.51 పాయింట్లు క్షీణించి 81,757.73 వద్దకు జారుకుంది. నిఫ్టీ 143.05 పాయింట్లు కోల్పోయి నెల రోజుల కనిష్ఠ స్థాయి 24,968.40 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.458.37 లక్షల కోట్లకు జారుకుంది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి.

## రష్యాపై ఈయూ మరిన్ని ఆంక్షలు

బ్రస్సెల్స్ (బెల్జియం): బ్రిటన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాయి. ఇందులో భాగంగా రష్యా ఎగుమతి చేసే బ్యారల్ చమురు గరిష్ఠ ధరను ప్రస్తుత 60 డాలర్ల నుంచి 45 డాలర్లకు కుదించాయి. ఏ దేశమైనా రష్యా చమురుకు ఇంత కంటే ఎక్కువ చెల్లిస్తే ఆ దేశాలపైనా ఆంక్షలు తప్పవని హెచ్చరించాయి. దీనికి తోడు రష్యా చమురుతో ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ దిగుమతులనూ నిషేధించాయి. దీంతో భారత్‌లో రష్యా చమురు దిగ్గజం రోస్‌నెఫ్ట్ నిర్వహణలోని నయారా ఎనర్జీపైనా ఈ ప్రభావం పడనుంది. మరోవైపు రష్యా బ్యాంకులతో లావాదేవీలపైనా బ్రిటన్, ఈయూ మరిన్ని ఆంక్షలు విధించాయి. అయితే ఈ బెదిరింపులు తమను ఏమీ చేయలేవని రష్యా స్పష్టం చేసింది.

## రిలయన్స్ గూటికి కెల్వినేటర్

ఒప్పందం విలువ రూ.160 కోట్లు

ముంబై: స్వీడన్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రోలక్స్ గ్రూప్‌నకు చెందిన కన్స్యూమర్ డ్యూరబుల్ ఉత్పత్తుల బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ రిటైల్ శుక్రవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ 18 కోట్ల స్వీడిష్ క్రౌన్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.160 కోట్లు. ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ విభాగమే రిలయన్స్ రిటైల్. దేశంలో అతిపెద్ద రిటైల్ వ్యాపార సంస్థ కూడా. దేశంలో వేగంగా విస్తరిస్తున్న కన్స్యూమర్ డ్యూరబుల్స్ (ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లు, టీవీలు తదితర ఉత్పత్తులు) మార్కెట్లో రిలయన్స్ తన వ్యాపార వృద్ధిని కదం తొక్కించేందుకు ఈ కొనుగోలు ఒప్పందం దోహదపడనుంది.

- టాటా మోటార్స్.. కాంపాక్ట్ ఎస్‌యూవీ పంచ్ అమ్మకాల్లో రికార్డు సృష్టించింది. మార్కెట్లోకి వచ్చిన నాలుగేళ్ల వ్యవధిలోనే 6 లక్షల ఉత్పత్తి మార్కును చేరుకుంది. అంతేకాకుండా దేశీయ మార్కెట్లో ఫేవరేట్ ఎస్‌యూవీగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.
- భారత్‌లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమయ్యే రెసిపరేటరీ సింటికల్ వైరస్ (ఆర్ఎస్‌వీ)పై అవగాహన కల్పించేందుకు డాక్టర్ రెడ్డీస్, సనోఫీ జట్టు కట్టాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ప్రధానంగా ఈ వైరస్ ఐదేళ్లలోపు చిన్నారుల్లో శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లకు కారణమవుతోంది.

## తెలుగు రాష్ట్రాలపై బెంట్లే సిస్టమ్స్ దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థ బెంట్లే సిస్టమ్స్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లపై దృష్టి సారించింది. గడిచిన కొన్నేళ్లుగా ఈ రెండు రాష్ట్రాల్లో రవాణా, అర్బన్ ప్లానింగ్, పారిశ్రామిక, ఇంధన రంగాలు శరవేగంగా వృద్ధి చెందుతూ వస్తున్నాయని, ఈ రంగాలకు అవసరమైన సొల్యూషన్లను అందించటంలో బెంట్లే ఇప్పటికే కీలకంగా ఉందని సంస్థ రీజినల్ ఎగ్జిక్యూటివ్ (దక్షిణాసియా) కమలకన్నన్ తిరువాది తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం రైల్వే, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, విమానాశ్రయ ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించటంతో తాము కూడా ఈ విభాగాల్లో మరిన్ని అవకాశాలు చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. మరోవైపు తెలంగాణలో కొత్తగా ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటుతో పాటు మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణ, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుండటం కూడా బెంట్లే సిస్టమ్స్‌కు కలిసి రానుందన్నారు.

## అమెరికాతో చర్చల్లో జాగ్రత్త

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రాజన్

న్యూఢిల్లీ: తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుగుతున్న చర్చల్లో భారత్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కోరారు. ఈ చర్చల్లో ముఖ్యంగా వ్యవసాయోత్పత్తుల విషయంలో మన ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరించాలన్నారు. లేకపోతే దేశ ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికాతో సహా అన్ని అభివృద్ధి చెందిన దేశాలు తమ రైతులకు పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ దేశాల నుంచి స్వేచ్ఛగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తే మన రైతులు రోడ్డున పడే ప్రమాదం ఉందని పరోక్షంగా హెచ్చరించారు. తన వ్యవసాయ, పాల ఉత్పత్తులను కూడా భారత్ జీరో డ్యూటీతో అనుమతించాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాజన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. నేరుగా ఆ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను స్వేచ్ఛగా అనుమతించే బదులు.. ఆ దేశాల కంపెనీలు, మన వ్యవసాయ రంగానికి తోడ్పడేలా విలువ జోడింపు ఉత్పతుల తయారీ కంపెనీలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని రాజన్ సూచించారు.

# స్పోర్ట్స్



# హనుమాన్ చాలీసా నుంచి పాప్ గీతాల వరకు..

మాంచెస్టర్: నాలుగో టెస్టు కోసం భారత జట్టు కెంట్ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తోంది. లండన్ నుంచి బెకెన్‌హామ్‌లోని ఈ మైదానం కోసం ఆటగాళ్లంతా గంటపాటు ప్రయాణించారు. ఈక్రమంలో అలిసిపోయినట్టు కనిపించిన వీరంతా డ్రెస్సింగ్ రూమ్‌లో తమకిష్టమైన సంగీతాన్ని వింటూ సేద తీరారు. ఇందులో హనుమాన్ చాలీసా నుంచి ఇంగ్లిష్ పాప్ గీతాలు, పంజాబీ హిట్స్ కూడా ఉన్నాయి. ఇక పంత్, బుమ్రా వామప్ చేసి కొంచెంసేపు జిమ్‌లో గడిపారు. బుమ్రాతో పాటు సిరాజ్ మాత్రం బౌలింగ్ వేయలేదు.

### 'కుల్దీప్‌ను ఆడించాలి'

ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్‌తో పాటు పేసర్ అర్ష్‌దీప్‌లను ఆడించాలని మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ సూచించాడు. 'అర్ష్‌దీప్ బంతిని చక్కగా స్వింగ్ చేయగలడు. అలాగే పాత బంతితో రివర్స్ స్వింగ్‌ను కూడా రాబట్టగలడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఇలా చేయగలగడం భారత్‌కు లాభిస్తుంది. అలాగే స్పిన్నర్ కుల్దీప్ సైతం జట్టుకు కీలకంగా మారతాడు. ఇక వీరిని భర్తీ చేసేందుకు నితీశ్ కుమార్, సుందర్‌లను పక్కకు తప్పించవచ్చు. టెస్టుల్లో గెలవాలంటే కచ్చితంగా ఐదుగురు బౌలర్లు ఉండాల్సిందే. ఎందుకంటే ఆరుగురు బ్యాటర్లు భారీ స్కోరు సాధించలేకపోతే, కనీసం బౌలర్లయినా బాధ్యత తీసుకుంటారు. పార్ట్ టైమ్ బౌలర్లతో మ్యాచ్‌లు గెలవలేం' అని వెంగీ తెలిపాడు.

### డ్యూక్ బంతుల నాణ్యతపై చర్చ



భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో డ్యూక్ బంతుల నాణ్యతపై అధికంగా చర్చ సాగుతోంది. ఇప్పటిదాకా జరిగిన మూడు టెస్టుల్లోనూ బంతి ఆకారంపై భారత ఆటగాళ్లు అంపైర్లకు పదేపదే ఫిర్యాదు చేయడం తెలిసిందే. ముఖ్యంగా 30 ఓవర్ల తర్వాత ఈ సమస్య ఎక్కువగా వస్తోంది. దీంతో పదే పదే బంతులను మార్చుతుండడంతో ఆటకు కూడా అంతరాయం కలుగుతోంది. అటు విశ్లేషకులు సైతం డ్యూక్ బంతుల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేశారు. తొలి టెస్టు ముగిశాక భారత కెప్టెన్ గిల్ బాహాటంగానే ఈ విషయమై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. డ్యూక్ బాల్స్ త్వరగా గట్టితనాన్ని కోల్పోతున్నట్టు, దీంతో బ్యాటర్లకు అనుకూలంగా మారుతున్నాయని ఆరోపించాడు. బంతి మెత్తబడితే పేసర్లకు ఉపయోగం ఉండదని, ఎందుకు ఇలా అవుతున్నాయో అర్థం కావడం లేదని చెప్పాడు. అటు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సైతం డ్యూక్ బంతులపై ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. తాము విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి సమస్య వచ్చేదని, కానీ ఇప్పుడు డ్యూక్ బంతులు కూడా మృదువుగా మారి ఆకారం కోల్పోవడం బాగాలేదన్నాడు. దీనిపై ఏదో ఒక పరిష్కారం కనుక్కోవాలని సూచించాడు. ఇలా అన్ని వైపుల నుంచి విమర్శలు వ్యక్తమవుతుండడంతో డ్యూక్ బంతుల తయారీదారులు స్పందించారు. ఆ బంతులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ యజమాని దిలీప్ జజోడియా తెలిపాడు. 'మేం ఇప్పటిదాకా జరిగిన మూడు మ్యాచ్‌ల్లో వాడిన బంతులను పరిశీలిస్తాం. తయారీ నిపుణులతో సమీక్షించడమే కాకుండా, బంతుల తయారీకి వాడే ముడి సరుకులపై కూడా రివ్యూ నిర్వహిస్తాం' అని చెప్పాడు.

## సెమీఫైనల్లో అర్జున్



- ప్రజ్ఞానంద అవుట్
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్

లాస్‌వెగాస్ (యూఎస్ఏ): భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్ సెమీఫైనల్‌కు దూసుకుపోయాడు. అయితే మరో జీఎం ప్రజ్ఞానంద క్వార్టర్‌ఫైనల్లో ఓటమి చవిచూశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో అర్జున్ 1.5-0.5తో ఉజ్బెకిస్థాన్ జీఎం అబ్దుసత్తరోవ్‌పై విజయం సాధించాడు. హోరాహోరీగా జరిగిన మరో క్వార్టర్‌ఫైనల్లో అమెరికాకు చెందిన కరువాన 4-3తో ప్రజ్ఞానందను ఓడించాడు. దీంతో ప్రజ్ఞానంద టైటిల్ రేసు నుంచి నిష్క్రమించాడు. అమెరికా ఆటగాళ్లు ఆరోనియన్, హాన్స్ నీమన్ కూడా సెమీస్ చేరారు. సెమీఫైనల్స్‌లో ఆరోనియన్‌తో అర్జున్, కరువానతో నీమన్ అమీతుమీ తేల్చుకుంటారు. ఐదో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ 2-0తో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీపై నెగ్గాడు.

## సిరీస్ లక్ష్యంగా..

ఇంగ్లండ్‌తో హర్మన్ సేన రెండో వన్డే నేడు




మ. 3.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

లండన్: తొలి వన్డే విజయంతో జోష్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో శనివారం ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో తలపడనుంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన 3-2తో గెలిచిన విషయం తెలిసిందే. అలాగే శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మేలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌ను సైతం గెలిచిన భారత్ ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వన్డే వరల్డ్‌కప్‌నకు కూడా ఈ సిరీస్ విజయం చక్కటి సన్నాహకం కానుంది. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ జట్టులో లేకపోయినా బౌలింగ్ విభాగం రాణించగలుగుతోంది. క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డిలతో పాటు స్పిన్నర్లు శ్రీచరణి, స్నేహ్ రాణా విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇక తొలి వన్డేలో భారత బ్యాటింగ్ విభాగం కలిసికట్టుగా రాణించింది. కెప్టెన్ హర్మన్ నిరాశపర్చినా ఓపెనర్లు ప్రతికా రావల్, మంధానతో పాటు మిడిలార్డర్‌లో జెమీమా, దీప్తి శర్మ కీలకంగా నిలిచారు. చివర్లో అమన్‌జోత్ హిట్టింగ్‌తో చెలరేగడం జట్టుకు లాభించేదే. అటు ఆతిథ్య ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ చావోరేవో కాబట్టి లార్డ్స్‌లో గెలిచి తీరాలనే కసితో బరిలోకి దిగనుంది. జట్టు మిడిలార్డర్ పర్వాలేదనిపించినా టాపార్డర్ వైఫల్యం దెబ్బతీసింది. నేటి పోరులో అన్ని విభాగాల్లో రాణించి ప్రత్యర్థిని కట్టడి చేయడంతో పాటు సిరీస్‌లోనూ నిలవాలని సివర్ బ్రంట్ బృందం భావిస్తోంది.

## ఫీజులో కోత.. ఓ డీమెరిట్ పాయింట్



ప్రతికా రావల్‌కు జరిమానా

దుబాయ్: ఇంగ్లండ్ మహిళలతో తొలి వన్డేలో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను టీమిండియా బ్యాటర్ ప్రతికా రావల్‌కు జరిమానా విధించారు. భారత ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ప్రతిక.. సింగిల్ తీసే క్రమంలో ప్రత్యర్థి బౌలర్ లారెన్ ఫిలర్‌ను ఢీకొట్టింది. అంతేగాకుండా తర్వాతి ఓవర్‌లో తాను అవుటవగానే ప్రతిక.. మరో బౌలర్ సోఫీ ఎకెల్‌స్టోన్‌తో వాగ్వాదానికి దిగింది. దీంతో లెవెల్ 1 తప్పిదం కింద ప్రతికకు మ్యాచ్ ఫీజులో పది శాతం కోత విధించడంతో పాటు ఓ డీ మెరిట్ పాయింట్‌ను కేటాయించారు. అదే మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్ జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో ఐదు శాతం కోత విధించారు.

## బీసీసీఐ ఆర్జన రూ.9,741 కోట్లు




న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా విలసిల్లుతున్న బీసీసీఐ తమ ఆదాయాన్ని ఏటేటా రికార్డు స్థాయిలో పెంచుకుంటోంది. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను బోర్డు ఆదాయం రూ.9,741.70 కోట్లుగా తేలింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారానే ఏకంగా రూ.5,761 కోట్లు (59 శాతం) సమకూరడం విశేషం. 2007లో ఐపీఎల్ మొదలైనప్పటినుంచి బోర్డు ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. మరోవైపు బోర్డు దగ్గర దాదాపు రూ. 30 వేల కోట్లు రిజర్వ్‌లో ఉండగా, దానిపై వచ్చే వడ్డీయే ఏడాదికి వెయ్యి కోట్లు.

## కివీస్ రెండో విజయం




కాన్వే

హరారే: ముక్కోణపు టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో ఆతిథ్య జింబాబ్వేను ఓడించింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 120/7 స్కోరుకే పరిమితమైంది. మధెవెరె (36), బెన్నెట్ (21) మాత్రమే రాణించారు. మ్యాట్ హెన్రీ (3/26) మూడు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప ఛేదనను కివీస్ 13.5 ఓవర్లలో 122/2 స్కోరుతో పూర్తి చేసింది. కాన్వే (59 నాటౌట్) హాఫ్ సెంచరీ చేయగా, రచిన్ (30) సత్తా చాటాడు. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో న్యూజిలాంట్ టాప్‌లో నిలిచింది. దక్షిణాఫ్రికా (2 పాయింట్లు) ఆ తర్వాతి స్థానంలో నిలవగా, జింబాబ్వే పాయింట్ల ఖాతా తెరవలేదు.

## క్వార్టర్స్‌లో హంపి, హారిక

### వైశాలి, దివ్య కూడా..

### మహిళల చెస్ ప్రపంచ కప్

బటూమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేశ్‌బాబు, దివ్యా దేశ్‌ముఖ్ ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్‌లో పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ఈ నలుగురు క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. కాగా, ఒకే దేశానికి చెందిన నలుగురు క్రీడాకారిణులు క్వార్టర్స్ చేరడం టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్ టైబ్రేకర్లలో అలెగ్జాండ్రా కొస్టెన్యూక్ (స్విట్జర్లాండ్)ని హంపి, రష్యా గ్రాండ్‌మాస్టర్ క్యాటరీనా లగ్నోని హారిక ఓడించారు. ఇక.. కమలిదెనోవా (కజకిస్థాన్)పై వైశాలి, చైనాకు చెందిన రెండో సీడ్ జు ఝినెర్‌పై దివ్య విజయం సాధించారు.

## సెమీస్‌లో అనిరుధ్ జోడీ

లాస్ కాబోస్ (మెక్సికో): తెలుగు కుర్రాడు అనిరుధ్ చంద్రశేఖర్ మిఫెల్ టెన్నిస్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. అమెరికా ఆటగాడు రీస్ స్టాడ్లర్ జతగా పురుషుల డబుల్స్‌లో సెమీస్ చేరాడు. క్వార్టర్స్‌లో అనిరుధ్/రీస్ జోడీ 7-5, 6-1తో బెర్నార్డ్ (ఆస్ట్రేలియా)/శాంచెజ్ (మెక్సికో) జంటను చిత్తు చేసింది. ఫైనల్‌బెర్త్ కోసం ఆస్ట్రేలియా ద్వయం బ్లేక్/ట్రిస్టన్‌తో అనిరుధ్ జంట తలపడనుంది. ఇక, స్విట్జర్లాండ్‌లోని గెస్టాడ్‌లో జరుగుతున్న ఈఎఫ్‌జీ స్విస్ ఓపెన్‌లో భారత జోడీ అర్జున్/ విజయ్ సుందర్ పోరాటం ముగిసింది. సెమీస్‌లో అర్జున్ ద్వయం 5-7, 5-7తో అల్బానో (ఫ్రాన్స్)/ హెంద్రిక్ (జర్మనీ) జంట చేతిలో ఓటమి పాలైంది.

## యువ భారత్ శుభారంభం

### ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. గ్రూప్-డిలో భాగంగా శుక్రవారం జరిగిన తమ తొలి పోరులో యువ భారత్.. శ్రీలంకపై గెలిచింది. సింగిల్స్‌లో తన్వీ శర్మ, డబుల్స్‌లో గాయత్రి/మన్నా రావత్, మిక్స్‌డ్‌లో విష్ణు కోడె/రేషిక ప్రత్యర్థులపై గెలిచి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

### రేవంత్‌ను గద్దె దించి

## బీసీ వ్యక్తిని సీఎం చేయాలి

- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉంది: రాంచందర్‌రావు
- కుల గణన ప్రకారం రేవంత్ క్యాబినెట్‌లో 8 మంది బీసీలు ఉండాలి: రఘునందన్‌రావు

మెదక్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి బీసీలపై అంత ప్రేమ ఉంటే సీఎం రేవంత్‌ను గద్దె దించి బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మెదక్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో ప్రసంగించారు. కేంద్ర క్యాబినెట్‌లో 23 మంది బీసీ మంత్రులు ఉన్నారని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికొదిలేసి ఢిల్లీకి చెక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు ఆయన సూచించారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ నుంచి వివిధ పార్టీల నేతలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. కుల గణన ప్రకారం రేవంత్ క్యాబినెట్‌లో ఎనిమిది మంది బీసీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. మతపరమైన రిజర్వేషన్లు ఉండకూడదన్న రాజ్యాంగాన్ని తాము గౌరవిస్తామని ఆయన చెప్పారు.

### జగదీశ్‌రెడ్డికి సీఎం పుట్టిన రోజు శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం కార్యాలయం 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది.

### నీళ్ల మాటున రాజకీయం తగదు

- బీఆర్ఎస్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు
- తెలంగాణ ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నీళ్ల మాటున రాజకీయం తగదని, అలా చేస్తే తల్లిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసినట్టేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జల వివాదాల పరిష్కారానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని అందరూ స్వాగతించాల్సిన అంశమని తెలిపారు. పంచాయితీలు అవసరంలేదని, ఇద్దరు సీఎంలు కూర్చుని మాట్లాడుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. జల వివాదాల పరిష్కారానికి కమిటీ వేయడం మంచి విషయమని, అయితే కమిటీ నాన్చుడు ధోరణి అవలంబించకుండా త్వరగా పని పూర్తి చేయాలన్నారు. రెండు రాష్ట్రాల సీఎంలు కూర్చుని మాట్లాడుకుంటే.. నీటిని సమృద్ధిగా వినియోగించుకోవచ్చని, రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేయొచ్చని పేర్కొన్నారు. తెలంగాణ సెంటిమెంట్ పోవడానికి కారణమే కేసీఆర్ అన్నారు. కేసీఆర్ క్యాబినెట్‌లో తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లు 12 మంది ఉన్నట్టు గుర్తు చేశారు. బీఆర్ఎస్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రస్తుతం బనకచర్ల ప్రాధాన్యంకాదని, ముందు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి అని, ఆయనను అనవసరంగా నిందించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే రేవంత్ పనిచేస్తున్నారని ఆయన తెలిపారు.

### సిద్దిపేట టూటౌన్ సీఐపై విచారణ చేయండి

- ఎస్పీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల వివాదంలో నోటీసులు ఇవ్వకుండా పిటిషనర్‌ను వేధిస్తున్న సిద్దిపేట టూటౌన్ సీఐకి మద్దతు పలికిన ప్రభుత్వ సహాయ న్యాయవాదిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సీసీ టీవీ ఫుటేజీలు సమర్పించాలని ఆదేశిస్తున్నా వినకుండా, సీఐకి అనుకూలంగా వాదనలు వినిపించడంపై అసహనం వ్యక్తం చేసింది. సీఐ వ్యవహారంపై విచారణ చేపట్టాలని, అభియోగాలు నిజమని తేలితే సీఐ సర్వీస్ రికార్డుల్లో ఎంట్రీ చేయాలని సిద్దిపేట ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. తనకు, తన భార్యకు మధ్య వివాదం విషయంలో సిద్దిపేట టూటౌన్ సీఐ శ్రీనివాస్ రెండు రోజులకోసారి ఫోన్ చేసి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వేధిస్తున్నాడని గండ్రాతి సుమన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దాదాపు 20 సార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పటికీ పోలీసులు వేధిస్తున్నారని.. రూ.కోటి శాశ్వత భరణం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీనిపై జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

### కోర్టు ధిక్కరణ కేసులో

## హైడ్రా కమిషనర్‌కు నోటీసులు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలోని 200 గజాల తన ఇంటిని కూల్చేయకుండా అడ్డుకోవాలని వడ్డె తార అనే మహిళ హైకోర్టు పిటిషన్ వేయగా.. సమీపంలో ఉన్న సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. కాగా, ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండానే ఇంటిని కూల్చేశారని పిటిషనర్ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని హైడ్రా కమిషనర్, రంగారెడ్డి కలెక్టర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

### ఆధార్ లేకున్నా తత్కాల్ టికెట్.!

- రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలో అమలుకాని కొత్త విధానం
- సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా వాయిదా వేసిన సీఆర్ఐఎస్ అధికారులు!

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆధార్ వివరాలు లేకుండానే రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా రైల్వే సిబ్బంది తత్కాల్ టికెట్లను అందిస్తున్నారు. వాస్తవానికి ఈ నెల 1 నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో తత్కాల్ టికెట్లు తీసుకునేందుకు ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి చేసిన రైల్వే అధికారులు, ఈ నెల 15 తర్వాత రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలోనూ ఆధార్ ఆధారిత ఓటీపీ విధానాన్ని అమలుచేస్తామని ప్రకటించారు. అయితే.. మూడు రోజులుగా రిజర్వేషన్ సిబ్బంది ఆధార్ లేకుండానే టికెట్లు జారీ చేస్తున్నారు. ఆధార్ అథంటికేషన్ ప్రక్రియలో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా కొత్త విధానాన్ని తాత్కాలింగా వాయిదా వేసినట్లు సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) అధికారులు తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అమలవుతున్న ఆధార్ విధానంలోనే అనేక సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, రిజర్వేషన్ కౌంటర్లలోనూ తత్కాల్ టికెట్లకు ఆధార్ తప్పనిసరి చేస్తే టికెట్ల జారీలో మరిన్ని ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని రిజర్వేషన్ సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం ఒక నిమిషంలో నాలుగు టికెట్లు ఇస్తున్నామని, కొత్త విధానంలో ఆధార్ అథంటికేటెడ్ ఓటీపీని నమోదు చేయాల్సి వస్తే ప్రతీ టికెట్టు జారీకి కనీసం 52 సెకన్ల చొప్పున సమయం పడుతుందని అంటున్నారు. టికెట్ జారీలో జాప్యాన్ని నివారించడం సాధ్యం కాకపోవడంతో ఆ పద్ధతిని సీఆర్ఐఎస్ తాత్కాలింగా వాయిదా వేసిందని చెబుతున్నారు.

# ప్రభుత్వం.. ఎవరి ఫోన్లూ ట్యాప్ చేయట్లే

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. నీటి వాటాలపై పదేళ్ల పాటు ఏమీ తేల్చకుండా, పొరుగు రాష్ట్రం ఎత్తిపోతల పథకాలు కడుతున్నా పట్టించుకోకుండా నిద్రపోయిన వారు.. ఇప్పుడు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నదీ జలాలపై రాష్ట్రం తరపున గట్టిగా వాదనలు వినిపించామని, కానీ.. తామేదో ఏపీకి ధారాదత్తం చేసినట్టుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బేసిన్లు లేవు, భేషజాలు లేవు.. అంటూ నాడు కేసీఆరే మాట్లాడారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం నీటి వాటాల సమస్య వచ్చేదే కాదన్నారు. రాష్ట్రంలో ఏ మంత్రి ఫోనూ ట్యాప్ కావడం లేదని, అలాంటి చట్టవ్యతిరేక చర్యలపై తమకు(తమ ప్రభుత్వానికి) విశ్వాసం లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సొంత కూతురు, అల్లుడు, మంత్రులు, భార్యాభర్తల సంభాషణలను వినడం.. తమ ప్రభుత్వ నైజం కాదని వ్యాఖ్యానించారు. ఫోన్లు ట్యాప్ చేసి వినేంత రహస్యాలు తమ ప్రభుత్వంలో ఏమీ లేవని అన్నారు. పాలన అంతా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సాగుతోందని, కుట్రలు, కుతంత్రాల డీఎన్ఏ తమకు లేదని తేల్చిచెప్పారు. అబద్ధపు ప్రచారంతో కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.



మంత్రుల ఫోన్లను సీఎం రేవంత్ ట్యాప్ చేయిస్తున్నారంటూ కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేశారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏవైతే చేశారో, ఇతర ప్రభుత్వాలు, వ్యక్తులు అవే చేస్తున్నారనుకోవడం అవివేకమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవే బుద్ధులు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ అవే బుద్ధులా.. అంటూ ఘాటుగా విమర్శించారు. భద్రాచలంలో ఆయన మాట్లాడుతూ సీఎం పదవి కోసం తామెవరం ఆశపడడం లేదని, మరో మూడున్నరేళ్ల రేవంతే సీఎంగా ఉంటారని స్పష్టం చేశారు. ఫోన్లు ట్యాప్ చేయడం నీచమని, అలాంటి పనిని తమ ప్రభుత్వం చేపట్టబోదన్నారు. బీఆర్ఎస్‌లో సంక్షోభాలను ముందుగా పరిష్కరించుకోవాలని, కవిత చెప్పిన కోవర్టులెవరో తేల్చుకోవాలని హితవు పలికారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ ఆత్మ విమర్శ చేసుకోలేదని, ఇంకా మాట తీరు మార్చుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఖమ్మంలో ఆయన మాట్లాడుతూ పత్రికల్లో రాయలేని పదాలతో సీఎంను విమర్శించడం కేటీఆర్ అహంకారానికి, దౌర్భాగ్యపు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కేటీఆర్ చేష్టలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ ఏర్పడుతోందని దుయ్యబట్టారు. 'మీ కుటుంబంలో మీకే సఖ్యత లేదు.. ఇంటినే సరిచేసుకోలేరు.. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏదో చేస్తామంటే ప్రజలు నమ్మరు.. భవిష్యత్తులో మీరు అధికారంలోకి రాలేరు" అని అన్నారు.

### ఈసారి నీట్ ర్యాంకు పెరిగినా

# సీటు గ్యారెంటీ.. !

- ప్రారంభమైన ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- ఏ ర్యాంకుకు కన్వీనర్ కోటాలో సీటు వస్తుందని విద్యార్థులలో ఉత్కంఠ
- గతేడాది 3.31 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు
- జనరల్‌లో 2.12 లక్షల ర్యాంకుకు సీటు



**2024-25లో ఎంబీబీఎస్ సీట్లు దక్కిన చివరి ర్యాంకులు.. కేటగిరీల వారీగా ఇలా...**

| కేటగిరి | మేల్ | ఫీమేల్ |
|---|---|---|
| జనరల్ కేటగిరి | 2,12,617 | 1,98,126 |
| ఈడబ్ల్యుఎస్ | 1,80,510 | 1,73,724 |
| బీసీ-ఏ | 3,36,989 | 3,31,596 |
| బీసీ-బీ | 2,29,597 | 2,36,008 |
| బీసీ-సీ | 3,15,341 | 3,09,851 |
| బీసీ-డీ | 2,14,648 | 2,11,904 |
| బీసీ-ఈ | 2,23,906 | 2,29,718 |
| మైనార్టీ | 2,29,439 | 2,23,599 |
| ఎస్సీ | 3,11,648 | 3,11,126 |
| ఎస్టీ | 2,93,753 | 2,93,873 |

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యవిద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈనెల 16 నుంచి ప్రారంభమైంది. ఈనెల 25తో ముగియనుంది. ఈ ఏడాది నీట్ పరీక్షా పత్రం చాలా కఠినంగా రావడంతో అభ్యర్థులకు మార్కులు తగ్గాయి. తెలంగాణ నుంచి ఈ ఏడాది 72,094 మంది దరఖాస్తు చేసుకోగా, 41,584 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోల్చితే ఈ సారి రాష్ట్రం నుంచి నీట్ రాసే వారి సంఖ్య 8 వేలు తగ్గింది. అయినా కూడా సీటు కోసం పోటీ పడే వారి సంఖ్య భారీగానే ఉంది. సగటున ఒక్కో సీటుకు ఐదుగురు పోటీ పడుతున్నారు. కాళోజీ యూనివర్సిటీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేటులో కలపి మొత్తం 5,500 వరకు కన్వీనర్ కోటా సీట్లున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద సీటు వస్తే రూ.10 వేలు, ప్రైవేటులో అయితే రూ.60 వేలు వార్షిక ఫీజు చెల్లించాల్సి వుంటుంది. అందుకే ఈ కోటాలో సీటు తెచ్చుకునేందుకు అంతా యత్నిస్తారు. అయితే ఎంత ర్యాంకు వస్తే.. కన్వీనర్ కోటాలో సీటు దక్కుతుందనే అనే విషయంపై విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గతేడాది ఎంత స్థాయి ర్యాంకుకు కన్వీనర్ కోటాలో సీటు వచ్చిందనే విషయంలో ఇంటర్నెట్‌లో వెతుకుతున్నారు. ఈ ఏడాది ర్యాంకు పెరిగినా.. కన్వీనర్ కోటాలో సీటు దక్కే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### గతేడాది 3.31 లక్షల ర్యాంకుకు సీటు..

ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఉన్న 4,090 సీట్లలో 15 శాతం అఖిల భారత కోటాకు వెళ్తాయి. మిగిలిన 3,476 సీట్లతో పాటు ప్రైవేటు వైద్య కళాశాల్లో 50 శాతం కూడా కన్వీనర్ కోటా కిందకే వస్తాయి. అలాగే రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాల్లో ఎస్సీలకు 15 శాతం సీట్లు, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం దక్కనున్నాయి. కాగా గతేడాది ఆలిండియా జనరల్ కేటగిరిలో 2.12 లక్షల ర్యాంకు వచ్చిన ఓ విద్యార్థికి కన్వీనర్ కోటాలో సీటు రావడం విశేషం. అలాగే అమ్మాయిల్లో 1.98 లక్షల ర్యాంకు వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు దక్కింది. కాగా బీసీ ఏలో అమ్మాయిల కేటగిరిలో 3.31 లక్షల ర్యాంకుకు కన్వీనర్ కోటాలో సీటు దక్కింది.

### సర్కారీలో 4,090 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 34కు చేరుకుంది. ఇందులో 4,090 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే ఏయిమ్స్ బీబీనగర్‌లో 100, ఈఎస్ఐ సనత్‌నగర్‌లో 150 సీట్లున్నాయి. ఇక ప్రైవేటులో 30 కాలేజీలుండగా... అందులో 4,600 సీట్లున్నాయి. ఇందులో కొన్ని కాలేజీలు గతేడాది డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందాయి. దాంతో ఈ కాలేజీల్లో ఉన్న సుమారు 300 సీట్లు రాష్ట్ర పరిధిలోకి రావు. అలాగే ఈ ఏడాది వరంగల్‌లోని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ గుర్తింపును జాతీయ వైద్య కమిషన్ రద్దు చేయడంతో ఆ కాలేజీలో ఉన్న 150 సీట్లలో ప్రవేశాలకు అవకాశం లేకుండా పోయింది.

### కాంగ్రెస్ హయాంలోనూ

## ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందేమో!

- ట్యాపింగ్ సిస్టమ్‌ను ఎత్తుకొచ్చి పెట్టుకుందేమో
- కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే ధైర్యముందా?
- బీసీలకు రేవంత్ ఇచ్చేది 32% రిజర్వేషనే: బండి సంజయ్



జనగామ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ సిస్టమ్‌ను నిజంగానే ధ్వంసం చేశారా? లేక కాంగ్రెస్ వాళ్లే ఎత్తుకొచ్చి పెట్టుకున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. జనగామలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన 'జిల్లా సంస్థాగత సంఘటన కార్యశాల'లో బండి సంజయ్ పాల్గొన్నారు. అంతకుముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. భార్యాభర్తల ఫోన్లు, జడ్జిల ఫోన్లు, ఆఖరికి రాజకీయ నేతల ఇళ్లలోని పనివాళ్ల ఫోన్లను ట్యాప్ చేయించిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి కాపాడుతున్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. కిషన్‌రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని, అలాంటప్పుడు ఆయన ఎందుకు కాపాడతారని నిలదీశారు. విచారణ పేరుతో కాలయాపన చేయడం తప్ప.. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌రెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఏర్పడినప్పుడు పెద్దన్నలా వ్యవహరించి పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, ఒకటి, రెండు రోజుల్లో పరిష్కారమయ్యే సమస్య కాకపోవడంతో కమిటీ వేయాలని నిర్ణయించిందని తెలిపారు. బనకచర్ల విషయంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సొంత ఎజెండాతో వచ్చారని, ఇక్కడ రేవంత్, అక్కడ చంద్రబాబు అబద్ధాలే చెప్పారని తెలిపారు. కానీ, సమావేశంలో జరిగిందేంటో.. కేంద్రం చెప్పిందన్నారు. అభివృద్ధే మంత్రంగా తాము స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నామని, బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం హాలే, బే, డ్రగ్స్, హీరోయిన్స్ అనే నినాదాలతో ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచడాన్ని తాము వ్యతిరేకించట్లేదని చెప్పారు. 42లో 10% ముస్లింలకు ఇస్తామంటున్నారని, ఈ లెక్కన బీసీలకు ఇచ్చేది 32 శాతమే అవుతుందన్నారు. బీసీలకు పూర్తిగా 42% రిజర్వేషన్ ఇస్తామంటే.. అందరం కలిసి ప్రధానిని ఒప్పిద్దామన్నారు.

# సీఎం రేవంత్, మంత్రులది ప్రజా పాలన

## పదేళ్ల కేసీఆర్ పాలన.. ఫామ్‌హౌస్ పాలన.. నిధుల కోసమే సీఎం, మంత్రులు ఢిల్లీకెళ్లారు

- రేవంత్ కూడా ఫామ్‌హౌస్‌లో ఉండాలా?
- తొక్కాలనుకుంటే రాజకీయంగా తొక్కేస్తాం
- మాకు నిఘా పెట్టాల్సిన అవసరం లేదు
- హరీశ్‌రావు పెద్ద యాక్టర్.. ఉత్తమ్ ఫైటర్
- రేవంత్‌ను చంద్రబాబు శిష్యుడని కేటీఆర్, హరీశ్‌లు అంటున్నరు
- టీడీపీలో కేసీఆర్ మంత్రిగా పనిచేయలేదా?
- కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు.. లోకేశ్, జగన్‌లతో వేర్వేరుగా కేటీఆర్ భేటీలు
- చాటుమాటు సంసారం చేసేదే వారు..
- బురద చల్లేది మాపైనా?: తూర్పు జగ్గారెడ్డి





హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులది ప్రజా పాలనైతే.. పదేళ్ల పాటు కేసీఆర్ చేసింది ఫామ్‌హౌస్ పాలనని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఆ పదేళ్లు కేసీఆర్ సచివాలయానికి రాలేదని, అలాగని ప్రజల మధ్యా తిరగలేదని విమర్శించారు. అలాగే ప్రజల సమస్యలు, రాష్ట్రాభివృద్ధికి నిధుల కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలిసిందీ లేదన్నారు. రాష్ట్రంలోని సమస్యల పరిష్కారం, రాష్ట్రాభివృద్ధికి నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడానికి సీఎం రేవంత్, మంత్రులు పదే పదే ఢిల్లీకి వెళుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్.. పదేళ్లు ఫామ్‌హౌస్ పాలన చేశాడు కాబట్టి.. సీఎం, మంత్రులు కూడా ఫామ్‌హౌస్‌లో ఉండాలని వారు అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాలు విడిపోయినప్పుడు నీళ్ల పంచాయితీ ఉండటం సహజమని, సమస్య పరిష్కారం కోసం కేంద్రం పిలిచింది కాబట్టే ఏపీ, తెలంగాణ సీఎంలు ఢిల్లీకి వెళ్లారన్నారు. సమస్యపై ఇద్దరు సీఎంలు కూర్చుని మాట్లాడుకోవడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏమీ కేటీఆర్‌లాగా చాటుమాటు మీటింగ్‌లు పెట్టలేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ డైరెక్షన్‌లో నారా లోకేశ్, వైఎస్ జగన్‌లతో కేటీఆర్ వేర్వేరుగా రహస్య భేటీలు నిర్వహించారని ఆరోపించారు. ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రహస్య భేటీలు జరిగాయన్నారు. చాటుమాటు సంసారం చేసేది వారు.. బురద చల్లేది తమపైనా అంటూ నిలదీశారు. కాగా.. హరీశ్‌రావుపై తమ ప్రభుత్వం నిఘా పెట్టి చేసేదేముందని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. తాము రాజకీయంగా తొక్కాలనుకుంటే నేరుగానే తొక్కుతామని, వారిలాగా పోలీసులను అడ్డంపెట్టుకుని చేయబోమన్నారు. సీఎం రేవంత్‌తో ముఖాముఖికి రావాలంటే కేసీఆర్ భయపడతాడని, అందుకే ఆయన అసెంబ్లీకి రావట్లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. జై తెలంగాణ అనట్లేదని హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని, టీఆర్ఎస్‌లో తెలంగాణ అనే పేరును తీసేసిన వారికి ప్రశ్నించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. హరీశ్ పెద్ద యాక్టర్ అయితే.. యుద్ధ విమానం నడిపిన ఫైటర్ మంత్రి ఉత్తమ్ అని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు భేటీ అయితే వివరాలు బయటపెట్టాలని కేంద్రమంత్రి బండి సంజయ్ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. "సీఎం రేవంత్‌కి చంద్రబాబు గురువని కేటీఆర్, హరీశ్‌లు మాట్లాడుతున్నరు. రేవంత్ కంటే ముందు టీడీపీలో కేసీఆర్ మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యాడు కదా? చంద్రబాబు క్యాబినెట్లో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా చేశాడు కదా? ఇంకా రేవంత్‌ను విమర్శించే హక్కు వారికెక్కడిది?" అంటూ జగ్గారెడ్డి నిలదీశారు.

# మంత్రుల ఫోన్లను ట్యాప్‌చేయిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

పదజాలంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌ల పేరుతో రోత డైలాగులు చెప్పడంలో, బూతులు మాట్లాడటంలో ప్రసిద్ధుడని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి లాంటి నీచపు సీఎంను ఎప్పుడూ చూడలేదు. చిట్‌చాట్‌ల పేరుతో తప్పుడు లీకులు, సోషల్ మీడియాలో తప్పుడు తంబ్‌నెయిల్‌లు, అబద్ధపు, డైవర్షన్ రాజకీయాలతో 18 నెలల పాలన సాగించిన ఘనుడు. రేవంత్‌రెడ్డి నోటి నుంచి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా-ఈ, కాళేశ్వరం, కేసీఆర్.. ఇలా నికృష్టపు మాటలు తప్ప మరేమీ రావు. ఆ మాటలు, స్పీచ్‌లను చూసి ప్రజలు మోసపోవద్దు. డ్రగ్స్ మనుషుల ప్రాణాలు ఎలా తీస్తాయో.. రేవంత్‌రెడ్డి మాటలు రాష్ట్ర ప్రజల ప్రశాంతతను, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. చిల్లర గాసిప్ వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానల్స్‌కే తప్ప ప్రజలకు రేవంత్‌రెడ్డితో దమ్మిడీ లాభం లేదు" అని వ్యాఖ్యానించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, రోశయ్య వంటివారు సీఎం పదవికి హుందాతనం తెచ్చారని, కానీ రేవంత్ నికృష్ట పాలన చేస్తున్నారని విమర్శించారు.

### చర్చిద్దాం.. ఎక్కడికైనా వస్తాం..

అధికారం ఉందని ఇష్టమొచ్చినట్టు కేసులు పెట్టారని, కానీ లీకులివ్వడం తప్ప పీకేదేమీ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "అధికారికంగా ఏమీ చెప్పకుండా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. గ్రాఫిక్స్‌తో నాన్సెన్స్ సృష్టిస్తున్నారు. కిట్టీపార్టీ ఆంటీలా గాసిప్స్ సృష్టిస్తున్నారు. నీ మీద ఏసీబీ కేసుంది.. నామీదా ఏసీబీ కేసుంది. దమ్ముంటే చర్చిద్దాం రా.. ఎక్కడపెడతావో పెట్టు చర్చ. అసెంబ్లీలో పెడితే మైక్ కట్ చేయకుండా చూడు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కా, కొండగల్ కోటకా.. ఎక్కడికైనా వస్తాం" అని సవాల్ చేశారు.



ఖమ్మంలో బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న కేటీఆర్

### లోకేశ్‌ను కలవలేదు.. కలిస్తే తప్పేంటి?

"నేను ఆంధ్రప్రదేశ్ మంత్రి లోకేశ్‌ను కలిశానని రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. నేను కలవలేదు. అయినా కలిస్తే తప్పేంటి? బాజాప్తాగా కలుస్తా. ఆయనతో సత్సంబంధాలు ఉన్నాయి. పక్క రాష్ట్ర మంత్రి, నా తమ్ముడి లాంటివాడు. ఇద్దరం ఫ్రెండ్లీగా ఉంటాం" అని కేటీఆర్ చెప్పారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు, చంద్రబాబుకు తాకట్టు పెట్టారని.. కొడంగల్ ఎత్తిపోతల పథకంలో సగం మంత్రి పొంగులేటికి ధారదత్తం చేశారని ఆరోపించారు. 50సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రాష్ట్రానికి 50పైసలు కూడా తేలేదని.. ఢిల్లీలో చీకట్లో మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకోవడం తప్ప ఏమీ చేయలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు వందసీట్లు వస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకోసం కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఒక్కొక్కరిని ఏం చేయాలో

## రాసి పెడ్తున్నం

కాంగ్రెస్ గూండాల చేతిలో దాడులకు గురైన బీఆర్ఎస్ లీడర్లపై ఉల్టా కేసులు పెట్టి వేధించే చిల్లర పోలీసింగ్ తెలంగాణలో నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇటీవల బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడ్డ హైదరాబాద్‌లోని గౌతంనగర్ కార్పొరేటర్ సునీత భర్త రాముయాదవ్‌ను కేటీఆర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. "చంపేస్తా అని మాజీ మంత్రిని ఒక మాజీ ఎమ్మెల్యే హెచ్చరిస్తే కేసు కాదా? ఇదొక రాష్ట్రం, ఇదో పోలీస్ వ్యవస్థనా? సన్నాసులు, పిరికిపందలు ఈ పోలీసులు! ఒక్కొక్కడి పేరు రాసుకోండి. ఏసీపీలు, డీసీపీలు, సీఐలు, ఎస్సైలు ఎవడెవడైతే బాగా ఎగురుతడో..! నేను ప్రామిస్ చేస్తున్నా. నెక్ట్స్ టైం కేసీఆర్ చెప్పినా నేను వినను. ఎందుకంటే నేనైతే మంచోడిని కాదు. మళ్లీ మా టైం వస్తది. బానిసల్లా పనిచేస్తున్న అధికారులకు చెబుతున్నా.. మా ప్రభుత్వం వచ్చినంక మిమ్మల్ని ఒక్కొక్కర్ని ఏం చేయాలో రాసి పెడ్తున్నం. చేసి చూపెడతాం" అని పోలీసులను హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఒక్క సీటు రాలేదన్న కోపంతో ఇక్కడి ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని.. రౌడీయిజం, గుండాగిరితో శాంతియుత వాతావరణం చెడగొట్టాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. మల్కాజిగిరిలో పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయని, ఎవరైనా మల్కాజిగిరి చౌరస్తాకు గుండాలతో వచ్చి గంటసేపు ట్రాఫిక్ జామ్ చేసి చిల్లర రాజకీయం చేస్తారా అని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి రాలేదన్న అసహనంతోనే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు.

## 'సమ్మక్కసాగర్' ముంపు 100 ఎకరాలే!

» ఛత్తీస్‌గఢ్‌లో ముంపుపై ఐఐటీ-ఖరగ్‌పూర్ నివేదిక

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై ములుగు జిల్లాలో నిర్మిస్తున్న సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీ అనుమతులకు మార్గం సుగమమైంది. సమ్మక్కసాగర్ బ్యారేజీతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి కలిగే ముంపు ముప్పుపై ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో అధ్యయనం చేయించారు. బ్యారేజీ వద్ద 87 మీటర్ల గరిష్ఠ వరదతో బీజాపూర్ జిల్లాలోని పోటూరు, కొటూరు, తుర్లగూడ, గంగారం, కంబాలపేట, సీతానగరంలో 100 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. సమ్మక్కసాగర్‌కు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని డైరెక్టరేట్లన్నీ అనుమతులు ఇవ్వగా.. అంతర్రాష్ట్ర విభాగం ఒక్కటే అభ్యంతరం తెలిపింది. అనుమతి కావాలంటే ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలని తేల్చిచెప్పింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ 83 మీటర్లు కాగా.. అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే చెప్పింది. అయితే గరిష్ఠ వరద 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల దాకా రికార్డయిందని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఛత్తీస్‌గఢ్ పట్టుబట్టింది. తాజాగా ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో అధ్యయనం చేయించగా, స్పష్టత వచ్చింది. ఆ మేరకు భూములకు ఇవ్వాల్సిన పరిహారాన్ని బీజాపూర్ కలెక్టర్ వద్ద జమ చేయించిన తర్వాత ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ లేదా అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకుంటే మార్గం సుగమం కానుంది.

### మహారాష్ట్ర జలవనరుల సలహాదారుగా వెదిరే శ్రీరామ్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు జలవనరుల సలహాదారుగా నల్లగొండ జిల్లాకు చెందిన వెదిరే శ్రీరామ్‌ను నియమిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. జల వనరుల వినియోగంపై విధాన నిర్ణయాలు తీసుకోవడంలో సీఎం ఫడణవీస్‌కు సహాయ సహకారాలు అందిస్తారు. దీర్ఘకాలిక జల విధానంతోపాటు నదుల అనుసంధానం, నీటి పొదుపు, భూగర్భ జలాల యాజమాన్యం, తాగునీటి సరఫరా పథకాలు, సమర్థవంతంగా సాగునీటి వినియోగానికి సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం తదితర అంశాలపై సీఎంకు వెదిరే శ్రీరామ్ సలహాలిస్తారు. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)తోపాటు కేంద్ర జలశక్తి శాఖ, నీతి ఆయోగ్, జాతీయ వాటర్ మిషన్‌తో పాటు అంతరాష్ట్ర వ్యవహారాలు, అంతరాష్ట్ర జల వివాదాలపై సమన్వయం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారు.

### ఎరువులు అక్రమంగా నిల్వచేస్తే చర్యలు

» డీలర్లకు వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి హెచ్చరిక

» ఫిర్యాదులకు 89777-41771 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగు చేసే వేళ.. అక్రమంగా యూరియా నిల్వ చేసే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి హెచ్చరించారు. జిల్లా స్థాయిలో యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎక్కువ మొత్తం ఎరువులు నిల్వ చేసి, బ్లాక్ మార్కెట్‌లో అమ్మడానికి ప్రయత్నించే డీలర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శులు రజత్ కుమార్ మిశ్రా, దేవేష్ చతుర్వేది శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం డైరెక్టర్ గోపి అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ ఎరువుల సరఫరాపై కేంద్ర తనిఖీల బృందాలు కూడా రాష్ట్రాల్లో తనిఖీలు చేపట్టే అవకాశం ఉందన్నారు. రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. నిర్ధారించిన ధరకంటే ఎక్కువ ధరకు యూరియా విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. యూరియా, ఇతర ఎరువులను అక్రమంగా నిల్వ చేసి, అధిక ధరలకు విక్రయించే వారిపై ఫిర్యాదు చేయడానికి వ్యవసాయ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు 89777-41771 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫోన్ నెంబరు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.





నాగర్‌కర్నూలు జిల్లా జటప్రోలు గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

# పదేళ్లూ నేనే!

(మొదటిపేజీ తరువాయి)



జటప్రోలు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి

సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కేసీఆర్ శాపగ్రస్తుడని, బావిలో దుంకినా.. పెట్రోల్ పోసుకొని అంటించుకున్నా తెలంగాణ అభివృద్ధిని ఆపలేరన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం నిరుద్యోగ యువకులు ప్రాణత్యాగాలు చేశారని, రెండు లక్షల కొలువులు ఖాళీ ఉంటే కేసీఆర్ తన ఇంటి నిండా కొలువులు ఇచ్చుకున్నాడే తప్ప నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, వచ్చే రెండున్నర ఏళ్లలో 41 వేల కొలువులు భర్తీ చేసి లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. "నల్లమల బిడ్డ సీఎం అయినందుకు దుఃఖం వస్తుందా!? 40 ఏళ్ల నుంచి కొట్లాడుతున్న మాదిగ ఉప కులాలకు వర్గీకరణ చేసినందుకు దుఃఖం వస్తోందా!? వర్గీకరణతో ఆ ఉప కులాల బిడ్డలు చాలా మందికి మెడిసిన్‌లో, ఇంజనీరింగ్‌లో సీట్లు వచ్చాయి. వారి కళ్లలో సంతోషం చూశాను. గత ప్రభుత్వంలో ముదిరాజులు చేపలు పట్టుకోవాలి.. మాదిగలు చెప్పులు కుట్టుకోవాలి.. గొల్ల కురుమలు గొర్లు కాయాలనే విధంగా పథకాలు అమలు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాల పిల్లలను చదివించాలని.. కలెక్టర్లను చేయాలని.. వారిని డాక్టర్లు, ఇంజనీర్లను చేయడం కోసం పని చేస్తుంది. ఇది మా ప్రభుత్వ విధానం" అని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీరు లేక పాలమూరు ఎడారిగా మారిందని, స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్ కూడా ఉమ్మడి పాలకుల కంటే ఎక్కువ ద్రోహం చేశారని మండిపడ్డారు. రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కానీ, లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కట్టారని విమర్శించారు. పాలమూరు ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు ఎన్ని వందల కోట్లు అవసరమైనా డిసెంబర్ 9లోపు మంజూరు చేసి.. రెండున్నరేళ్లలోపు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. తాము ఒకే విడతలో 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, కేసీఆర్ తన రెండు హయాముల్లో కలిపి16 వేల కోట్లను కూడా నాలుగు విడతల్లో చేశారని, అవి వడ్డీకి కూడా సరిపోలేదని ఎద్దేవా చేశారు.

### సెల్ఫీలు.. సెల్ఫ్ డబ్బాలు..

సెల్ఫీలు దిగడం.. సెల్ఫ్ డబ్బాలు కొట్టుకోవడం తప్ప ఆడబిడ్డల కోసం కేటీఆర్ చేసింది ఏమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తాము హైటెక్ సిటీ పక్కనే ఉన్న శిల్పారామం వద్ద మూడున్నర ఎకరాల స్థలం కేటాయించి 150 షాపుల్లో మహిళలు తాము తయారు చేసుకునే ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. 2035 నాటికి ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణను మార్చాలంటే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని, ఇందిరా మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆర్టీసీ బస్సులు కొనివ్వడం, 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల బాధ్యతలు ఇవ్వడం, యూనిఫాంలు కుట్టించడం, రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడం అందులో భాగమేనని అన్నారు.

### రెడ్డి బిడ్డ అయి ఉండి బీసీల తరఫున పని చేస్తున్నారు: మంత్రి వాకిటి

వెనకబాటులో ఉన్న వర్గాలకు ఆర్థిక, రాజకీయ, విద్య రంగాల్లో అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో బీసీ కులగణన చేశారని, రెడ్డి బిడ్డ అయి ఉండి రేవంత్ రెడ్డి బీసీల తరఫున పనిచేస్తున్నారని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. వరి వేస్తే ఉరి అన్న నాటి నుంచి ఇప్పుడు గిట్టుబాటు ధరతోపాటు బోనస్ ఇస్తున్నామని, పండుగలప్పుడు తినే సోనామసూరి సన్న బియ్యాన్ని ప్రతిరోజు పేదలు తినేందుకు ఇస్తున్నామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 22 మంది ముఖ్యమంత్రులు కలిసి రూ.75 వేల కోట్ల అప్పు చేస్తే కేసీఆర్ ఒక్కరే పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని, పైగా తాము అభివృద్ధి చేస్తుంటే దాన్ని చూడలేక దుఃఖం వస్తోందని వరంగల్ సభలో వ్యాఖ్యానించారని కేసీఆర్‌పై మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఎన్నికల ముందు పాలమూరు-రంగారెడ్డిలో ఒక్క మోటార్ ఆన్ చేశారని, కాల్వలు నిర్మించకుండా ప్రచారం పొందేందుకు ప్రయత్నించారని విమర్శించారు. తొమ్మిదేళ్లలో వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని, వడ్డీ చెల్లింపులు చేయలేదని, తాము వడ్డీ లేని రుణాలు ఇస్తూ బీమా భద్రత కూడా కల్పిస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. వర్గీకరణ చేశామని, 60 వేల ఉద్యోగాలు ఇచ్చి సాధికారత, సమన్యాయంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో ఆర్థిక, సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చింది కార్ల్ మార్క్స్ అయితే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణతో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని సమర్థంగా అమలు చేస్తున్నది సీఎం రేవంత్ అని ఎంపీ మల్లు రవి అన్నారు.

### రాయలసీమ లిఫ్టును రద్దు చేయండి

"ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నా. మీరు సీఎంగా ఉన్నప్పుడు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. గతంలో పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నారు. ఇప్పుడు అదే పాలమూరు జిల్లాకు అన్యాయం చేసే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయండి. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి నినాదం ఇచ్చే మీరు ఉదారంగా వ్యవహరించండి. మీ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు మీరే అడ్డుపడొద్దు. బాధ్యతగా ఉండి మమ్మల్ని బతకనివ్వండి" అని చంద్రబాబుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాయలసీమ లిఫ్టును రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని, వినకపోతే పోరాటాలు చేస్తామని, అందుకు తాను బాధ్యత తీసుకుంటానని, తమ రక్తంలోనే పోరాటం ఉందని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌లోకి మునిసిపల్ చైర్‌పర్సన్

జడ్చర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతోపాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు లలిత, ఉమాదేవి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### బీసీలకు రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై

# న్యాయసలహా!

» అధికారులతో చర్చించిన తర్వాత కోరిన గవర్నర్



హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్స్‌పై రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ న్యాయసలహా కోరినట్టు తెలిసింది. రిజర్వేషన్ అమలుకు వీలుగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్ ఫైలులో కదలిక వచ్చింది. ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో అధికారులతో శుక్రవారం చర్చించినట్టు సమాచారం. అంతేకాక, ఈ ఆర్డినెన్స్, రిజర్వేషన్ అంశాలపై గవర్నర్ న్యాయ సలహా కోరినట్టు తెలిసింది. రిజర్వేషన్లు, వాటి అమలుకు సంబంధించి ఇతర రాష్ట్రాల నుంచి కూడా పలు వివరాలు తీసుకోవాలని సంబంధిత అధికారులను గవర్నర్ ఈ సందర్భంగా ఆదేశించినట్టు సమాచారం. అలాగే, ప్రభుత్వం సవరణకు ప్రతిపాదించిన పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285 (ఏ)పై కూడా గవర్నర్ ఆరా తీసినట్టు తెలిసింది. కాగా, ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభిస్తే చట్ట సవరణ అమలులోకి రానుంది.

### సీఎస్‌సీ ఒప్పందం

# రద్దు చేయండి

» మీసేవ కమిషనర్‌కు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు



మీసేవ కేంద్రాలు అందిస్తున్న సేవలన్నీ ప్రైవేటు సంస్థ సీఎస్‌సీకి అప్పగించాలని ఈఎస్‌డీ మీసేవ విభాగం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. దీనికి సంబంధించి గత వారం ఈఎస్‌డీ కమిషనర్ సీఎస్‌సీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణ మీసేవ ఆపరేటర్ల సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిశారు. ప్రైవేటు సంస్థకు అనుమతిస్తే మీసేవ కేంద్రాలన్నీ మూతపడతాయని అధ్యక్ష, కార్యదర్శులు భైర శంకర్, ముహమ్మద్ మోయిద్ మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి ఈఎస్‌డీ మీసేవ కమిషనర్ రవికిరణ్‌కు ఫోన్ చేశారు. ప్రైవేటు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తరించి ఉన్న మీ సేవ కేంద్రాల్లో మరిన్ని సేవలు పెంచుతామని, అవసరమున్న చోట కొత్త కేంద్రాలకూ అనుమతిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# ఎప్‌సెట్ మొదటివిడతలో 93% సీట్ల భర్తీ

**సీఎస్ఈలో 97%, ఈసీఈలో 92% పూర్తి.. కోర్ ఇంజనీరింగ్ కోర్సులకు పెరిగిన డిమాండ్**

» సివిల్‌లో 80% దాటిన అడ్మిషన్లు

» మొత్తం 77,561 మందికి ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

» కేటాయింపుల్లో అబ్బాయిలు 54%, అమ్మాయిలు 46%

» 16,793 మందికి దక్కని సీట్లు

» ఇంజనీరింగ్ మొదటివిడత సీట్ల కేటాయింపు పూర్తి

**ఏ కోర్సులో ఎన్ని సీట్లు..?**

| కోర్సు | మొత్తం | సీట్లు | భర్తీ (%) |
|---|---|---|---|
| సీఎస్ఈ | 28,246 | 27,657 | 97.91 |
| సీఎస్ఈ ఏఐ-ఎంఎల్ | 13,540 | 13,093 | 96.70 |
| సీఎస్ఈ డాటాసైన్స్ | 7,600 | 7,295 | 95.99 |
| సీఎస్ఈ ఐటీ | 3,960 | 3,849 | 97.20 |
| సీఎస్ఈ ఏఐ-డాటా సైన్స్ | 1,301 | 1,276 | 98.08 |
| ఈసీఈ | 10,967 | 10,099 | 92.09 |
| ఈఈఈ | 4,695 | 3,519 | 74.95 |
| సివిల్ ఇంజనీరింగ్ | 3,376 | 2,756 | 81.64 |
| మెకానికల్ ఇంజనీరింగ్ | 3,230 | 2,401 | 74.33 |
| మొత్తం | 83,054 | 77,561 | 93.39 |

హైదరాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ మొదటివిడత సీట్ల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. కౌన్సెలింగ్‌కు సంబంధించి సీట్ల కేటాయింపును సాంకేతిక విద్యాశాఖ శుక్రవారం ప్రకటించింది. కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసే కన్వీనర్ కోటాలో మొత్తం 83,054 సీట్లుండగా.. మొదటివిడతలో మొత్తం 77,561 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తం సీట్లలో ఇది 93.3%. ఇంకా 5,493 సీట్లు మిగిలిఉన్నాయి. ఉన్నత వర్గాల్లోని పేదలకు ఉద్దేశించిన ఈడబ్ల్యుఎస్ కోటాలో 6,083 మంది సీట్లు సాధించారు. మొత్తం సీట్లు పొందినవారిలో 41,924(54.1%) మంది అబ్బాయిలు కాగా, 35,637(45.9%) మంది అమ్మాయిలున్నారు. 12న ప్రకటించిన మాక్ సీట్ అలాట్‌మెంట్‌లో 77,154 మందిసీటు సాధించారు. మార్పులు చేర్పులకు 2 రోజులు అవకాశమివ్వగా.. వీరిలో 36,544 (47.36%) మంది ఇతర కాలేజీలు, బ్రాంచ్‌లను మార్చుకున్నారు. విద్యార్థులు 22లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, లేనిపక్షంలో సీటు రద్దుచేస్తామని ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన పేర్కొన్నారు. మొదటి విడతలో సీటు సాధించి, ట్యూషన్ ఫీజు చెల్లించకుండా రెండో విడతలో పాల్గొంటే మొదటి విడత సీటు రద్దవుతుందన్నారు.

**సీఎస్ఈకి సమానంగా కోర్**

ఈసారి కోర్ ఇంజనీరింగ్ కోర్సుల సీట్లు ఎక్కువగా భర్తీ అయ్యాయి. కోర్ బ్రాంచ్‌లు-- ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటం, భవిష్యత్తుల్లోనూ భారీ డిమాండ్ ఏర్పడుతుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించిది. ఈ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు ప్రత్యేకంగా సంబంధిత కంపెనీలతో ఉన్నత విద్యామండలి ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో ఈసారి సీఎస్ఈతో సమానంగా ఈసీఈలో సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ఈలోని మొత్తం 17 బ్రాంచ్‌లలో 58,742 సీట్లుండగా.. 57,042(97.11%) భర్తీ అయ్యాయి. ఈ విభాగంలో 1,700 సీట్లు మాత్రమే మిగిలాయి. అయితే ఈసారి ఈసీఈలో మొదటివిడతలోనే 90 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. ఈ విభాగంలో మొత్తం 10,967 సీట్లుండగా.. 10,099(92.09%) పూర్తయ్యాయి. ట్రిపుల్-ఈలో 4,695 సీట్లలో 3,519(74.95%), మెకానికల్‌లో 3,230లో 2,401 (74.33%) భర్తీ అయ్యాయి. కొన్నేళ్లుగా సివిల్ ఇంజనీరింగ్‌కు డిమాండ్ తగ్గుతూ వస్తోంది. గత ఏడాది 63.36% సీట్లు మాత్రమే భర్తీ కాగా.. ఈసారి మొదటి విడతలోనే 80% సీట్ల కేటాయింపులు జరగడం గమనార్హం..! సివిల్‌లో మొత్తం 3,376 సీట్లుండగా.. 2,756(81.64%) భర్తీ అయ్యాయి.

### జేఎన్‌టీయూ కాలేజీనే కింగ్?



ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో జేఎన్‌టీయూనే రారాజు అన్న విషయం మరోసారి రుజువైంది. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో తొలివిడత సీట్ల కేటాయింపులో.. టాప్ ర్యాంకర్లలో అత్యధికులు జేఎన్‌టీయూ కాలేజీనే ఎంచుకున్నారు. టాప్-100 ర్యాంకర్లలో ముగ్గురు, టాప్-వెయ్యి ర్యాంకర్లలో 64 మంది క్యాంపస్ కాలేజీల్లోని వివిధ ఇంజనీరింగ్ కోర్సులను ఎంచుకున్నారు. క్యాంపస్ కాలేజీలోని 11 ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో 618 సీట్లుండగా, అన్నీ భర్తీ అయిపోవడం విశేషం..! ఈ కాలేజీలో అనుభవజ్ఞులైన ఆచార్యులు, మెరుగైన వసతి, రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వార్షిక ప్యాకేజీతో క్యాంపస్ ఇంటర్వ్యూలు లభించడం వంటి అంశాలు టాపర్లను జేఎన్‌టీయూవైపు ఆకట్టుకుంటున్నాయి. ఈ కాలేజీలో హైఎండ్ ప్లేస్‌మెంట్‌కు ఢోకా లేదని కంప్యూటర్ సైన్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

**ప్రైవేటు కాలేజీల్లో 94%, వర్సిటీల్లో 84% భర్తీ**

ఈసారి మొదటివిడతలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం 75,384 సీట్లలో 70,959 (94.1%) భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లోని 20 కాలేజీల్లో 6,108 సీట్లు ఉండగా 5,151(84.3%) భర్తీ అయ్యాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో 1,367 సీట్లలో 1,357(99.2%), రాష్ట్రంలో ఉస్మానియాలోని ఏకైక ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో మొత్తం 195 సీట్లలో 94(48.4%) భర్తీ అయ్యాయి.



## అశోక్ గజపతి కంటతడి

### గవర్నర్ బాధ్యతల కారణంగా పార్టీకి రాజీనామా

**ఆ సమయంలో తీవ్ర భావోద్వేగం**

**40ఏళ్లపాటు టీడీపీకి, ఏపీకి నిస్వార్థ సేవ**

విజయనగరం, సింహాచలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతి రాజు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పొలిట్‌బ్యూరో పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను టీడీపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబు, పల్లా శ్రీనివాస్‌కు మెయిల్స్ ద్వారా, రిజిస్టర్ పోస్టు ద్వారా పంపారు. రాజీనామా చేసే సందర్భంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. తొలుత ఆయన వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద రాజీనామా పత్రంపై సంతకం పెడుతూ... భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. "ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ నేటివరకూ టీడీపీని వీడలేదు. అందరి మన్ననలతో ఎన్నో పదవులు చేపట్టి ఎటువంటి అపకీర్తి లేకుండా పనిచేసే శక్తిని అప్పన్నస్వామి ప్రసాదించడం అదృష్టంగా భావిస్తున్నాను. గవర్నర్ పదవి అనేది రాజ్యాంగపరమైన బాధ్యత కావటంతో టీడీపీకి రాజీనామా చేయ్యాల్సి వచ్చింది. బాధగా ఉన్నా.. దేశం కోసం సేవలందించాలని పెద్దలు సూచించటంతో పార్టీకి రాజీనామా చేస్తున్నాను. గవర్నర్ పదవి మరింతగా నా బాధ్యతలను పెంచింది." అంటూ ఉద్వేగానికి గురయ్యారు.

# నెత్తురోడిన ఔటర్!

» ఆదిభట్ల వద్ద ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

» ముందువెళ్తున్న లారీని అతివేగంతో ఢీకొట్టిన కారు

» ఐదుగురి దుర్మరణం.. కారులో మద్యం సీసాలు?

» దైవదర్శనానికని వెళ్లి.. మధ్యలోనే వెనుదిరిగి..!

ఆదిభట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్)పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు ముందు వెళ్తున్న లారీని అదుపు తప్పి అతి వేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి బొంగులూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రీన్ వ్యాలీ రిసార్ట్‌లో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరి తండాకు చెందిన గుగులోత్ జనార్దన్ (45), వరంగల్ జిల్లా పాకాలకు చెందిన మాలోత్ చందులాల్ (29), ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు దాసరి భాస్కర్‌రావు (39), విజయనగరం జిల్లాకు చెందిన జాడ కృష్ణ (25) పని చేసేవారు.. వీరికి స్థానికం ఉండే కావలి బాల్‌రాజ్(40)తో కొంత కాలంగా పరిచయముంది. ఈ నేపథ్యంలోనే అతడి కారులో గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఎన్కేపల్లి నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి అని ఇంట్లో వారితో చెప్పి బయలుదేరారు. కాగా.. తెల్లవారు జామున తిరుగు ప్రయాణంలో ఘట్కేసర్ వద్ద 2.45 గంటలకు కారుతో ఔటర్ రింగు రోడ్డుపైకి వచ్చారు. ఈ నేపథ్యంలోనే 3 గంటల సమయంలో ముందు వెళ్తున్న లారీని కారు అతివేగంతో వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జనార్దన్, చందులాల్, భాస్కర్ రావు, బాల్‌రాజ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించగా.. ప్రాణాలతో ఉన్న కృష్ణను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అతడి పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసమవ్వగా.. మృతదేహాలు కారులో ఇరుక్కుపోవడంతో అతికష్టమ్మీద బయటకు తీశారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత ఆస్పత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇటు రాచకొండ కమిషనరేట్ పరిధి మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. కాగా.. దైవదర్శనానికని ఇంట్లో వాళ్లకు చెప్పి బయలుదేరిన వీరు.. మార్గమధ్యలోనే వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఆ రాత్రి వీరు ఎక్కడ ఆగారనేది సస్పెన్స్‌గా మారింది. కారులో మద్యం సీసాలు దొరికినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

## బీటెక్ విద్యార్థినికి ఉస్మా'నయా' జన్మ!

» కోమాలో ఉన్న బాలికకు కాలేయ మార్పిడి

» దాతల కోసం జీవన్‌దాన్ సూపర్ అర్జెంట్ విభాగంలో నమోదు

» 24గంటల్లో లభ్యం.. సర్జరీ విజయవంతం



హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాలేయం పూర్తిగా చెడిపోయి.. కోమాలోకి వెళ్లి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ పదిహేడేళ్ల బాలికకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స పూర్తిచేసి పునర్జన్మ ప్రసాదించారు ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు! అదీ.. జీవన్‌దాన్‌లో సూపర్ అర్జెంట్ విభాగంలో నమోదు చేసిన 24 గంటల్లోనే ఈ శస్త్రచికిత్స పూర్తిచేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో ఇంత వేగంగా రోగికి ప్రయోజనం లభించడం ఇదే మొదటిసారి అని ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం అధిపతి మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌కు చెందిన బ్లెస్సీ గౌడ్ అనే బాలిక బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. తీవ్ర జ్వరం రావడంతో మే నెలలో ఆమెను తల్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించింది. ఐదు రోజుల తర్వాత ఆమె కోమాలోకి వెళ్లింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న బ్లెస్సీని మే 12న కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బ్లెస్సీని పరీక్షించిన అక్కడి వైద్యులు, ఆమె కాలేయం పూర్తిగా పాడై పోయిందని (Acute Fulminant liver Failure) గుర్తించారు. 48 గంటల్లోగా బ్లెస్సీకి కాలేయ మార్పిడి చేయాలని, లేదంటే ఆమె చనిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. కాలేయ దానానికి ఆమె తల్లి, కుటుంబసభ్యులు ముందుకొచ్చినా వారిలో ఎవ్వరి కాలేయం కూడా సరిపోదని తేలింది. బ్లెస్సీ పరిస్థితి వివరిస్తూ కాలేయదానం కోసం జీవన్‌దాన్ సూపర్ అర్జెంట్ కేటగిరిలో ఉస్మానియా వైద్యులు నమోదు చేశారు. 'జీవన్‌దాన్ సూపర్ అర్జంట్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్స్‌పర్ట్ టీమ్' వారి అభ్యర్థనను పరిశీలించి. కాలేయం ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. అదే సమయంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కాలేయం బ్లెస్సీ బ్లడ్ గ్రూప్‌తో సరిపోవడంతో జీవన్‌దాన్ దానిని బ్లెస్సీకి కేటాయించింది. ఆమెకు మే 14న డాక్టర్ మధుసూదన్ పర్యవేక్షణలో ఉస్మానియా వైద్య బృందం కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసింది. రెండు వారాల తర్వాత బ్లెస్సీ కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి ఆమెను ఇంటికి పంపించారు. బ్లెస్సీకి పూర్తి ఉచితంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని డాక్టర్ మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు. బాలికకు పునర్జన్మను ప్రసాదించిన ఉస్మానియా డాక్టర్ల బృందాన్ని దామోదర అభినందించారు.

## నాసా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాసా ఆధ్వర్యంలో ఇటీవల అమెరికాలో ఎన్ఎస్ఎస్ - ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని శ్రీచైతన్య స్కూల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పోటీలో 30 దేశాలకు చెందిన 475 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 67 మంది భారతీయులు ఉండగా, 45 మంది తమ విద్యార్థులు కాగా, 22 మంది తెలుగు వారని శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ పోటీలో ప్రపంచ టైటిల్‌తోపాటు పలు బహుమతులు గెలుచుకున్నారన్నారు. గత 14 ఏళ్లుగా తమ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడంతోపాటు విజేతగా నిలుస్తున్నారన్నారు. నాసా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె అభినందించారు.

## పోలీసు అధికారి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు

- మల్నాడు కిచెన్ కేసులో కొత్తకోణం
- పబ్‌లే కాదు.. ఫామ్‌హౌస్‌లలోనూ సూర్య, తేజ్ హల్‌చల్
- సూర్య రెగ్యులర్ కస్టమర్లకు ఈగల్ పిలుపు
- హైకోర్టును ఆశ్రయించిన పబ్ యజమాన్యాలు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసు అధికారి వేణుగోపాల్‌రావుకు సంబంధించిన ఒక ఫామ్‌హౌస్‌లో.. అతని కుమారుడు రాహుల్ తేజ్ తరచూ డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవాడని ఈగల్ దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. ములుగులో ఆ ఫామ్‌హౌస్‌లో సూర్యతోపాటు తేజ్ వారానికోసారి కస్టమర్ల కోసం డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవారని అధికారులు నిర్ధారించారు. మరోవైపు రాహుల్ తేజ్, సూర్య స్థానిక కోర్టులో బెయిల్ పిటిషన్లు వేశారు. కాగా.. డ్రగ్స్ పార్టీల కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేసిన 9 పబ్‌లపై సైబరాబాద్ ఈగల్ టీమ్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే..! పబ్ యాజమాన్యాల్లో కొందరికి ఈగల్ నుంచి నోటీసులు వెళ్లాయి. దీంతో.. వాక్ కేరా, బ్రాడ్‌వే, క్వాక్ పబ్‌ల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ.. క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై ఈగల్ బృందం బలమైన కౌంటర్ దాఖలు చేసింది. ఇరువర్గాల వాదనలు శుక్రవారంతో ముగిశాయి. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. అటు సూర్య, తేజ్ కాల్‌లిస్టు ఆధారంగా ఈగల్ బృందాలు వారి కస్టమర్ల చిట్టాను సిద్ధం చేసినట్లు తెలిసింది. వీరందరికీ ఈగల్ బృందాలు త్వరలో నోటీసులు జారీ చేసి, విచారించనున్నట్లు తెలిసింది..

## రాజస్థాన్ నుంచి నల్లమందు.. 3.5 కిలోల పట్టివేత

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు నల్లమందు తరలించే బిష్ణోయ్ గ్యాంగ్ ఆటను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్- ఈగల్ కట్టించింది. ఈ ముఠా నుంచి రూ. 17 లక్షలు విలువ చేసే 3.5 కిలోల ఒపియంను సీజ్ చేసింది. ఈగల్ చీఫ్ సందీప్ శాండిల్య కథనం ప్రకారం.. ఈ నెల 14న రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లా బిన్మల్ ప్రాంతానికిచెందిన సావ్లారామ్ బిష్ణోయ్ ముఠా.. కార్లలో నల్లమందుతో హైదరాబాద్‌కు బయలుదేరింది. ముందే ఉప్పందుకున్న ఈగల్ బృందం.. నిఘాను ముమ్మరం చేసింది. ఆదిలాబాద్ టోల్‌ప్లాజా వద్ద ఓ కారుకు ముందు పైలటింగ్, వెనక ఎస్కార్టింగ్‌గా వాహనాలు వెళ్తుండడాన్ని గుర్తించింది. ముందున్న కారులోని వ్యక్తి.. వెనక కార్లకు సిగ్నల్ ఇవ్వడాన్ని గమనించింది. ఆ వాహనాలను హైదరాబాద్ వచ్చే వరకు ఈగల్ బృందాలు గుట్టుచప్పుడు కాకుండా వెంబడించాయి. బిష్ణోయ్ గ్యాంగ్ కారు గురువారం హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి చేరుకుని, ఓ వ్యక్తికి నల్లమందును అందిస్తుండగా.. ఈగల్ బృందాలు దాడులు జరిపాయి. పైలటింగ్ చేస్తున్న వాహనంతోపాటు.. మరో కారును సీజ్ చేశాయి. ఆ కారులో 3.5 కిలోల నల్లమందును స్వాధీనం చేసుకున్నాయి. ఈ గ్యాంగ్ నాయకుడు సావ్లారామ్ బిష్ణోయ్ అని గుర్తించామని సందీప్ శాండిల్య తెలిపారు. హవురాం బిష్ణోయ్, లాలారామ్ బిష్ణోయ్ అనే వ్యక్తులను అరెస్టు చేసి, రెండు కార్లు, 3.5 కిలోల నల్లమందును సీజ్ చేశామన్నారు.

## మనీ లాండరింగ్ పేరుతో కుచ్చుటోపీ

- రిటైర్డు ఉద్యోగి నుంచి 32 లక్షలు కాజేసిన సైబర్ మోసగాడు

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లు రోజుకో ఎత్తుగడ వేస్తూ అమాయకుల నుంచి డబ్బు స్వాహా చేస్తున్నారు. హైదరాబాద్‌లోని లాలాగూడ ప్రాంత వాసి- రిటైర్డు ఉద్యోగికి సైబర్ మోసగాడు గత నెల 23న ఫోన్ చేసి తాను ఈడీ అధికారినని పరిచయం చేసుకుని.. 'మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. సహకరించకుంటే మీ భార్యాభర్తలను అరెస్టు చేసి, ముంబై తీసుకెళ్లి విచారించాల్సి వస్తుంది' అని బెదిరించాడు. విచారణ పూర్తయ్యే వరకూ ఎవరికీ ఈ విషయం చెప్పొద్దని, చెప్పినట్లు తెలిస్తే ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తామని బెదిరించాడు. తనకు మనీ లాండరింగ్ కేసులతో సంబంధం లేదని బాధితుడు మొత్తుకున్నా వినలేదు. 'మీతోపాటు మీ భార్యను అరెస్టు చేస్తామని హెచ్చరించడంతో భయపడిపోయి వృద్ధుడు పలు దఫాలుగా రూ.32.20 లక్షల నగదు ఆ సైబర్ నేరగాడు సూచించిన బ్యాంకు ఖాతాల్లో జమ చేశాడు. చివరికి మోసపోయినట్లు గ్రహించిన వృద్ధుడు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## మత ప్రచారం చేస్తున్నారని బైబిళ్లు దగ్ధం

- ఇల్లెందులో 9మంది బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల అరెస్టు

ఇల్లెందు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మత ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో బైబిళ్లను దగ్ధం చేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని 21పిట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 21పిట్‌లో ముగ్గురు వ్యక్తులు తమ మతంలో చేరాలంటూ ఇంటింటికీ వెళ్లి బైబిళ్లను ప్రచారం నిర్వహించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పట్టణ బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు అక్కడకు చేరుకుని.. మత ప్రచారం చేస్తున్న వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం వారి వద్ద ఉన్న బైబిళ్లను రహదారిపై పడవేసి పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. కాగా.. ఈ ఘటనపై ఆ మతస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 9మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఆగస్టు 25నుంచి బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిళ్లలో గ్రూప్స్ పోటీ పరీక్షలతో పాటు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగ పరీక్షల కోసం ఐదు నెలల పాటు ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ ప్రకటించింది. ఆగస్టు 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు డిగ్రీ పూర్తిచేసి ఉండాలని హైదరాబాద్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల లోపు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో వచ్చేనెల 11వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-24071178 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెనుబల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పార్థసారధిపురం గ్రామ పోడు రైతు ఎట్టి వీరస్వామి (37) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పార్థసారధిపురం గ్రామ వాసి వీరస్వామి 3 ఎకరాల్లో పోడు భూములు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కానీ, కొన్నేళ్లుగా దిగుబడి సరిగ్గా రాలేదు. పంటల సాగు కోసం రూ. లక్షల్లో అప్పులు చేసినందుకు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పు ఇచ్చిన వారు తమ బాకీ తీర్చాలని వేధించడంతో 4 రోజుల క్రితం చౌడారం - భవన్నపాలెం గ్రామాల మధ్య అడవిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## హైదరాబాద్‌లో కల్లు నిషేధిస్తే నగర దిగ్బంధనమే

- ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక
- కల్లును నిషేధిస్తే మద్యనిషేధానికి ఉద్యమం: గౌడ సంఘం

పంజాగుట్ట, జూలై18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కల్లును నిషేధిస్తే లక్షలాది మందితో నగరాన్ని దిగ్బంధం చేస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గిన ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కల్లు గీత వృత్తిపై దాడి చేస్తోందని ఆరోపించారు. గౌడ సంఘాల నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో కల్లు విక్రయాలను నిషేధించగా ఎంతోమంది గీత కార్మికులు రోడ్డున పడ్డారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కూకట్‌పల్లిలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, కార్పొరేటర్ ఆధ్వర్యంలో నడుస్తున్న కల్లు కాంపౌండ్‌లో కల్తీ కల్లు తాగి 11 మంది చనిపోయారన్నారు. ఆ కాంపౌండ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా ఓఆర్ఆర్ లోపల కల్లు అమ్మకాలు బంద్ చేస్తామని ప్రభుత్వం లీకేజీలు ఇస్తుందని మండిపడ్డారు. కల్తీకి తాము వ్యతిరేకమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఇక, కల్తీ పేరుతో ప్రభుత్వం తమ జాతిని అంతం చేయాలని చూస్తోందని గౌడ్ సంఘాల నాయకులు ఆరోపించారు. తమ సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై స్పందించకపోతే జాతి ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. కల్లును నిషేధిస్తే మద్యాన్ని కూడా నిషేధించాలని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# బాలలకు రక్తపరీక్షలు

- అంగన్‌వాడీ నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు పరీక్షలు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీల్లోని చిన్నారులు, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పిల్లలందరికీ రక్త పరీక్షలు చేయాలని సర్కారు నిర్ణయించింది. పిల్లలు వయసుకు తగిన ఎత్తు, బరువు పెరగడంలేదని, వారిలో ఎదుగుదల సరిగా ఉండడంలేదని పలు నివేదికలు పేర్కొంటున్న నేపథ్యంలో వారి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ చిన్నారుల నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు బాల, బాలికలందరికీ రక్త పరీక్షలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. వీరితోపాటు బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోనుంది. ఐదేళ్లలోపు చిన్నారుల్లో కంటిచూపు, వినికిడి లోపాలు, వయసు ప్రకారం రావాల్సిన మాటలు వస్తున్నాయా, లేదా అనే విషయాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. దీంతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారం, వారి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'రేడియో' ప్రసారాలు చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే.. పిల్లలకు రక్తపరీక్షలు చేసిన తరువాత వారికి అవసరమైన ఆహారాన్ని అందించి, దానికి తగిన ఎదుగుదల ఉంటుందా లేదా అనేది తెలుసుకోవడానికి ప్రతినెలా 'గ్రోత్ ప్రోగ్రెస్ రిపోర్టు'ను కూడా తీసుకోవాలని సర్కారు యోచిస్తోంది. చిన్నారులు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం, వారు తీసుకోవాల్సిన ఆహారం, వ్యక్తిగత శుభ్రతకు సంబంధించి ప్రత్యేకంగా 'మిషన్-100 డేస్' పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత వంద రోజులు ప్రచారం నిర్వహించి.. ఆ తరువాత దానిపై క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు మిషన్ మోడ్‌లో పని చేయాలని నిర్ణయించారు. ప్రచార కార్యక్రమాల కోసం స్థానికంగా ఉండే ప్రముఖ గాయకులు, వక్తల సేవలను వినియోగించుకోనున్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లో ఉండే సభ్యులను ఈ ప్రచార కార్యక్రమానికి 'బ్రాండ్ అంబాసిడర్లు'గా నియమించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మరోవైపు ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక 'న్యూట్రిషన్ ప్లాన్' కూడా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం నిపుణులతో న్యూట్రిషన్ కమిటీని నియమించనున్నట్టు సమాచారం.

### అంగన్‌వాడీల స్థాయిలోనే సమస్యల గుర్తింపు..

రాష్ట్ర వ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 7నెలల నుంచి 6ఏళ్ల వయసులోపు పిల్లలు 19 లక్షల మందికిపైగా ఉన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు సుమారు 3.55 లక్షల మంది ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లల్లో ఎదుగుదల, వినికిడి సమస్య, కంటిచూపు లోపాలు, వయసు ప్రకారం మాటలకు సంబంధించిన సమస్యలను 5 ఏళ్లలోపు గుర్తించగలిగితే.. వాటికి చికిత్స అందించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ఇలాంటి సమస్యలకు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో చికిత్సలు అందిస్తున్నారు. ఇలాంటి సమస్యలకు చికిత్స చేయించుకున్న కొంతమంది పిల్లలు గతంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రకమైన సమస్యలను గుర్తించేందుకు అంగన్‌వాడీలకు ప్రత్యేక కార్యాచరణ ఇవ్వనున్నారు. వినికిడి, కంటిచూపు లోపాలు, మాటలు పలకలేని చిన్నారులు ఉన్నట్టు గుర్తిస్తే.. వెంటనే వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఆ చిన్నారికి ఏదైనా చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారిస్తే అందుకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ప్రభుత్వ పరిధిలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇక అంగన్‌వాడీల్లోని పిల్లలను నిత్యం పర్యవేక్షించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించనున్నారు. ఇక పిల్లల్లో పోషకాహార లోపాన్ని ఒకేసారి తగ్గించలేని కారణంగా ఏడాదికి 5శాతం తగ్గించుకుంటూ రావాలని నిర్ణయించగా.. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని ప్రకారం చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు అందించే ఆహారంలో కొన్ని మార్పులు చేయనున్నారు. ప్రధానంగా మిల్లెట్‌ల (తృణధాన్యాల)తో కూడిన ఆహారాన్ని అందించాలని నిర్ణయించారు.

### నేటి బాలలే.. తెలంగాణ భవిష్యత్ పౌరులు



అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు చిరుతిళ్లు అందిస్తాం. రాత్రి పూట వారు తినే భోజనాన్నీ పర్యవేక్షిస్తాం. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు గ్రోత్ స్టేటస్ తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలో న్యూట్రిషన్ ప్లాన్‌తోపాటు ఓ కమిటీని కూడా ఏర్పాటుచేయాలని అనుకుంటున్నాం. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారు. నేటి బాలలే.. రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులు. ఆ భవిష్యత్తును చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకెళ్తున్నాం.

- సీతక్క, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి

### పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ

ఇటీవల వచ్చిన పలు నివేదికల్లో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాల కంటే తెలంగాణలోని కౌమార దశ పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడంతోపాటు బాలికల్లో రక్తహీనత సమస్య ఉందని తేలినట్లు సమాచారం. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, యూఆర్ఎస్‌లు, గురుకులాలు, ఎయిడెడ్ స్కూళ్లలో ఉన్న సుమారు 24 లక్షల మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఆ తరువాత విద్యార్థుల వయసు వారీగా, వారికి ఉన్న సమస్యకు అవసరమైన పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వనున్నా రు. అలాగే తల్లిదండ్రులకు కూడా పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారంపై అవగాహన కల్పించనున్నారు.

## ఫాదర్ కొలంబో వైద్య కళాశాల గుర్తింపు రద్దు

- కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలను నిలిపివేసిన ఎన్ఎంసీ

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో వైద్య కళాశాల గుర్తింపును జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) రద్దు చేసి, కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలను నిలిపివేసింది. 150 సీట్లున్న ఆ కళాశాలకు రెండేళ్ల కిందటే ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం కళాశాలలో రెండు ఎంబీబీఎస్ బ్యాచుల విద్యార్థులున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. కళాశాల గుర్తింపు రద్దు వెనుక గతంలో కళాశాలలో తనిఖీలకు వచ్చిన అధికారులకు యాజమాన్యం లంచం ఇచ్చిన కేసు ప్రభావం చూపిందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 30 వరకు ప్రైవేటు వైద్య కళాశాలలున్నాయి. వాటిలో రెండు కళాశాలలు గత ఏడాది డీమ్డ్ యూనివర్సిటీగా మారాయి. ఫాదర్ కొలంబో కళాశాల గుర్తింపు రద్దుతో ఈ ఏడాది మిగిలిన 27 కళాశాలల్లోని సీట్లకే కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

### లంచం కేసు ప్రభావమే..

వైద్య కళాశాలల్లో తనిఖీలకు వచ్చిన ఎన్ఎంసీ బృందాలకు లంచాలు ఇచ్చారన్న ఆరోపణలపై దేశవ్యాప్తంగా పలు వైద్య కళాశాలలు, మధ్యవర్తులు, ఎన్ఎంసీ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఎన్ఎంసీ నిబంధనల మేరకు కళాశాలల్లో అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేకపోయినా.. తమ కళాశాలలకు అనుకూలంగా నివేదికలివ్వాలని మధ్యవర్తుల ద్వారా వాటి యాజమాన్యాలు ఎన్ఎంసీ అధికారులకు లక్షల్లో లంచాలు ముట్టజెప్పాయి. దానిపై గత నెల 30న సీబీఐ కేసు నమోదు చేసింది. అందులో తెలంగాణకు చెందిన పలు కళాశాలల పేర్లు కూడా వెలుగులోకి వచ్చాయి. అందులో ఫాదర్ కొలంబో వైద్య కళాశాల కూడా ఉంది. కళాశాల ట్రస్టీ ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి రెండు విడతల్లో 20 లక్షలు, 46 లక్షల రూపాయల చొప్పున లంచం చెల్లించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ కేసు ప్రభావంతోనే కళాశాల గుర్తింపు రద్దయిందని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. సీబీఐ ఎఫ్ఐఆర్‌లో 36 మంది పేర్లుండగా, అందులో ఆరుగురు ఏపీ, తెలంగాణకు చెందిన వారున్నారు. తెలంగాణకు చెందిన ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ రజనీరెడ్డి పేరును కూడా సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

## హెచ్‌సీఏ కార్యాలయంలో సీఐడీ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి జరిగిన ఆర్థిక లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. టెండర్లు ఇవ్వకుండానే పనులు అప్పగించడం, డెలివరీ కాకుండానే బిల్లుల చెల్లింపునకు సంబంధించిన అంశాలపై దృష్టిసారించారు.

### క్విడ్‌ప్రో కో కోణంలో ఈడీ విచారణ

సీఐడీతో సమాంతరంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో జగన్ బృందం 'క్విడ్‌ప్రో కో'కు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. టెండర్లు లేకుండానే కాంట్రాక్టులను అప్పగించడం, క్రికెట్ బాల్స్ డెలివరీ కాకుండానే.. రూ.1.03 కోట్లను చెల్లించడం.. ఫుడ్ ,హోటల్ కాంట్రాక్టులు, సుందరీకరణ పనులు, పబ్లిసిటీ, టికెట్ల అమ్మకాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. నిబంధనలను బేఖాతరు చేసి.. కాంట్రాక్టులను ఇవ్వడం ద్వారా జగన్‌కు భారీగానే ప్రతిఫలం ముట్టినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో జగన్ కుటుంబ సభ్యులు, సన్నిహితుల బ్యాంకు లావాదేవీలను ఈడీ అధికారులు పరిశీలిస్తున్నారు. గతంలోనూ అజారుద్దీన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హెచ్‌సీఏ కార్యదర్శి సురేందర్ అగర్వాల్ క్రికెట్ బాల్స్, జిమ్ సామగ్రి, స్టేడియం కుర్చీల విషయంలో కొన్ని కంపెనీలకు లబ్ధి చేకూర్చి.. ఆయా కంపెనీల ద్వారా ఆయన భార్య, కుమారుడి ఖాతాల్లోకి డబ్బు తెప్పించుకున్న విషయాన్ని ఇప్పటికే ఈడీ గుర్తించింది. దాదాపు రూ.90లక్షల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

హుస్నాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని బీసీ సంక్షేమ వసతిగృహంలో ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. వారిని హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతున్నారు. కరీంనగర్ పట్టణానికి చెందిన మనోజ్, ఆనంద్ హుస్నాబాద్ బీసీ హాస్టల్‌లో ఉంటూ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇద్దరు విద్యార్థులు ఇతర విద్యార్థుల తినుబండారాలను తినడంతో.. వారు వార్డెన్ భద్రయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఇద్దరు విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లి ఉపాధ్యాయుల ఎదుట.. చెడు వ్యసనాలు మానకపోతే ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. అనంతరం హాస్టల్‌కు వెళ్తున్నామని చెప్పిన విద్యార్థులు సమీపంలోని మామిడి తోటకు వెళ్లి పురుగుల మందు తాగారు. గమనించిన విద్యార్థులు వార్డెన్‌కు చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే వీరి ఆత్మహత్యాయత్నంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారు చెడు వ్యసనాలకు అలవాటు పడటంతో మందలించామని, దీంతో ఈ ఘటనకు పాల్పడ్డారని వార్డెన్ చెబుతున్నాడు. బాధిత విద్యార్థుల్లో ఒకరి తండ్రి మాత్రం హాస్టల్‌లో పనిచేసే ఒకరు.. తమ కుమారుడితో బాత్రూమ్‌లు కడించేవాడని, ఎక్కడ సిగరెట్ కనిపించినా.. తనే తాగుతున్నాడని వేధించడం వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపించాడు.

## 4 వరసలుగా..

# 15 జాతీయ రహదారులు

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేస్తే, వాటిలో కొన్నింటిని మాత్రమే మంజూరు చేసేది. ఇప్పుడా నిబంధనను తొలగించి, రాష్ట్రాల పరిధిలో ఉన్న జాతీయ రోడ్ల విస్తరణకు ఎలాంటి ఆంక్షలు లేకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తి చేసిన మేరకు మంజూరు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ రహదారుల అభివృద్ధికి అవసరమైన భూ సేకరణ, అటవీ ప్రాంతాల మీదుగా పనులు చేయాల్సి ఉంటే అటవీ అనుమతులతో పాటు పర్యావరణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలి. వాటితో పాటు సమగ్ర నివేదికను సమర్పించాలి. అన్ని వివరాలు సమగ్రంగా అందినట్లు కేంద్రం భావిస్తే వెంటనే ఆయా పనులకు అనుమతులు ఇస్తుంది. వాటికయ్యే మొత్తం ఖర్చును కేంద్రమే భరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు జాతీయ రహదారులను 2 నుంచి 4 వరసలుగా విస్తరించిన తర్వాత వాటిపై టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆయా రోడ్లపై ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్, అభివృద్ధి చేశాక పెరిగే ట్రాఫిక్‌ను అంచనా వేశాకే వాటిని విస్తరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం గుర్తించిన 15 రోడ్ల విస్తరణ పనులను 2028కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా ఇలా దాదాపు 10 వేల కి.మీ. మేర రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందని కేంద్రం గుర్తించింది.

### జడ్చర్ల నుంచి కోదాడ వరకు పెద్ద రోడ్డు..

ఎన్‌హెచ్-167లో జడ్చర్ల నుంచి కల్వకుర్తి- మల్లేపల్లి- హాలియా- అలీనగర్- మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కి.మీ. మేర ఉన్న రోడ్డును 4 వరసలుగా విస్తరించనున్నారు. ప్రస్తుతం ఇది రెండు వరసలుగా ఉండడంతో రద్దీ వేళల్లో ప్రయాణం ఇబ్బందిగా ఉంటోంది. గుర్తించిన 15 రోడ్ల పనుల్లో దూరం పరంగా ఇదే పెద్దది. లక్ష్యం మేరకు గుర్తించిన పనులను పూర్తిచేయగలిగితే తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా సంబంధిత వ్యాపారం పెరిగేందుకు అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### గుర్తించిన 15 రోడ్లు ఇవే..

- ఎన్‌హెచ్-167లోని జడ్చర్ల- కల్వకుర్తి- మల్లేపల్లి- హాలియా- అలీనగర్- మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-365: నకిరేకల్- మల్లంపల్లి సెక్షన్‌లోని నకిరేకల్- తానంచర్ల వరకు, నర్సంపేట బైపాస్ 181 కి.మీ.
- ఎన్‌హెచ్-563: ఖమ్మం-వరంగల్ సెక్షన్‌లో 119 కి.మీ.
- ఎన్‌హెచ్-30: విజయవాడ- జగదల్‌పూర్ సెక్షన్‌లో రుద్రంపూర్- భద్రాచలం వరకు. ఇందులో కొత్తగూడెం, పాల్వంచ బైపాస్‌రోడ్లకు అనుసంధానం. మొత్తం 100 కి.మీ.
- ఎన్‌హెచ్-365: సూర్యాపేట- జనగామ సెక్షన్‌లో 83 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-365బిబి: ఖమ్మం- సత్తుపల్లి మార్గం. 81 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-163: మన్నెగూడ- రావులపల్లి సెక్షన్‌లో 73 కి.మీ.
- ఎన్‌హెచ్-765డి: హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి మెదక్ సెక్షన్ వరకు 63 కి.మీ.
- ఎన్‌హెచ్-353సి: పరకాల బైపాస్, భూపాలపల్లి బైపాస్ వరకు 61 కి.మీ.
- ఎన్‌హెచ్-61: కల్యాణ్- నిర్మల్ సెక్షన్‌లో 53 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-63: బోధన్- నిజామాబాద్ సెక్షన్‌లోని మైనర్ బ్రిడ్జిని 4 లేన్లుగా మార్చడం. ఇదే మార్గంలో 4 లేన్లుగా రోడ్డు, మరో చోట ఆర్వోబీ నిర్మాణంతో పాటు మహారాష్ట్ర సరిహద్దు నుంచి బోధన్ వరకు మిగిలిన పనుల పూర్తి. మొత్తం 36 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-163: హైదరాబాద్- భూపాలపట్నం మార్గంలో ఒకచోట విస్తరణ, రెండు చోట్ల మేజర్ బ్రిడ్జిల నిర్మాణం, మరో చోట రోడ్డు విస్తరణ. మొత్తం 26 కిలోమీటర్లు.
- ఎన్‌హెచ్-167, ఎన్‌హెచ్-167ఎన్: మహబూబ్‌నగర్ బైపాస్ నిర్మాణం. ఇది 11 కి.మీ. ఉండనుంది.
- ఎన్‌హెచ్-63: నిజామాబాద్- జగదళ్‌పూర్ సెక్షన్‌లో రహదారి విస్తరణ, ఒకచోట మేజర్ బ్రిడ్జి నిర్మాణం. ఇది 10 కి.మీ.
- ఎన్‌హెచ్-765డి: మెదక్ బైపాస్ నిర్మాణం. ఇది 7 కిలోమీటర్లు ఉండనుంది.

# ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్

- పాస్‌బుక్ జారీకి 2 లక్షలు డిమాండ్
- మంచిర్యాల జిల్లాలో దొరికిన ముగ్గురు కార్మికశాఖ అధికారులు
- కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్ ఆఫీసులో సోదాలు



ఏసీబీకి చిక్కిన డీటీ భవానీ; కార్మిక అధికారులు రామ్మోహన్, సుకన్య

ములుగు/పాల్వంచ/నస్పూర్/మంచిర్యాల క్రైం/బెల్లింపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు, సోదాలు కొనసాగుతున్నా.. లంచాలకు అలవాటు పడిన అధికారుల తీరు మారట్లేదు. 16 గుంటల భూమికి పట్టా పాస్‌బుక్ జారీ చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన ఓ డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట జిల్లా ములుగులో ఈ ఘటన చోటు చేసుకుంది. సింగన్నగూడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 16 గుంటల భూమిని తన బంధువుల పేరిట పట్టా చేసేందుకు పెట్టుకున్న దరఖాస్తును ప్రాసెస్ చేసేందుకు డిప్యూటీ తహసీల్దార్ భవానీ రూ.2లక్షలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బాధితుడు ఏసీబీని ఆశ్రయించి.. సాక్ష్యాలుగా తన వద్ద ఉన్న కాల్ రికార్డింగ్స్, భూమి ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు చేసుకున్న జిరాక్స్ పత్రాలను అందించారు. దీంతో ఏసీబీ అధికారులు ములుగు తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేసి డిప్యూటీ తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఇక మంచిర్యాల జిల్లాలో కార్మిక శాఖకు చెందిన ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. భవన నిర్మాణ కార్మికుడైన తన సోదరుడు మరణించడంతో ఓ వ్యక్తి లేబర్ ఇన్సూరెన్స్ ద్వారా అందాల్సిన ప్రమాద బీమా రూ.6.30 లక్షల కోసం మంచిర్యాల సహాయ కార్మిక అధికారి (కాగజ్‌నగర్ ఇన్‌చార్జ్) కాటం రామ్మోహన్‌ను సంప్రదించాడు. దీంతో ఆయన రూ.1.50లక్షల లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చెప్పిన బాధితుడు.. చివరకు రూ.50 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలోనే రామ్మోహన్ తన ఇంట్లోనే రూ.50 వేలు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో.. బెల్లంపల్లి సహాయ కార్మిక అధికారి సుకన్య, అసిస్టెంట్ రాజేశ్వరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భవన నిర్మాణ కార్మికుడైన తన భర్త చనిపోవడంతో ఓ మహిళ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.1.30లక్షల బీమా డబ్బు కోసం సుకన్యను సంప్రదించింది. అయితే లంచంగా ఆమె రూ.40 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు ఏసీబీని సంప్రదించింది. బాధితురాలు నుంచి కార్యాలయ అసిస్టెంట్ రాజేశ్వరి డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

### పాల్వంచ డివిజన్ కార్యాలయంలో సోదాలు

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రతీ విభాగంలోని అధికారులను, సిబ్బందిని విచారించారు. అలాగే తనిఖీ చేసి.. అక్రమ పద్ధతిలో వారి వద్ద ఉన్న రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. చివరిగా కార్పొరేషన్ కమిషనర్ సుజాత, మేనేజర్ ఎల్వీ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌ను వేర్వేరుగా విచారించారు. పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో అక్రమాలను గుర్తించామని, తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిస్తామని ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.